
‘ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 3

సోమవారం 26-3-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



స్మిత్, వార్నర్‌లపై వేటు

కెప్టెన్సీ, వైస్ కెప్టెన్సీ తొలగింపు. జీవితకాల నిషేధానికీ అవకాశం -స్పోర్ట్స్‌లో



ఐదు రోజులే..!

పన్ను ఆదాకు వివిధ పెట్టుబడి మార్గాలపై ప్రత్యేక కథనం. - 12లో


పాస్‌బుక్కుంటేనే.. చెక్కు పాస్



- పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వ నిబంధన
- బ్యాంకుల వద్ద గుర్తింపుపత్రంగా పాస్‌బుక్
- మొత్తం 72 లక్షల ఖాతాల్లో 57 లక్షలకే ఆమోదం

- వివరాలు 2లో

ముఖంతోనూ ఆధార్ ధ్రువీకరణ



- వృద్ధాప్యంతో వేలిముద్రలు చెరిగిపోయిన, మసకబారిన వారికి ఆధార్ ధ్రువీకరణ సమయంలో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ముఖంతోనూ ఆధార్ ధ్రువీకరణ చేపట్టేందుకు ఆధార్ ప్రాధికార సంస్థ సమాయత్తమవుతోంది. జూలై 1 నుంచే ఈ విధానం అమల్లోకి రానుంది.

- వివరాలు 5లో

సీపీఎస్ పోవాల్సిందే

సకల ఉద్యోగుల మహాసభ డిమాండ్

అప్పటిదాకా పోరు కొనసాగిస్తాం

- రద్దు బాధ్యత సీఎం పైనే పెడుతున్నాం
- ఏపీలో పని చేస్తున్న వారిని వెనక్కి తీసుకురావాలి
- ఏప్రిల్ నెలాఖరులోగా బదిలీలు చేపట్టాలి
- ఆర్డర్ టు సర్వ్‌ను రద్దు చేయాలి
- ఏప్రిల్ లోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- హైదరాబాద్ సభలో నినదించిన ఉద్యోగ సంఘాల నేతలు

ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన టీఈజేఏసీ సకల జనుల మహాసభలో ఉద్యోగ సంఘాల నేతల అభివాదం



సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సీపీఎస్) రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సకల ఉద్యోగుల మహాసభ తీర్మానించింది. సీపీఎస్ రద్దు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ బాధ్యతను ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనే పెడుతున్నట్లు ప్రకటించింది. ఉద్యోగుల సమస్యలను ఏప్రిల్ నెలాఖరులోగా పరిష్కరించాలని, లేదంటే తదుపరి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపింది. ఆదివారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ (టీఈజేఏసీ) సకల జనుల మహాసభను నిర్వహించింది. టీఈజేఏసీ చైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి సభకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. ‘‘ఈ నాలుగేళ్ల కాలంలో ఉద్యోగుల అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అందులో కొన్ని పరిష్కారమైనా ఇంకా చాలా సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు సిబ్బంది రెగ్యులరైజేషన్, ఆంధ్రాలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించడం వంటి అనేక సమస్యలు పరిష్కారం కాలేదు. వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి’’అని ఆయన డిమాండ్ చేశారు. టీఈజేఏసీ సెక్రటరీ జనరల్ మమత మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్ అయ్యాక పెన్షనే ఆధారమని, కానీ సీపీఎస్‌తో అలాంటి భద్రత లేదన్నారు. ‘‘సీపీఎస్ అమల్లోకి

మిగతా 2వ పేజీలో ▶

ప్రమాదానికి గురైన ఆటోను బావిలో నుంచి బయటకు తీస్తున్న దృశ్యం



బావిలో పడ్డ ఆటో

నిజామాబాద్ జిల్లాలో దారుణం

11 మంది దుర్మరణం

- మృతుల్లో ఆరుగురు చిన్నారులు.. ఐదుగురు మహిళలు
- మరో తొమ్మిది మందికి గాయాలు
- ఓవర్‌లోడ్, మితిమీరిన వేగం వల్లే ప్రమాదం
- ఏకంగా 19 మందిని కుక్కేసిన డ్రైవర్
- రక్షణ ఏర్పాట్లు లేకుండా రోడ్డుకు 2 మీటర్ల పక్కనే బావి
- ప్రమాదం నుంచి బయటపడిన 2 నెలల చిన్నారి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్, బాల్కొండ

ఓ ఆటో.. నలుగురిని మాత్రమే తీసుకెళ్లాల్సిన డ్రైవర్ 19 మందిని కుక్కేశాడు.. డ్రైవర్ సహా 20 మందితో ఆటో బయల్దేరింది.. మరో రెండు నిమిషాల్లో వారంతా క్షేమంగా గమ్యస్థానం చేరుకునేవారే.. కానీ అంతలోనే మృత్యువు కాటేసింది.. ఓవర్‌లోడ్‌కు మితిమీరిన వేగం తోడవడంతో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి ఆటో పల్టీ కొట్టింది.. ఈ ఘోర దుర్ఘటనలో 11 మంది మృత్యువాత పడ్డారు! మృతుల్లో ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. డ్రైవర్‌తోపాటు తొమ్మిది మందికి గాయాలయ్యాయి. చనిపోయినవారిలో ఒకే కుటుంబానికి చెందినవారు నలుగురున్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రం శివారులో ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. మృతులంతా నిజామాబాద్ జిల్లా వాసులే. ఈ ఘోర ప్రమాదం పట్ల సీఎం కేసీఆర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల

మిగతా 6వ పేజీలో ▶



మరో రెండ్రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు!

- పంచాయతీరాజ్ బిల్లుపై చర్చించేందుకే...
- సభ పొడిగింపుపై బీఏసీ భేటీలో అధికారిక నిర్ణయం - 6లో

సర్పంచ్ ఎన్నిక.. ప్రత్యక్షంగానే!

పరోక్ష ఎన్నిక ప్రతిపాదనపై వెనక్కి

- రొటేషన్ రిజర్వేషన్ విధానంలో మార్పు.. ఇకపై వరుసగా పదేళ్లపాటు ఒకే రిజర్వేషన్
- రేపు కేబినెట్ భేటీలో రెండు బిల్లులకు ఆమోదం!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలను ఇప్పుడున్నట్లుగానే ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త పంచాయతీ చట్టం రూపకల్పన సందర్భంగా సర్పంచ్ ఎన్నికలను పరోక్షంగా నిర్వహించే అంశంపై ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. ముఖ్యమంత్రి సూచనల మేరకు వివిధ మార్గాలను పరిశీలించింది. అదే సమయంలో పంచాయతీరాజ్ చట్టంలో మార్పుచేర్పులు చేయడానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. పలుమార్లు సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం వివిధ సంస్థలు, నిపుణులతో చర్చించిన తర్వాత తుది నివేదికను ముఖ్యమంత్రికి అందించింది. ఈ నివేదిక ప్రకారం పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించాలనే యోచనకు ప్రభుత్వం స్వస్తిపలికినట్లు

మిగతా 2వ పేజీలో ▶



యువ వైద్యుడు ఆత్మహత్య

హైదరాబాద్ నిమ్స్‌లో ఉరి వేసుకున్న శివతేజరెడ్డి

- వెల్లడికాని కారణాలు.. వైద్య సేవలు, సామాజిక స్పృహలో ఎప్పుడూ ముందే..
- మృతుడి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు

వివరాలు 2లో

పేదలదే నవ భారతం

హేళన చేసిన వారందరినీ ఓడించి అంబేడ్కర్ గెలిచారు

ఏప్రిల్ 14 నుంచి గ్రామ్ స్వరాజ్ అభియాన్

మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ



5లో

“ చాలా మంది అంబేడ్కర్‌ను అవహేళన చేశారు. వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి ముందుకెళ్లొద్దని ఆయన్ను వెనక్కు లాగేందుకు అనుక్షణం ప్రయత్నించారు. ఆయన అభ్యుదయ భావాలను అడ్డుకున్నారు. కానీ నేటి పరిస్థితి భిన్నంగా ఉంది. అంబేడ్కర్ కలలుగన్న పేదలు, వెనుకబడిన వర్గాల నవభారత చిత్రం మన ముందుంది.

– ప్రధాని మోదీ

ఇదంజగత్



నాకవన్నీ తెలియదు! ఇక్కడ నన్ను ఫాలో అవడం కాదు.. ట్వీటర్‌లో ఫాలో కావాల్సిందే..!

‘కోట్లు’ కరిగిస్తున్న కొవ్వు

ట్రీట్‌మెంట్‌కు రాజధానిలో ఏటా రూ.275 కోట్లు వెచ్చిస్తున్న ఒబేసిటీ బాధితులు

సాక్షి, హైదరాబాద్

- ఏటేటా పెరిగిపోతున్న స్థూలకాయం సమస్య
- బాధితుల్లో ఎక్కువ మంది టెకీలే..
- పెళ్లికి ముందు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్న యువత
- చికిత్సకు వేల నుంచి లక్షల్లో ప్యాకేజీలు



రాజశేఖర్.. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్.. వయసు 29.. మంచి జీతం.. అంతా బాగానే ఉంది.. పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఓ సంబంధం చూశారు.. పెళ్లి చూపులకెళ్లారు.. అయితే అక్కడ అమ్మాయికి రాజశేఖర్ నచ్చలేదు! కాస్త లావుగా ఉండటమే అందుకు కారణం. ఎలాగైనా లావు తగ్గాలన్న ఉద్దేశంతో రాజశేఖర్ ఒబేసిటీ ట్రీట్‌మెంట్‌కు వెళ్లాడు. ఇలా ఆయన ఒక్కరే కాదు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 14 శాతం మంది యువకులది ఇదే బాధ. ఒబేసిటీ కారణంగా వారంతా పెళ్లి చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్టు తాజాగా ఆరోగ్య సంస్థలు చేసిన అధ్యయనంలో బయటపడింది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో వారు బరువు పెరిగిపోతున్నట్టు డాక్టర్లు చెబుతున్నారు.

ఎక్కువ మంది టెకీలే..

రాష్ట్ర రాజధానిలో సుమారు 150 వరకు ఒబేసిటీ క్లినిక్‌లున్నాయి. ఒక్కో క్లినిక్‌కు నిత్యం 25 నుంచి 30 మంది వస్తున్నారు. ఈ లెక్కన 3,700 నుంచి 4,500 మంది వరకు ఒబేసిటీ చికిత్స కేంద్రాలను సంప్రదిస్తున్నారు. వీరిలో 65 శాతం మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే ఉన్నారని, వారిలోనూ పెళ్లికి ముందు బరువు తగ్గించుకోవాలనుకునేవారే ఎక్కువగా ఉంటున్నారు. కొన్ని ప్రముఖ క్లినిక్‌లు వారం నుంచి పదిహేను రోజులు, నెల నుంచి రెండు నెలల పాటు ఉండే ట్రీట్‌మెంట్‌కు రూ.65 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఏటా హైదరాబాద్‌లోనే ఒబేసిటీ ట్రీట్‌మెంట్‌కు బాధితులు రూ. 243 కోట్ల నుంచి రూ. 275 కోట్ల దాకా వెచ్చిస్తున్నట్టు వెల్లడైంది.

లావైపోతున్నారు..

ఒబేసిటీ సమస్య ఏటేటా పెరిగిపోతున్నట్టు 2015–16లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ చేపట్టిన ‘నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే’లో తేలింది. తెలంగాణలో 32 శాతం మంది మహిళలు, 29 శాతం మంది పురుషులు ఒబేసిటీతో బాధపడుతున్నట్టు ఈ అధ్యయనంలో స్పష్టమైంది. 2005–06లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేసిన అధ్యయనంలో 17.7 శాతం మంది మహిళలు, 17.6 శాతం మంది పురుషులు అధిక బరువుతో ఇబ్బందులు పడుతున్నట్టు తేలింది.


సాక్షి ఇండియా స్పెల్‌బీ విజేతలు

సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ
కేటగిరీ-3 విజేతలు వీరే

SAKSHI INDIA SPELL Bee | MATH BEE | Dukes Waffy PRESENTS SAKSHI arena one School fest | IN ASSOCIATION WITH DELHI PUBLIC SCHOOL

హైదరాబాద్: 'సాక్షి' మీడియా గ్రూప్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ఇండియా స్పెల్‌బీ, మ్యాథ్‌బీ–2017 (కేటగిరీ–3, తెలంగాణ రాష్ట్రం) విజేతలను ప్రకటించారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు ఎంతో ఉత్కంఠగా కొనసాగాయి. చివరగా నిర్వహించిన ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విజేతలు, వారి తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై, మ్యాథ్స్ విషయంలో అంతర్గతంగా ఉన్న భయాలు పోగొట్టి, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడంతో పాటు గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఈ పోటీలు కలిగించాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

స్పెల్‌బీ ప్రథమ బహుమతి: హైదరాబాద్‌లో ది ఆగాఖాన్ అకాడమీలో చదువుతున్న వెగా దర్శి కైవసం చేసుకున్నారు. విజేతకు బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ ప్రథమ బహుమతి: హైదరాబాద్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ బ్రాంచ్‌లో చదువుతున్న వి. సాయి అఖిల్ కైవసం చేసుకున్నారు. విజేతకు బంగారు పతకంతో పాటు రూ. 15వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ ద్వితీయ బహుమతి: హైదరాబాద్‌లోని వికాస్ ది కాన్సెప్ట్ స్కూల్, బాచుపల్లిలో చదువుతున్న టి. సౌజన్య లక్ష్మి కైవసం చేసుకున్నారు. విజేతకు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ ద్వితీయ బహుమతి: హైదరాబాద్‌లోని చిరక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్న అరిత్రో రే కైవసం చేసుకున్నారు. విజేతకు రజత పతకంతో పాటు రూ. 10వేలు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

స్పెల్‌బీ తృతీయ బహుమతి: హైదరాబాద్‌లోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, బంజారాహిల్స్ బ్రాంచ్‌లో చదువుతున్న నిహారిక కైవసం చేసుకున్నారు. విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000లు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.

మ్యాథ్‌బీ తృతీయ బహుమతి: హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం బ్రాంచ్‌లో చదువుతున్న హరి వైష్ణవి కైవసం చేసుకున్నారు. విజేతకు కాంస్య పతకంతో పాటు రూ. 5,000లు, సర్టిఫికెట్, డ్యూక్ గిఫ్ట్ హాంపర్ అందజేశారు.


సాక్షి మ్యాథ్‌బీ విజేతలు

రాజన్న సన్నిధిలో రాములోరి కల్యాణం


వేములవాడలో సీతారాముల కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న వేదపండితులు

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. నగర పంచాయతీ తరఫున చైర్‌పర్సన్ నామాల ఉమ, వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, ప్రభుత్వం పక్షాన ఈవో రాజేశ్వర్ దంపతులు.. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ తంతు ఆరంభమైంది. ఉత్సవమూర్తులను మేళ తాళాల మధ్య వేదికపైకి తీసుకొచ్చారు. మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులు తలపై జీలకర్ర బెల్లం పెట్టుకుని, చేతిలో త్రిశూలం పట్టుకుని అక్షింతలు చల్లుకుంటూ రాజన్నను వివాహమాడారు. వేడుకకు 2 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యారు.

యాదాద్రిలో ఘనంగా శ్రీరామనవమి


యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనారసింహస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాములకు దేవస్థానం తరఫున ఆలయ చైర్మన్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం 11:26నిమిషాలకు మాంగల్యధారణ పూర్తిచేశారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. -యాదగిరికొండ

సీపీఎస్ పోవాల్సిందే

► మొదటి పేజీ తరువాయి

వచ్చినప్పట్నుంచి ఇప్పటిదాకా 2 వేల మంది ఉద్యోగులు రిటైరయ్యారు. కొందరు చనిపోయారు. వారి కుటుంబాలకు ఆసరా పెన్షన్ల కంటే తక్కువ పింఛన్ వస్తోంది. ఏపీలోని ఉద్యోగుల బతుకు అగమ్యగోచరంగా మారింది. 8 ఏళ్లుగా బదిలీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులకు పోరాటాలు కొత్త కాదు. డిమాండ్లు సాధించుకునే వరకు పోరాడదాం. అందుకు ఈ సభే నాంది'' అన్నారు.

సీఎం వద్ద భజన గ్యాంగ్: రాజేందర్

టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం అలసత్వం వీడాలన్నారు. తెలంగాణ వచ్చాక ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. ''పోరాడి సాధించుకున్న తెలంగాణలో తెలంగాణ ఉద్యోగులకే అవమానాలు, అసమానతలు, ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి ఆదేశాలే అమలు కావడం లేదంటే ఎవరి వైఫల్యమో ప్రభుత్వం గుర్తించాలి. ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం ఇంకా కొనసాగుతోంది. ఆర్డర్ టు సర్వ్‌ను 18 నెలలు కొనసాగించే దుర్మార్గం ఎక్కడైనా ఉంటుందా?''అని ప్రశ్నించారు. సీఎం దగ్గర భజన గ్యాంగ్ ఉందని, సమస్యలు చెబితే సీఎం వరకు వెళ్లనీయడం లేదన్నారు. ఉద్యోగ సంఘాల నాయకులకు ప్రగతి భవన్ గేట్లు తెరవట్లేదని, కానీ తెరవాల్సిన రోజు వస్తుందన్నారు.

గంట సమయమిస్తే చాలు..

రిటైర్ అయిన ఉద్యోగులకు సాంత్వన చేకూరాలంటే సీపీఎస్ రద్దు చేయాల్సిందేనని టీజీవో జనరల్ సెక్రటరీ సత్యనారాయణ అన్నారు. సీఎం గంట టైం ఇస్తే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. డిమాండ్ల సాధన కోసమే ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకోకపోవడం వల్లే ఈ సభ నిర్వహించాల్సి వచ్చిందన్నారు. కొంతమంది అధికారులు సీఎంను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బదిలీల కోసం బహిరంగ సభ పెట్టిన దుస్థితి తెలంగాణలో తప్ప ఎక్కడా లేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగులను దూరం చేసుకోవద్దని, సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్ రద్దు చేస్తే దేశవ్యాప్తంగా ఉన్న 50 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు కేసీఆర్ ఫ్రంట్‌కు మద్దతు ఇస్తారన్నారు. గ్రూప్–1 అధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉందన్నారు. టీటీయూ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. చట్ట సవరణలు అనేకసార్లు చేశారని, సీపీఎస్ రద్దు కోసం మరోసారి చేయాలన్నారు. ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తున్న వారికి కనువిప్పు కలిగించాల్సిన అవసరం ఉందని రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివశంకర్ అన్నారు. సమావేశంలో ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల నేతలు ప్రసంగించారు.

సీఎంకే బాధ్యత అప్పగిద్దాం: శ్రీనివాస్‌గౌడ్

సీపీఎస్‌ను తెచ్చిందే సీఎం కేసీఆర్ అన్నట్లుగా మాట్లాడవద్దని, సీపీఎస్ రద్దు బాధ్యతను ఆయనకే అప్పగిద్దామని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సీపీఎస్ కచ్చితంగా రద్దు అవుతుందన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ.. ''ప్రభుత్వంతో వ్యూహాత్మకంగా పనులు చేయించుకోవాలి. సాధన కోసం దశల వారీ పోరాటాలు చేయాలి. సీఎం కూడా సానుకూలంగానే ఉన్నారు. అధికారులతో మాట్లాడుతున్నారు. ఆంధ్రాలోని ఉద్యోగులను కచ్చితంగా తీసుకువద్దాం''అని అన్నారు. ఆయన ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాతున్న సమయంలో కొందరు ఉద్యోగులు నిలువరించే ప్రయత్నం చేశారు. తమను వెంటనే ఇక్కడికి తేవాలంటూ సభ జరుగుతున్నంత సేపు ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు బ్యానర్ పట్టుకొని నినాదాలు చేశారు.


ఆదివారం టీఈజేఏసీ హైదరాబాద్‌లో నిర్వహించిన సభకు హాజరైన ఉద్యోగులు

ప్రధాన తీర్మానాలివీ..

- ఏపీలోని 1,200 మంది ఉద్యోగులను వెంటనే తీసుకురావాలి
- ఏప్రిల్ నెలాఖరులోగా బదిలీలు చేపట్టాలి
- ఆర్డర్ టు సర్వ్ రద్దు చేసి శాశ్వత కేటాయింపు జరపాలి
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను వేగవంతం చేయాలి
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వమే వేతనాలివ్వాలి
- సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలి
- పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి. తెలంగాణ ఇంక్రిమెంట్, రాయితీపై బస్‌పాస్ ఇవ్వాలి
- ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి. జిల్లా గ్రంథాలయాలు, మార్కెట్ కమిటీ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి
- సమస్యలను ఏప్రిల్ ఆఖర్లోగా పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం

నిమ్స్‌లో యువ వైద్యుడి ఆత్మహత్య

గదిలో ఉరేసుకున్న శివతేజరెడ్డి • సామాజిక స్పృహ ఉన్న వైద్యుడు



హైదరాబాద్: ప్రతిష్టాత్మక వైద్య సంస్థ నిమ్స్‌లో శివతేజరెడ్డి (31) అనే యువ వైద్యుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున డాక్టర్స్ క్లబ్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన శనివారం విధులు ముగించుకుని డాక్టర్స్ క్లబ్‌లోని రూమ్ నంబర్ 307కు వెళ్లాడు. ఆదివారం ఉదయం ఏడింటికి విధులకు హాజరవాల్సి ఉంది. ఎనిమిదైనా రాకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో తోటి వైద్యుడికి అనుమానం వచ్చి రూమ్‌కు వెళ్లాడు. లోపలి నుంచి గడియ ఉండటంతో ఎంతసేపు పిలిచినా తలుపు తీయలేదు. కిటికీ అద్దాలు తొలగించి చూడగా దుప్పటితో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆదివారం ఉదయం 5.20 వరకు శివతేజ వాట్సాప్ చూసినట్లు ఉంది. దాంతో ఆయన 5.30 తర్వాతే మరణించి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆయన తల్లిదండ్రులు అమెరికా నుంచి రావాల్సి ఉంది.

సొంత డబ్బుతో సేవలు

శివతేజది ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా తణుకు. సామాజిక స్పృహ ఎక్కువ. నిమ్స్‌లో రోగుల ఇబ్బందులు చూసి చలించిపోయాడు. తన వేతనం నుంచి రూ.40 వేలతో జిరాక్స్ మిషన్, జనరల్ వార్డు రోగులకు గీజర్, ఆపరేషన్ థియేటర్ వైద్యులకు అవసరమైన స్లిప్పర్లను స్పాన్సర్ చేశాడు. వారం రోజులుగా ఆయన ముభావంగా కనిపించినట్టు తోటి వైద్యులు చెబుతున్నారు.

పాస్‌బుక్కుంటేనే.. చెక్కు పాస్

పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వ నిబంధన



సాక్షి, హైదరాబాద్ : రైతుబంధు చెక్కు రైతుఖాతాలో జమ కావాలంటే పాస్ పుస్తకం ఉండాల్సిందే. రైతుల గుర్తింపుపత్రంగా పాస్‌బుక్ చూపించాల్సి ఉంది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.కె.జోషి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. పాస్‌పుస్తకాల ప్రింటింగ్‌కు కావాల్సిన సమాచారంతో వెంటనే వ్యవసాయ శాఖకు నివేదిక పంపాలని ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 72 లక్షల రైతు ఖాతాలుండగా ఇప్పటివరకు 67 లక్షల ఖాతాలను మాత్రమే తహసీల్దార్లు పూర్తి చేశారు. అందులోనూ 57 లక్షల ఖాతాల పాస్‌పుస్తకాల ముద్రణకు మాత్రమే సిఫారసు చేశారు. చెక్కుల పంపిణీకి గడువు సమీపిస్తున్నందున గ్రామాలవారీగా ఎంత భూమి ఉంది.. అందులో ఎన్ని ఖాతాలున్నాయనే వివరాలను పంపాలని, అన్ని ఖాతాలను తహసీల్దార్లు డిజిటల్ సంతకాల ద్వారా అధీకృతం చేయాలని ఎన్ఐసీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తి కానట్టు తెలుస్తోంది. భూరికార్డుల ప్రక్షాళన గణాంకాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు కూడా తేడా ఉందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఆ తేడాలను పరిశీలించి సరిచేయాలని, డ్రాఫ్ట్ పాస్ పుస్తకాన్ని డౌన్‌లోడ్ చేసి సదరు రైతుకివ్వాలని, అన్ని వివరాలు సరిగా ఉన్న తర్వాతే ఫైనల్ పాస్‌పుస్తకానికి సిఫారసు చేయాలని, ఇలాంటి భూముల వివరాలను కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు లిఖితపూర్వకంగా నిర్ధారించి ఈ నెల 24లోపు పంపాలని ఆదేశాలు జారీ చేశారు.

సీఎం కేసీఆర్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

దక్షిణ మధ్య రైల్వే @ 100 మిలియన్ టన్నులు

సరుకు రవాణాలో సరికొత్త రికార్డు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. సరుకు రవాణాలో రైల్వేలోని జోన్లలో మూడో స్థానంలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే ఈ ఏడాది వంద మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి రికార్డు సృష్టించింది. దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం విధించుకుని మరీ రికార్డుస్థాయిలో సరుకును రవాణా చేసి ఆదాయాన్ని భారీగా పెంచుకుంది. మార్చి 24 నాటికి ఈ మైలురాయిని అధిగమించినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి జరిగిన రవాణా కంటే 5.82 మిలియన్ టన్నులు ఎక్కువగా సరుకును రవాణా చేసినట్టు పేర్కొంది. స్టీల్ ప్లాంట్లకు ముడిసరుకు రవాణాలో 32శాతం, ఇంపోర్టెడ్ ఐరన్ ఓర్‌లో 200శాతం, సిమెంట్ లోడింగ్‌లో 3శాతం, ఆహార ధాన్యాలలో 38శాతం, ఎరువుల తరలింపులో 11శాతం, కంటెయినర్ లోడింగ్‌లో 20శాతం పెరిగినట్టు ప్రకటించింది. మొత్తం 100.122 మిలియన్ టన్నుల సరుకు రవాణాతో.. గతేడాది కంటే 6.2 శాతం అధికంగా రవాణా చేసినట్టు వెల్లడించింది. కొన్ని కొత్త సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు, సరుకు లోడింగ్ పెరగటమే దీనికి కారణమని పేర్కొంది.

కాళేశ్వరం లింక్-7 పనుల వేగం పెంచండి

అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం • ఏప్రిల్ 3, 4 తేదీల్లో కాళేశ్వరం పనుల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కాళేశ్వరం పనులను వేగవంతం చేయాలని అధికారులను నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింకు–7కు చెందిన ప్యాకేజీ–20, 21, 22 పనుల పురోగతిని మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం సమీక్షించారు. జిల్లాలోని శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం, కాళేశ్వరం పనులను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించేందుకు ఈ రెండు జిల్లాల్లో ఏప్రిల్ 3, 4 తేదీల్లో పర్యటించాలని మంత్రి నిర్ణయించారు. ఈ మూడు ప్యాకేజీల పర్యవేక్షణ కోసం ఒక ఎస్ఈని నియమించాలని శాఖ ఉన్నతాధికారులను హరీశ్ ఆదేశించారు. 21, 22 ప్యాకేజీల కింద కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ప్రతిపాదించిన 4 లక్షల ఎకరాలకు సాగు నీరందించే పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ మూడు ప్యాకేజీల పరిధిలో 8.50 టీఎంసీల స్టోరేజీ సామర్థ్యంతో 6 రిజర్వాయర్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు.

ఆ పనుల్లో వేగం పెంచండి: యాదాద్రి భువనగిరి జిల్లాలోని పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునియాదిగానిపల్లి కాల్వల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం, ఏజెన్సీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి గురువారం కాల్వల పనులను సమీక్షించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్‌ను ఆదేశించారు. కాలి నడకన కాల్వల వెంట పర్యటిస్తేనే సమస్యలు తెలుస్తాయని శాసన సభ్యులకు మంత్రి సూచించారు. ఆదివారం ఈ మూడు కాల్వల పురోగతిపై హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి సమీక్షించారు. పిల్లాయిపల్లి కింద 32 గ్రామాలకు, బునియాదిగానిపల్లి కింద 48, ధర్మారెడ్డిపల్లి కింద 40 గ్రామాల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. బునియాదిగానిపల్లి కాల్వ కింద గతంలో డిస్ట్రిబ్యూటరీల ప్రతిపాదనే లేదని, ప్రస్తుతం 18 డిస్ట్రిబ్యూటరీలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇందులో 96 చెరువులను నింపి, 6 వేల ఎకరాలను స్థిరీకరించనున్నట్లు తెలిపారు.

సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షంగానే!

► మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. వార్డు సభ్యులను నేరుగా ఎన్నుకోవడం, ఎన్నికైన వార్డు సభ్యులతో సర్పంచ్‌ను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకోవాలనే ప్రతిపాదన మంత్రివర్గ ఉపసంఘం ముందుకు వచ్చింది. ఇద్దరు సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేయాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే పరోక్ష ఎన్నికపై పలు విమర్శలు రావడం, పంచాయతీరాజ్‌రంగ నిపుణులు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకించడం వంటి కారణాలతో దీన్ని విరమించుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పరోక్ష పద్ధతిలో అయితే వార్డు సభ్యులను కాపాడుకోవడంతోనే పదవీకాలం గడిచిపోతుందని, అభివృద్ధి పనులపై దృష్టిపెట్టే అవకాశం కూడా సర్పంచ్‌లకు లేకుండా పోతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

రిజర్వేషన్ విధానంలో మార్పులు...

సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రొటేషన్ పద్ధతిపై ఐదేళ్లకోసారి రిజర్వేషన్‌ను మార్చేలా ప్రస్తుతమున్న విధానంలో మార్పులకు ప్రభుత్వం మొగ్గుచూపింది. ఇప్పుడు ఖరారు చేసే రిజర్వేషన్‌నే రెండో విడతకు..అంటే పదేళ్లపాటు పొడిగించాలనే ప్రతిపాదనకు మొగ్గుచూపింది. కొత్తగా పంచాయతీలు ఏర్పడటం, తండాలు, ఆదివాసీ గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు వీలుగా చట్టంలో మార్పులు చేయనున్నారు. నియోజకవర్గాలవారీగా కొత్తగా ఏర్పాటు చేయాల్సిన గ్రామ పంచాయతీలపై టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు ఇటీవలే సమావేశమయ్యారు. ఈ భేటీలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలను జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు ముఖ్యమంత్రికి అందించారు. దీనికి అనుగుణంగానే పంచాయతీరాజ్ బిల్లులో మార్పుచేర్పులు చేశారు. అయితే కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఈసారి వచ్చిన రిజర్వేషన్‌ను పదేళ్లపాటు అంటే రెండు పదవీకాలాలపాటు వరుసగా కొనసాగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. దీంతోపాటు పంచాయతీకి ఇద్దరు నిపుణులను సభ్యులుగా నామినేట్ చేయాలనే నిర్ణయాన్ని కూడా చేసినట్లు తెలుస్తోంది.

మున్సిపల్ చట్ట సవరణ...

ప్రస్తుతమున్న మున్సిపల్ చట్టానికి సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు తప్పనిసరిగా గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. అయితే దీనివల్ల కోర్టు కేసులతో మున్సిపాలిటీల అప్‌గ్రెడేషన్ ప్రక్రియ ఆగిపోతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ప్రస్తుతమున్న చట్టానికి సవరణ చేయాలని నిర్ణయం తీసుకుంది.

రేపు కేబినెట్ భేటీ...

కొత్త పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులను ఆమోదించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ప్రత్యేకంగా భేటీ కానుంది. మంగళవారం ఉదయం 9 గంటలకు సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. అసెంబ్లీలోనే మంత్రివర్గ సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి.

టెలీమెట్రీ లోపభూయిష్టం!

తేల్చిన కృష్ణా బోర్డు కమిటీ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల వినియోగం, నీటి విడుదల లెక్కలు పక్కాగా ఉండేందుకు సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఏర్పాటుచేసిన టెలీమెట్రీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని కృష్ణాబోర్డు నియమించిన నిపుణుల కమిటీ తేల్చింది. టెలీమెట్రీ ఏర్పాటుచేసిన ప్రాంతాలు, పరికరాల ఎంపిక తప్పుల తడకగా ఉందని స్పష్టంచేసింది. ఇప్పుడున్న పరికరాలతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, వేరే రకమైన పరికరాలు, సాంకేతికంగా అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని కమిటీ తన నివేదికలో పేర్కొంది. కృష్ణా ప్రాజెక్టుల పరిధి లో మొదటి విడతలో 18 చోట్ల టెలీమెట్రీలు ఏర్పాటుచేశారు. ఇందులో పోతిరెడ్డిపాడు కింది నీటివినియోగంపై అనేక ఆరోపణలొచ్చాయి. దీనిపై గతంలో బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు చేసింది.



ఒక్కసారి చెల్లించండి ...
భద్రతతో కూడిన
సమృద్ధిని పొందండి!
ఎల్ ఐ సి వారి
జీవన్ ఉత్కర్ష్
Plan No. 846 UIN : 512N313V01
ఒక నాన్-లింక్డ్, లాభాలతో కూడిన సింగిల్ ప్రీమియం ప్లాన్
అర్హత నిబంధనలు
కనీస ప్రవేశ వయస్సు : 6 సంవత్సరాలు
గరిష్ఠ ప్రవేశ వయస్సు : 47 సంవత్సరాలు
కనీస ప్రాథమిక బీమా రాశి: రూ 75,000/-
గరిష్ఠ ప్రాథమిక బీమా రాశి: అపరిమితం
పాలసీ వ్యవధి: 12 సంవత్సరాలు
ప్రీమియం చెల్లింపు పద్ధతి: సింగిల్ ప్రీమియం
సులభమైన లిక్విడిటీ
ఋణం పొందే సదుపాయం: పాలసీ జారీచేసిన తేదీ నుంచి 3 నెలల తర్వాత
5 సంవత్సరాల తర్వాత నిష్క్రమించిన పక్షంలో, లాయల్టీ అడిషన్, ఏమైన ఉంటే, చెల్లించబడును
మీ ఏజెంట్ / బ్రాంచ్‌ని సంప్రదించండి లేదా
మా వెబ్‌సైట్ www.licindia.in ని సందర్శించండి.
లేదా 'YOUR CITY NAME' 56767474 కి ఎస్ఎమ్ఎస్ చేయండి (e.g. 'Mumbai')
Follow us on: LIC India Forever
కొనుగోలు నిర్ణయం తీసుకొనే ముందు రిస్క్ అంశాలు, షరతులు, నిబంధనలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి మా సేల్స్ బ్రోచర్‌ను జాగ్రత్తగా చదవండి
IRDAI Regn No.:512
LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA
జీవితాంతం - జీవితానంతరం కూడా.



BUILT QDR TOYOTA Quality Revolution
DRIVE THE NATION
NEW LIVA ETIOS
BENEFITS UPTO ₹ 30,000*
LOW EMI OF ₹ 8,999*
THE NEW PLATINUM ETIOS
BENEFITS UPTO ₹ 50,000*
LOW EMI OF ₹ 9,999*
ETIOS CROSS
BENEFITS UPTO ₹ 40,000*
LOW EMI OF ₹ 8,999*
EXCLUSIVE OFFERS FOR GOVERNMENT EMPLOYEES.
TO SAY "WE THANK YOU".
ALL NEW INNOVA CRYSTA
BENEFITS UPTO ₹ 15,000*
LOW EMI OF ₹ 20,999*
ALL NEW COROLLA ALTIS THE NEW BENCHMARK
BENEFITS UPTO ₹ 1,00,000*
LOW EMI OF ₹ 19,999*
• 100% FINANCE*
• 8 YEAR LOAN TENURE*
• ZERO DOWN PAYMENT*
• LOWEST EMI*
• BEST EXCHANGE OFFERS*
SHOWROOMS OPEN ON SUNDAYS
*Terms & conditions apply. Finance at the sole discretion of the financier. Customer benefits inclusive of exchange bonus and the maximum benefits applicable under the finance scheme. ##Conditions Apply.^Applicable on all models for Central & State Govt. Employees under the Drive the Nation Sales Program. Exchange bonus applicable on Etios, Corolla models only
YASHODA KRISHNA TOYOTA 3-6-289, Hyderguda Main Road Hyderguda, Hyderabad – 500029. Call: 90009 23639, 90005 00155 Toll Free No.: 1800 3000 3984 For Exchange: 99590 90684
YASHODA KRISHNA TOYOTA D.No : 2-4-1, Nr Uppal bus stand Uppal, Hyderabad - 39. Call: 90009 04796, 99590 90670 Toll Free No.: 1800 3000 3984 For Exchange: 99591 13050
HARSHA TOYOTA D.No.5-5-1095, Malleswari Complex, Opp. Vishnu theater, L.B. Nagar, Hyd - 74. Call: 90009 00527, 91778 55155 3999 7999 For Service Appointment : 98667 36524. E-mail : hy02a_salesmrkt@harshaauto.com For Exchange: 80088 02471
HARSHA TOYOTA D. No.2-40/5, Kondapur, Hyderabad - 84 Call: 90009 00527 91778 55155, 3999 7999 For Service Appointment: 98667 36524. E-mail: hy02a_salesmrkt@harshaauto.com For Exchange: 97045 67355
RADHA KRISHNA TOYOTA Main Road, Sanathnagar, Hyderabad - 18 Call: 99595 59307, 99595 59309 Toll Free No.: 1800 3000 3984 For Exchange: 87904 22553




HONDA The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
GARRICK THEATRE
కొత్త CB 125 Shine SP
ఎఫర్ట్‌లెస్ స్టైల్
మీరు స్పెషల్ అయినప్పుడు, అంతా మీకు సులభమై పోతాయి.
డిజిటల్ అనలాగ్ మీటర్
5 SPEED TRANSMISSION 5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్
ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్ ఆన్ 'AHO'
LIGHT ON. RIGHT ON.
లో రోలింగ్ రెసిస్టెన్స్ టైర్
₹ 5,999# డౌన్ పేమెంట్
0 ప్రాసెసింగ్ ఫీజు#
HET BS-IV
HDFC BANK We understand your world
IndusInd Bank
L&T Financial Services
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commerical Complex II, Sector-49-50. Golf Course Extension Road, Gurugram - 122 018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
#T&C Applied. Offer valid till 31st March, 2018. Finance Scheme available through select preferred financiers at their sole discretion. Rs. 5999 down payment subject to financier policy. Finance Scheme is for limited time period & financier can withdraw scheme any time without giving prior notice. For more details please contact your nearest Honda dealership. Product shown in the picture may vary from actual, Application of Combi Brake System on Honda Motorcycles upon engaging the foot pedal. Efficiency of braking depends upon the riding conditions and speed of the vehicle. **Conditions apply.
ALWAYS WEAR HELMET WHILE RIDING
Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: NALGONDA: Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; MIRYALGUDA: Mereddy Honda - 9618688155, 08689230666/7; KODAD: Mereddy Honda - 08683253925, 9618688177; SURYAPET: Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; DEVARAKONDA: Sri Honda - 8688111770, 08691-252225; HALIA: Mereddy Honda - 9618688166, 08680278822; BHONGIR: Kushal Honda - 08685-243555, 9154308152; MOTHKUR: Kushal Honda - 08694-287999, 9949939988; THIRUMALGIRI: Saraswathi Honda - 08693-243243 9505243243; BIBINAGAR: Kakateeya Honda - 9949588911, 9121886912; CHITIYAL: Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; ALER: Kushal Honda - 9951208888; CHOUTUPPAL: Kushal Honda - 7330869678.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

జీవితాన్ని కట్టిన హారం

దురదృష్టవశాత్తూ మెటీల్డ్ ఒక గుమస్తా కుటుంబంలో పుట్టిందిగానీ ఆమెలాంటి అందగత్తెలు ఎప్పుడోగానీ జన్మించరు!

అదే విధిరాత వల్ల ఆమె ప్రభుత్వ విద్యాశాఖలో ఒక చిన్న గుమస్తాను పెళ్లాడింది. జీవితం ప్రసాదించిన అన్ని భోగాలనూ అనుభవించలేక పోతున్నానన్న క్షోభ ఆమెను వెంటాడేది.



అలంకార రహితమైన గోడలూ, చవకరకం కుర్చీలూ, వికారమైన తెరలూ దుఃఖం కలిగించేవి. ఆమెకు గౌన్లు లేవు, ఆభరణాలు లేవు, ఏమీలేవు. అలా ఉండటం కోసమే పుట్టానేమో అనుకునేది. అందరూ తనను చూసి అసూయపడేట్టు బతగ్గలిగితే ఎంత బాగుంటుంది!

ఒక సాయంత్రం ఆమె భర్త చేతిలో ఒక పెద్ద ఎన్వెలప్‌తో వచ్చాడు. ఆమె ఆత్రంగా చింపి, అందులో ఉన్న పదాలు చదివింది. 'విద్యాశాఖ మంత్రి జార్జెస్ ర్యాంపోనూ జనవరి 18, సోమవారం సాయంత్రం ఇవ్వనున్న విందుకు శ్రీమతి మరియు శ్రీ లొయిజెల్‌ను మంత్రిత్వ శాఖ భవనానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం'.

చూడగానే ఎంతో సంబరపడుతుందనుకున్న భార్య ఆహ్వానపత్రాన్ని టేబుల్ మీద పడేసి, 'దానితో నేను ఏం చేయాలి?' అని గొణుక్కుంది. దేనికీ బయటికి వెళ్లని భార్యకు ఇదో గొప్ప అవకాశం అనుకున్నాడతను. అసలు చాలామంది గుమస్తాలకు అందులో ప్రవేశమే లేదు. కష్టపడి ఈ ఆహ్వానాన్ని సంపాదించాడు.

'మరి ఏం వేసుకుని వెళ్లాలి?' అనేది ఆమె సమస్య. అతడు దాని గురించి ఆలోచించలేదు.

'థియేటర్‌కు వెళ్లేప్పుడు వేసుకునే గౌన్. అందులో నువ్వు నాకు బాగా కనబడతావు'.

ఆమె మౌనంగా రోదించడం మొదలుపెట్టింది. 'నేను వెళ్లలేను, అన్నీవున్న ఇంకెవరి భార్యకైనా ఇచ్చేయండి'.

అతడు నిరుత్సాహపడ్డాడు. 'ఇదిగో, ఇటు చూడు, మెటీల్డ్. మళ్లీ వేరే సందర్భాలకు కూడా వేసుకునే ఒక... మామూలు గౌన్ ఎంతవుతుంది?'

అన్ని లెక్కలూ వేసి, భర్త వెంటనే తిరస్కరించకుండా, అలాగని భయపడే మొత్తం కూడా కాకుండా, 'కచ్చితంగా తెలీదు. ఒక నాలుగు వందల ఫ్రాంకులైతే సరిపోతాయేమో' అంది.

అతడి ముఖం పాలిపోయింది. సరిగ్గా అంతే మొత్తాన్ని అతడు వచ్చే వేసవిలో తన స్నేహితులతో కలిసి నాంటెర్ మైదానాల్లో భరత పక్షులను వేటాడ్డంకోసం ఒక తుపాకీని కొనడానికి పక్కన పెట్టుకున్నాడు.

'సరే మంచిది. నేను నాలుగు వందల ఫ్రాంకులు ఇస్తాను. అందమైన గౌను కొనుక్కో'.

విందు రోజు దగ్గరపడుతోంది. మేడమ్ లొయిజెల్ గౌను సిద్ధమైంది. అయినా ఆమె అసహనంగానే కనబడింది. భర్త కారణం అడిగాడు. 'ఒక్క నగ కూడా లేదు. నా దరిద్రం మొత్తం అక్కడ కనబడుతుంది. అసలు పోకుండా ఉంటేనే బాగుంటుంది'. ఈ కాలంలో వచ్చే సహజమైన పూవులను ధరించమని సలహా ఇచ్చాడతను. 'పది ఫ్రాంకులకు మూడు దివ్యమైన గులాబీలు వస్తాయి'. అంతమంది సంపన్నురాళ్ల మధ్య పేదరాలిగా కనబడటం కంటే అవమానం ఇంకేముంటుంది?

భర్త సలహా ఇచ్చాడు. 'నీ ఫ్రెండు మేడమ్ ఫోరెస్టీర్ ఉందికదా, ఆమె దగ్గర ఏమైనా అడిగి తీసుకునేంత చనువు నీకుంది కదా!' అంతవరకూ ఆ ఆలోచనే రాని మెటీల్డ్ ఎగిరి గంతేసింది.

తెల్లారే స్నేహితురాలి ఇంటికెళ్లి, తన బాధేమిటో చెప్పింది. మేడమ్ ఫారెస్టీర్ వార్డ్‌రోబ్‌లోంచి ఒక పెద్ద నగల పెట్టె తెచ్చి, మేడమ్ లొయిజెల్ ముందు పెట్టి, అందులోంచి కావాల్సింది ఎంచుకొమ్మంది. అందులో బ్రేస్‌లెట్స్, ఒక ముత్యాల హారం, రాళ్లు పొదిగిన వెనీస్ తయారీ క్రాస్ ఉన్నాయి. అవి వేసుకుని అద్దంలో చూసుకుంది. ఊహూ. ఉన్నట్టుండి, శాటిన్ వస్త్రం చుట్టివున్న ఒక అద్భుతమైన వజ్రాల హారం ఆమె కంటబడింది. దాన్ని తీసుకుంటుండగా ఆమె చేతులు వణికాయి. అది ధరించినప్పుడు అద్దంలో కనబడిన ప్రతిబింబం ఆమెను తన్మయత్వానికి గురిచేసింది. 'దీన్ని అరువిస్తావా? ఇదొక్కటే?' 'ఓ, తప్పకుండా'. స్నేహితురాలి మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెట్టుకుంది మెటీల్డ్.

విందునాట్యం రోజు మేడమ్ లొయిజెల్ అందరినీ ఆకట్టుకుంది. అక్కడున్న స్త్రీలందరిలోకీ ఆమే గొప్పగా కనబడింది. పెద్దపెద్దవాళ్లు కూడా ఆమె ఎవరో తెలుసుకునేందుకు కుతూహలపడ్డారు. అంతెందుకు, సాక్షాత్తూ మంత్రి కూడా ఆమెను ప్రశంసించారు.

సరిగ్గా ఉదయం నాలిగింటికి వాళ్లు విందు నుంచి బయటపడ్డారు. ఇంత చలిలో వెళ్తే జలుబు చేస్తుందని లొయిజెల్ క్యాబ్ కోసం చూశాడు. ఏదీ ఆగలేదు. సీన్ నది పక్కన వణుకుతూ నడుస్తుండగా పాత క్యాబ్ దొరికింది. ఎట్టకేలకు ఇల్లు చేరుకున్నారు. ఆమెకు సంబంధించినంతవరకూ అంతా ముగిసిపోయింది. అతడు మాత్రం మళ్లీ పొద్దున పది గంటలకు ఆఫీసుకు వెళ్లాలి.

అద్దం ముందు కూర్చుని బట్టలు మార్చుకునేముందు మరోసారి అందులో చూసుకుంది. ఒక్కసారి కెవ్వుమంది. నెక్లెస్ లేదు. బట్టలు మార్చుకుంటున్న భర్త, 'ఏంటీ? ఎలా? అసాధ్యం' అని మాత్రం అనగలిగాడు. ఆమె స్కర్టు మడతల్లో చూశారు, జేబుల్లో వెతికారు. బయటికి వచ్చినప్పుడు మెడ చుట్టూ ఉందనిపించిందా? వీధిలో గనక పడిపోయుంటే శబ్దం తెలిసేది కదా! క్యాబ్‌లో పడిపోయుంటుందా?

ఇద్దరూ స్తంభించిపోయారు. అతడు మళ్లీ బట్టలు వేసుకుని, కాలి నడకన క్యాబ్ ఎక్కిన చోటుకు వెళ్లాడు. ఆమెకు మంచం మీద పడుకోవడానికి కూడా శక్తి చాలలేదు. అతడు ఏడింటికల్లా తిరిగొచ్చాడు. దొరకలేదు. మళ్లీ, పోలీసుల దగ్గరికి వెళ్లాడు, తెచ్చి ఇచ్చిన వాళ్లకు బహుమతి పేరుతో ప్రకటన ఇవ్వడానికి పత్రికా కార్యాలయాలకు వెళ్లాడు, క్యాబ్ కంపెనీలకు వెళ్లాడు.

ఆమె రోజంతా అలాగే ఉండిపోయింది. రాత్రికల్లా అతడు పాలిపోయిన ముఖంతో తిరిగొచ్చాడు.

నెక్లెస్ కొక్కెం విరిగిపోయిందనీ, దాన్ని బాగుచేసి ఇవ్వడానికి కొంచెం సమయం కావాలనీ మెటీల్డ్‌తో ఆమె స్నేహితురాలికి ఒక లేఖ రాయించాడు. వారంకల్లా వాళ్ల ఆశలన్నీ అడుగంటాయి. అప్పటికే లొయిజెల్‌కు ఐదేళ్ల వయసు పెరిగినట్టయింది. ఆ హారం బదులు మరోటి ఎలా ఇవ్వాలి? తెల్లారి, నెక్లెస్ తెచ్చిన పెట్టె మీదున్న పేరును బట్టి ఆ దుకాణానికి వెళ్లారు. అతడు ఆ నెక్లెస్ అమ్మలేదు. ఆ పెట్టె మాత్రమే అమ్మాడు. అన్ని దుకాణాలు తిరిగారు అచ్చంగా అలాంటి హారం కోసం. ఆఖరికి రాయల్ ప్యాలెస్‌లో కనబడింది. వెల నలభై వేల ఫ్రాంకులు! ముప్పై ఆరు వరకు ఇస్తారు. మూడు రోజుల దాకా దాన్ని అమ్మొద్దనీ, ఒకవేళ వాళ్ల హారం గనక ఫిబ్రవరి చివరికల్లా దొరికితే ముప్పై నాలుగు వేలకు వాపసు కొనాలనీ బతిమాలారు.

వాళ్ల నాన్న ఇచ్చిన పద్దెనిమిది వేల ఫ్రాంకులు లొయిజెల్ దగ్గరున్నాయి. మిగిలింది అప్పు చేశాడు. వెయ్యి ఫ్రాంకులొకచోట, ఐదు వందలొక చోట, ఐదు లూయిలొక దగ్గరా, మూడు లూయిలు మరోదగ్గరా, దొరికినచోట దొరికినట్టుగా, వడ్డీల మీద వడ్డీలకు ఒప్పుకుంటూ అప్పు పత్రాలు రాసిచ్చాడు. చివరకు మెటీల్డ్ హారాన్ని పట్టుకెళ్లి ఇచ్చినప్పుడు, మేడమ్ ఫోరెస్టీర్ 'ఇప్పుడా ఇవ్వడం' అని గొణిగింది. కానీ దాన్ని తెరిచి చూడనందుకు మెటీల్డ్ సంతోషపడింది. తనను దొంగ అనుకోదుకదా!

తర్వాత వాళ్లు చిన్న ఇంటికి మారారు. పనిమనిషిని మాన్పించారు. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం, నేల తుడవడం సహా ఇంటిపని మొత్తం గులాబీ వేళ్ల మెటీల్డే చేసుకుంది. అలుపు తీర్చుకుంటూ వీధిలోంచి నీళ్లు మోసుకొచ్చింది. మాంసం కొట్లో, పచారీ కొట్లో, పళ్ల దగ్గరా గీచి గీచి బేరాలు చేసింది. వయసు మీదపడ్డట్టయింది. లొయిజెల్ రాత్రిదాకా పేజీకింతని మరోచోట లెక్కల పద్దులు రాశాడు. ఫ్రాంకూ ఫ్రాంకూ జమ చేస్తూ ఒక్కో నోటును చెల్లిస్తూ వచ్చారు. ఇట్లా ప..దే..ళ్లు గడిచాయి. ఎప్పుడైనా కిటికీ పక్కన కూర్చుని బయటకు చూస్తే మెటీల్డ్‌కు ఆ విందు నాట్యం రాత్రి గుర్తొస్తుంది. ప్చ్, ఆ హారం పోకపోయివుంటే? జీవితం ఎంత చిత్రమైంది! ఎంత అల్పమైన విషయం కూడా జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది కదా!

ఒక ఆదివారం మెటీల్డ్ తోవన నడుస్తున్నప్పుడు పాపతో ఉన్న స్త్రీ కనబడింది. మేడమ్ ఫోరెస్టీర్! అంతే అందంగా, అంతే యౌవనంతో! మాట్లాడాలా, వద్దా? అన్నీ చెల్లించేశారు కాబట్టి, చెబితే పోయేదేముంది? కానీ ఫోరెస్టీర్ గుర్తుపట్టనేలేదు. 'నేను, మెటీల్డ్ లొయిజెల్'. 'అయ్యో, మెటీల్డ్ నువ్వా? ఎంత మారిపోయావు?'

'చాలా కష్టాలు అనుభవించాను... నీ కారణంగానే.' 'నా కారణంగానా? ఎలా?'


హారం పోవడమూ, బదులుగా వేరేది కొనివ్వడమూ, దానికి చేసిన అప్పు తీర్చడానికి పదేళ్లు పట్టడమూ అంతా చెప్పింది.

'అంటే నువ్వనేది నా హారానికి బదులుగా మరో వజ్రాల హారం తెచ్చానంటావా?'

'అయితే నువ్వు గమనించలేదన్నమాట. అవి రెండూ ఒకేలా ఉన్నాయి'.

'అయ్యో పాపం మెటీల్డ్! అది ఆర్టిఫీషియల్. దాని విలువ ఐదొందల ఫ్రాంకులు కూడా ఉండదు'.

గై డి మపాసా(1850–1893) కథ 'ద నెక్లెస్' సారాంశం ఇది. 1884లో అచ్చయింది. ప్రపంచంలోని గొప్ప కథకుల్లో ఒకరైన మపాసా ఫ్రాన్స్‌లో జన్మించారు. తన కథల ద్వారా మనుషుల అంతరంగాల లోతులను పరిచయం చేసిన మపాసా 43 ఏళ్ల చిన్న వయసులోనే మరణించారు.


గై డి మపాసా

గ్రేట్ రైటర్

ఎస్.ఎల్.భైరప్ప



భారతీయ ఆధునిక నవలా రచయితల్లో అగ్రశ్రేణిలో ఉండగలిగేవారిలో సంతేశివర లింగన్నయ్య భైరప్ప ఒకరు. ఆయన 1934లో కర్ణాటకలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లినీ సోదరులనూ కోల్పోయారు. మధ్యలోనే చదువు వదిలేసి, రైల్వే కూలీగా పనిచేశారు. కొన్నాళ్లు సాధువులతో కలిసి తిరిగారు. మళ్లీ చదువు వైపు మరలి, అంచెలుగా ఎదిగి, తత్వశాస్త్ర అధ్యాపకుడిగా స్థిరపడ్డారు.

మహాభారత కథను వాస్తవిక సామాజిక దృక్పథంతో పునఃచిత్రించిన 'పర్వ' అనితరసాధ్యమైన కృషి. ఈ ఒక్క నవలే భైరప్పను ఎక్కడో నిలబెడుతుంది. అలాంటిది మరెన్ని నవలలు! వంశవృక్ష, గృహభంగ, దాటు, ఆవరణ లాంటి నవలలతో ఒక సరికొత్త పంథాను ఆయన ఆవిష్కరించారు. ఒక తీవ్రమైన మథనం, ఒక గొప్ప పరిశోధన, ఒక దివ్యమైన సమన్వయం ఆయన నవలల్లో కనబడుతుంది. 'వంశవృక్ష', 'నాయి నెరళు', 'తబ్బలియు నినాద మగనె', 'మతదాన' నవలలు కన్నడ చిత్రాలుగానూ, 'గృహభంగ', 'దాటు' టీవీ ధారావాహికలుగానూ రూపొందాయి. వంశవృక్ష తెలుగులో బాపు దర్శకత్వంలో 'వంశవృక్షం' సినిమాగా వచ్చింది.

సాహిత్య మరమరాలు

అదే ఫలహారం అయితే వద్దులే

భావకవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు పరంపరలోనివారు మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి. ఈయనకు ఫలహారాల మీద కొంత మోజు. ఏ స్నేహితుడినో కలవడానికి ఏ ఊరైనా వెళ్తే, ఉదయం అల్పాహారమైనా, మధ్యాహ్న భోజనమైనా వడ్డించింది తినేసేవారుగానీ సాయంత్రం మాత్రం ఫలహారం మీదికి ఆయన మనసు పోయేది. మరి దాన్ని నేరుగా అడగలేరు కదా, అందుకని, 'ఈ వేళప్పుడు ఈ ఊళ్లో ఏం తింటారూ?' అని దీర్ఘం తీస్తూ అడిగేవారు. అప్పుడు ఆతిథ్యం ఇచ్చిన వాళ్లు ఆయన అంతరంగాన్ని గ్రహించి, ఏదైనా చేసిపెట్టాలి. ఇలా ఆయన అడిగేతీరు నెమ్మదిగా అందరికీ తెలిసిపోయింది.



ఒకసారి ఆయన బందరులోని కృష్ణాపత్రిక ఆఫీసుకు వెళ్లారు. అక్కడ ఏడెనిమిది మంది కవులు కూర్చునివున్నారు. అందులో 'పింగళి(లక్ష్మీకాంతం) –కాటూరి' జంట కవుల్లో ఒకరైన కాటూరి వేంకటేశ్వరరావు ఒకరు. సాయంత్రం అవుతోంది. సుందరరామశాస్త్రికి ఫలహారం మీదకు మనసు లాగుతోంది. తన అలవాటైన శైలిలో 'ఈ వేళప్పుడు ఈ ఊళ్లో ఏం తింటారూ?' అని 'సభ'ను ఉద్దేశించి ప్రశ్నించారు. కాటూరి చప్పున, 'చీవాట్లు తింటారండి' అని అదే తరహాలో జవాబిచ్చారు. అందరూ నవ్వుకున్నారు.

ప్రతిధ్వనించే పుస్తకం

కారు వస్తే గుర్రం పోవాల్సిందేనా?

మనుషులకీ జంతువులకీ మధ్య ఉండే సంబంధం 'బ్లాక్ బ్యూటీ'లోని ప్రధాన వస్తువు. ఈ నవలను అన్నా సీవెల్ గుర్రాల పట్ల మనుషులు దయగా ఉండాలనే సందేశంతో రాసిందని అంటారు. అప్పటికి రైలు వచ్చేసింది. ఇంకా కారు ఒక మార్కెట్ సరుకుగా వచ్చి ఉండలేదు. మానవ నివాస భూఖండాలన్నింటా జంతువులు ఉత్పత్తి కార్యకలాపాలలో భాగస్వాములుగా ఉన్న కాలం అది.

మానవ నాగరికత మారిపోయింది. కార్లు... రైళ్ళు... బస్సులు వచ్చాయి. అవి నడవడం కోసం రోడ్లు వచ్చాయి. రోడ్ల కోసం కొండలు పేలాయి. భూమి మీద మానవునితో సంబంధం లేకుండా ఆవిర్భవించిన గుర్రం అతని సంబంధంలోకి వచ్చి పెంపుడు జంతువై మనిషికి వ్యక్తిగత ఆస్తి అయ్యి , సరుకు అయ్యి, చివరికి అంతరించిపోయే దశలోకి వచ్చేసింది.



ప్రకృతికీ, సమాజానికీ సంబంధించిన పరిణామక్రమంలో యిప్పుడు ఉన్నట్టుగా ఉండడం అనేది ఒకానొక పరిణామ ఫలితమనీ యిది కూడా మారి పోతుందనీ మనకి సైన్స్‌పరంగానూ, తాత్వికంగానూ కూడా తెలుసు. ఈ ప్రక్రియలో మేధోజీవి అయిన మానవుడు ప్రకృతి పరిణామంగా వచ్చి దానిలో జోక్యం చేసుకోవడం, మార్చివేయడం అనే నాగరికత కలిగినవాడు. ఈ లక్షణాన్నీ, ఈ నాగరికతనీ మనం ప్రేమిస్తున్నాం. మార్చడం, మారిపోవడం రెండూ తప్పనిసరి అనీ, మార్పు యిలాగే ఉండాలనీ, అలా ఉండకపోవడం ఒక నేరమనీ భావిస్తున్నాం. అయితే మానవుని జోక్యంతో మారుతున్న ప్రకృతి యిప్పుడు చాలా ప్రశ్నల్ని మన ముందుకు తెస్తున్నది. కొన్ని వేల యేళ్ళు ప్రకృతి పరిణామంగా ఏర్పడినవన్నీ కొన్ని రోజులలో నాశనమై అంతరించిపోవడం ఈవేళ మనకి నిత్యమూ కనపడుతున్న అంశం. బ్లాక్‌బ్యూటీలో గుర్రాన్ని ప్రేమించడం హింసించడం రెండూ కనిపిస్తాయి. గుర్రంతో మనిషికి మైత్రి ఉంది. అది తన లాంటి ఒక ప్రాణి అనే ఎరుక ఉంది. కానీ కారుతో అలాంటిదేమీ లేదు. కానీ సమస్య యిది కాదు. కారు రావడంతో గుర్రం అనే ఒక ప్రకృతి జీవి మానవునితో 'ఉద్యోగిత' కోల్పోయి అంతరించిపోయే దశకి చేరుకోవడం. ఒక సహజ పరిణామం మనిషి కార్యాచరణకి గురై అంతరించిపోవడం మనకి భయానకమైన ప్రశ్న వేస్తున్నది. ప్రాజెక్టుల వల్ల నదులు, కొండలు, పట్టణీకరణవల్ల భూమి, చెట్లు, పక్షులు, అడవులు, ప్రపంచీకరణ వల్ల అన్నీ అంతరించిపోయే దశకి చేరుకోవడం ఈవేళ మనకి స్పష్టంగా తెలుస్తోంది.

యిదంతా మానవుడి చేతుల్లో లేని ఒక సహజ పరిణామమా? ఇది అనివార్యమా? భూమి మీద జీవం అంతరించిపోవడానికి ప్రకృతి ఏర్పాటు చేసిన ప్రక్రియా యిది?


◆ **అద్దేపల్లి ప్రభు**

మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com

కొత్త బంగారం

చీకటితో రాజీ పడటమే అగ్లీతనం

పెరీ, బేబీ గర్ల్ అనబడే డయోనా, స్నేహితురాళ్ళు. టీనేజర్లు. అరగంట కిందట తాము దొంగిలించిన కార్లో వాళ్ళిద్దరూ కూర్చుని ఉండటంతో నవల ప్రారంభం అవుతుంది. కారు డ్రైవ్ చేస్తున్న బేబీ గర్ల్‌ను చూస్తూ, 'నకిలీ టక్కరి' అనుకుంటుంది పెరీ. దానితోనే, వాళ్ళిద్దరికీ ఉన్న స్నేహం అంత నిలకడైనది కాదని తెలుస్తుంది.



ట్రైలర్ పార్కులో ఉండే పెరీ తల్లి మైరా తాగుబోతు. హ్యాంగోవర్ వల్ల తరచూ పనికి వెళ్ళలేకపోతుంది. సవతి తండ్రి జైలు కాపరి. బేబీ గర్ల్ జీవితం ఇంతకన్నా కనాకష్టంగా ఉంటుంది. ఆ అమ్మాయి తన మేనమామతోనూ, మోటర్ సైకిల్ ప్రమాదంలో మతి చెడిన అన్నతోనూ ఉంటుంది.

ఇద్దరూ కలిసి కార్లు దొంగిలిస్తూ, స్కూల్ ఎగ్గొడుతూ, రాత్రివేళలు బయట తిరుగుతూ ఉంటారు. కలిసి ఎంతో సమయం వెచ్చించినప్పటికీ, ఒకరినొకరు అనుమానించుకుంటూ ఉంటారు. వారిద్దరికీ ఉన్న సామాన్యమైన నేపథ్యం– అస్థిరమైన కుటుంబాలు. బేబీ గర్ల్ స్థూలంగా ఉండి, తన తిరుగుబాటు ధోరణిని కనపరచడానికి సగం తల గొరిగేసుకుని, మందపాటి మేకప్ వేసుకుని, అన్న జీన్స్ తొడుక్కుంటుంది. ఇంకా కన్య. పెరీ అందమైన బ్లాండ్. లైంగిక సంబంధాలకి వెనకాడదు.


లిండ్సే హంటర్

ఇద్దరూ ఫేస్‌బుక్లో 'టీనేజర్'ని అని చెప్పుకున్న జేమీతో చాట్ చేస్తుంటారు. అతను పెరీ ఉండే పార్కులోనే మరొక ట్రైలర్లో తల్లితోపాటు ఉండి, కంప్యూటర్ స్క్రీన్ వెనకాల నుంచి పెరీని చూస్తూ ఆమె పైన ఆసక్తి పెంచుకున్న మధ్యవయస్కుడు. పిల్లల పట్ల కామం పెంచుకునే స్వభావం ఉన్న వ్యక్తి. అమ్మాయిలిద్దరికీ అతని వివరాలు తెలియవు.

పెడసరంగా ఉండే బేబీ గర్ల్‌కు ఇతరులు తన్ని ఇష్టపడాలని ఉంటుంది. జేమీ వల్ల ఇద్దరమ్మాయిల మధ్యా దూరం ఎక్కువవుతుంది.

ఒక వర్షపు రాత్రి జేమీని కలుసుకోడానికి బేబీ గర్ల్–పెరీతో పాటు వెళ్ళినప్పుడు, జరిగిన ఘర్షణలో– అతను కాలు జారి రోడ్డు పక్కనున్న డొంకలో పడి చనిపోతాడు. పోలీసధికారులకి జరిగినది చెప్పమని బేబీ గర్ల్ దబాయించినప్పటికీ, పెరీ వినదు. ఇద్దరూ మృతదేహాన్ని వదిలేసి పోతారు.

లిండ్సే హంటర్ పాత్రలకి తమ బలహీనతలు తెలుసు. తమని తాము ఏవగించుకుంటూనే, తమ తప్పుడుదారులు మాత్రం విడవరు. అయితే, పాఠకులకి మాత్రం సానుభూతి కలిగిస్తారు. నవల– కష్టాలని అధిగమించడం గురించినది కాక, తమలో ఉన్న చీకటి కోణాలతో రాజీ పడే పాత్రల చిత్రీకరణ.

కథనం ప్రథమ పురుష స్వరంతో వినిపిస్తుంది. నెమ్మదిగా మొదలయి, హఠాత్తుగా ముగుస్తుంది. చివరి అధ్యాయాలు కొన్ని– కేవలం ఒకే పేరాతో పూర్తయేవి. పుస్తకం–గలీజైన, గరుకైన జీవితాల గురించినదైనప్పటికీ, కథాంశం పాత్రలని తాజా రీతిలో ముందుకు నడిపిస్తూ ఉన్నందువల్ల, విసుగు పుట్టించదు. ఆ విధమైన జీవితాల గురించీ, పాత్రల గురించీ పాఠకులు ఆలోచించేలా చేస్తుంది. ప్రతీ ఒక్కరూ అంతర్గతంగా చెడ్డవారేనన్న సూత్రం నవలంతటా కనబడుతుంది.


ఇక్కడ 'అగ్లీ' అన్నది అమ్మాయిలని కాదు. 'అగ్లీ'గా ఉండేది– మనుష్యులు, జీవితాలు, ఆలోచనలు, నైతిక స్థాయిలు. కథాంశం–గ్రామీణ పేదరికం, టీనేజిలో కలిగే నిరుత్సాహపు సుఖదుఃఖాలు, లైంగిక పరిపక్వతకి ముందు వచ్చేచిక్కులు. గతంలో రచయిత్రి రెండు కథా సంకలనాలు రాశారు. అగ్లీ గర్ల్స్ ఆమె తొలి నవల. విడుదల అయినది 2014లో.

◆ **కృష్ణ వేణి**

ఈవారం పుస్తకాలు




అష్ఫాఖ్- బిస్మిల్‌ల అద్భుత అమరగాథ
రచన: 'విజయవిహారం' రమణమూర్తి; పేజీలు: 298; వెల: 350; ప్రతులకు: జైభారత్ పబ్లికేషన్స్, 3–8–347, మన్సూరాబాద్, చంద్రపురి కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్–500074. ఫోన్: 9848019076



ఎదారి బతుకులు (పల్లె కతలు)
రచన: ఎండపల్లి భారతి; పేజీలు: 132; వెల: 100; ప్రచురణ: గుండ్లదండ వెలువరింతలు, దిగవబురుజు, చిత్తూరు జిల్లా. ప్రతులకు: రచయిత్రి, ఫోన్: 9652802460



అసలు దారి (మరికొన్ని కథలు)
రచన: వీరబ్రహ్మాచారి; పేజీలు: 160; వెల: 100; ప్రచురణ: విరసం ప్రచురణలు; ప్రతులకు: డి.వి.రామక్రిష్ణారావు, ఎం.ఐ.జి. –14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్–500040.



అమ్మకో అక్షరం (బహుమతి పొందిన కథానికలు)
రచన: పోలాప్రగడ జనార్దనరావు(జెన్నీ); పేజీలు: 202; వెల: 150; ప్రతులకు: మణి పబ్లిషర్స్, జి3, సత్య క్లాసిక్స్, 12–13–302, స్ట్రీట్ నం.9, తార్నాక, సికింద్రాబాద్–17. ఫోన్: 9908384263



పదం పలికింది - పాట నిలిచింది

కళ్లు తెరిచి స్వప్నమే కన్నా



ప్రేమించిన అమ్మాయి కళ్ల ఎదురుగా నిలబడటం కొన్నిసార్లు కల లాంటిదే కదా! మరి కల, రాత్రి మాత్రమే వచ్చేది. కళ్లు మూసుకుంటే తప్ప కల రాదు. కానీ ఆ కల లాంటి అమ్మాయి కళ్లముందు కనబడ్డప్పుడు కళ్లు తెరిచి కల కన్నట్టే కదా! ఇంత అందమైన భావాన్ని 'గజిని' చిత్రంలోని–
'హృదయం ఎక్కడున్నదీ హృదయం ఎక్కడున్నదీ
నీ చుట్టూనే తిరుగుతున్నదీ' పాటలో పలికించారు గీత రచయిత వెన్నెలకంటి.
'చూపులకై వెతికా చూపుల్లోనే బతికా
కళ్లు తెరిచి స్వప్నమే కన్నా
తొలిసారీ... కళ్లు తెరిచి స్వప్నమే కన్నా' అని రాశారాయన.
ఇంకా ముందుకు వెళ్లి–
'కంటిపాపలా పూవులనే నీ కనులలో కన్నా
నీ కళ్లే వాడిపోని పూవులమ్మా' అని మరో అందమైన పోలిక కూడా తెచ్చారు.
2005లో వచ్చిన ఈ చిత్రానికి హారిస్ జయరాజ్ సంగీతం సమకూర్చారు. హరీష్ రాఘవేంద్ర, బాంబే జయశ్రీ పాడారు. సూర్య, అసిన్ నటించారు. దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్.

రారండోయ్

- కె.ఎన్.వై.పతంజలి స్మారక సాహిత్య పురస్కారాన్ని సతీష్ చందర్‌కు మార్చి 29న సాయంత్రం 5 గంటలకు విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ప్రదానం చేయనున్నారు. నిర్వహణ: పతంజలి సాంస్కృతిక వేదిక, విజయనగరం.
- డాక్టర్ వి.గీతానాగరాణి పరిశోధన గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవన చిత్రణ', సలీం నవల 'అనూహ్య పెళ్లి'ల ఆవిష్కరణ సభ మార్చి 30న సాయంత్రం 5:40కి శ్రీత్యాగరాయ గానసభలో జరగనుంది.
- 'భారతీయ సాహిత్యంపై అంబేద్కర్ ప్రభావం' అంశంపై జాతీయ సదస్సు మార్చి 28, 29 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం– అంబేద్కర్ ఛైర్; ఏపీ బహుజన రచయితల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరగనుంది. వివరాలకు: 9966990797.
- మల్లెతీగ పురస్కారం–2017ను ర్యాలిప్రసాద్ కవిత 'డెత్ సర్టిఫికెట్' గెలుచుకుంది. ఆత్మీయ పురస్కారాలు సుధేరా, అనిల్ డ్యానీ, కె.జి.వేణు, కె.కిషోర్‌కుమార్–శిఖా ఆకాశ్, చిత్తలూరి సత్యనారాయణకు లభించాయి.
- జాతీయ సాహిత్య పరిషత్తు, సిద్దిపేట వారి ఐతా భారతీ చంద్రయ్య సంప్రదాయ కథా పురస్కారాన్ని డాక్టర్ బి.వి.ఎన్.స్వామి; తడకమడ్ల సంప్రదాయ సాహితీ పురస్కారాన్ని కటుకోజ్వల ఆనందం; సంటి అనీల్‌కుమార్ బాల సాహితీ పురస్కారాన్ని పైడిమర్రి రామకృష్ణ; గాడేపల్లి వెంకటమ్మ– వీరయ్య స్మారక పురస్కారాన్ని మెరుగు ప్రవీణ్‌కుమార్ మార్చి 30న సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో స్వీకరించనున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం. తిథి శు.దశమి రా.2.48 వరకు, తదుపరి ఏకాదశి. నక్షత్రం పునర్వసు ప.12.20 వరకు, తదుపరి పుష్యమి. వర్జ్యం రా.7.45 నుంచి 9.16 వరకు. దుర్ముహూర్తం ప.12.30 నుంచి 1.18 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.41 వరకు. అమృత ఘడియలు ఉ.10.04 నుంచి 11.43 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.04
జొహర్ : 12.22
అసర్ : 4.45
మగ్రీబ్ : 6.28
ఇషా : 7.40

పత్రికల్లో ఫేస్‌బుక్ క్షమాపణ ప్రకటనలు



- సమాచార భద్రత మా బాధ్యత
- దాన్ని నెరవేర్చకపోతే ఈ స్థానానికి అనర్హులం: జుకర్‌బర్గ్
- స్మార్ట్‌ఫోన్ యూజర్లూ.. యాప్‌లకు పర్మిషన్లతో జాగ్రత్త: నిపుణులు

లండన్: ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవ్వడంపై ఫేస్‌బుక్ సహ వ్యవస్థాపకుడు, మార్క్ జుకర్‌బర్గ్ బ్రిటన్, అమెరికాలోని ప్రముఖ పత్రికల్లో ప్రకటనల రూపంలో క్షమాపణలు కోరారు. 'మీ సమాచారాన్ని భద్రంగా ఉంచాల్సిన బాధ్యత మాపై ఉంది. అది చేయలేకపోతే ఈ స్థానానికి మేం అనర్హులం' అని ప్రకటనలో పేర్కొన్నారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పరిశోధకుడిగా పనిచేసే ఓ వ్యక్తి ఫేస్‌బుక్ కోసం రూపొందించిన క్విజ్ యాప్‌తో డాటా దుర్వినియోగం అయ్యిందన్నారు. 'ఇది నమ్మక ద్రోహమే. కానీ మేం ఇప్పుడు ఇంతకుమించి ఏం చేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం' అని అన్నారు. భారత్, అమెరికా సహా అనేక దేశాల్లో ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల డాటాను కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ దుర్వినియోగం చేయడం తెలిసిందే.

యాప్‌లతో జాగ్రత్త

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాలకు అనవసరంగా వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వడమే కాకుండా స్మార్ట్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకునే యాప్‌లతోనూ సమాచారం దుర్వినియోగం అవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫోన్లలోని థర్డ్ పార్టీ అప్లికేషన్‌లు వాటికి అవసరం లేని సమాచారానికి యాక్సెస్ కోరుతున్నాయనీ, యాప్‌లకు పర్మిషన్లు ఇచ్చే ముందు వినియోగదారులు ఆలోచించుకోవాలన్నారు. 'ఉదాహరణకు ఓ గేమింగ్ యాప్‌కు ఫోన్‌లోని కాంటాక్టులు, మెసేజ్‌లతో పనుండదు. కానీ ఆ యాప్ వినియోగదారుల ఫోన్‌లో పనిచేయాలంటే మెసేజ్‌లు, కాంటాక్ట్‌లకూ యాక్సెస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ యాప్ సైబర్ నేరగాళ్లు అభివృద్ధి చేసిందయితే, లేదా ఆ యాప్ సర్వర్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవ్వొచ్చు' అని నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్ సంస్థలో ఉన్నతాధికారి అల్తాఫ్ చెప్పారు. ఈ పర్మిషన్లు ఇస్తే బ్యాంకింగ్ లావాదేవీల సమయంలో ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు వారికి తెలుస్తాయి. ఫోన్‌లోని వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఫైళ్లు, ఇతర సమస్త సమాచారానికి అనేక యాప్‌లు పర్మిషన్లు కోరుతుంటాయి. ఈ సమాచారం అంతా దుర్వినియోగం అయ్యే అవకాశాలు ఎన్నో ఉన్నాయని ప్రముఖ యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ సంస్థ కాస్పర్స్కీ ల్యాబ్ దక్షిణాసియా జీఎం భయానీ చెప్పారు. ఇలాంటి వాటిని నిరోధించాలంటే ప్రభుత్వం సైబర్ చట్టాలను కఠినతరం చేయడంతోపాటు యాప్‌లలోని తప్పులను ఎత్తిచూపితే వినియోగదారులకు రివార్డులు ఇచ్చే పథకాలను తేవాలన్నారు.

ఆ వర్సిటీలను ప్రైవేటుపరం చేయం



న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీతోపాటు దేశంలోని పలు వర్సిటీలను ప్రైవేటుపరం చేయడంలో భాగంగానే వాటికి స్వయంప్రతిపత్తి హోదా కల్పించామనడం సరికాదని మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. ఈ విద్యా సంస్థల్లో ఫీజులు పెంచబోమని, వీటికి కేంద్ర ప్రభుత్వ మద్దతు కొనసాగుతుందని చెప్పారు. ఉన్నత విద్యా ప్రమాణాలు పాటిస్తున్న దేశంలోని 60 విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అటానమస్ హోదా కల్పించింది. వీటిలో 5 సెంట్రల్ వర్సిటీలు కాగా 21 స్టేట్ వర్సిటీలున్నాయి. అటానమస్ హోదా కారణంగా ఆయా వర్సిటీలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టుకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు.

మా ఐకమత్యం మరింత బలపడింది



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని రాజ్యసభ సీట్లకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓ సీటు ఎక్కువ గెలిచిందిగానీ ఆ గెలుపు బీజేపీనే దెబ్బతీస్తుందని యూపీ మాజీ సీఎం అఖిలేశ్ వ్యాఖ్యానించారు. బీజేపీ వాళ్ల దళిత వ్యతిరేక వైఖరి బహిర్గతమైందన్నారు. ఎస్పీ–బీఎస్పీల ఐకమత్యం బలపడిందన్నారు. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అనిల్ అగర్వాల్ చేతిలో బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేడ్కర్ త్రుటిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే. పేదలకు వ్యతిరేకంగా ధనాన్ని, అధికార వినియోగానికి పాల్పడిన బీజేపీ.. ఈ ఎన్నికల్లో తన నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని అఖిలేశ్ ఆరోపించారు. తన భార్య, కన్నౌజ్ ఎంపీ డింపుల్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోరని స్పష్టం చేశారు.

10 మంది లష్కరే ఏజెంట్ల అరెస్ట్

లక్నో: పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రసంస్థ లష్కరే తోయిబాతో కలిసి పనిచేస్తూ భారత్‌లోని ఉగ్రమూకలకు ఆర్థికసాయం అందజేస్తున్న 10 మంది నిందితుల్ని ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. 'గోరఖ్‌పూర్, లక్నో, ప్రతాప్‌గఢ్, రీవన్(మధ్యప్రదేశ్) ప్రాంతాలకు చెందిన పది మంది ఏజెంట్లను ఏటీఎస్ అరెస్టుచేసింది. పాక్‌లోని ఓ లష్కరే తోయిబా సభ్యుడు నకిలీ ఆధారాల ద్వారా బ్యాంకు ఖాతాలను తెరవాలని నిందితులకు సూచించాడు. ఏయే ఖాతాలకు ఎంతెంత మొత్తం పంపాలో ఆదేశాలు జారీచేసేవాడు. ఈ మొత్తాలను పంపినందుకు నిందితులకు 10 నుంచి 20 శాతం కమిషన్ అందేది. ఇలా ఇప్పటివరకూ వీరు ఇతర ఖాతాలకు రూ.కోటికి పైగా నగదును బదిలీచేశారు' అని ఏటీఎస్ ఐజీ అసీమ్ అరుణ్ మీడియాకు తెలిపారు. ఖాతాలు తెరవడంపై బ్యాంకు సిబ్బందినీ విచారిస్తామన్నారు.

డాక్టర్లకు 'కొంతకాలం' నిబంధన తీసుకురండి



న్యూఢిల్లీ: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రజల సొమ్ముతో చదివే డాక్టర్లు నిర్దిష్ట సమయం వరకు (మినిమమ్ కంపల్సరీ పీరియడ్) దేశంలోనే పనిచేసేలా నిబంధన తీసుకురావాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమంపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయి సంఘం సూచించింది. చాలా మంది డాక్టర్లు ప్రభుత్వ సొమ్ముతో చదువుకుని విదేశాలకు వెళ్తుండటాన్ని కమిటీ తప్పుబట్టింది. వైద్య కళాశాలల్లో చదివిన వారందరూ ఓ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే అంశాన్నీ పరిశీలించాలంది. డెంటల్, నర్సింగ్, ఇతర కౌన్సిల్స్‌ను సమర్థంగా నియంత్రించేందుకు వీలుగా పునర్వ్యవస్థీకరించాలని ఆరోగ్య శాఖకు సూచించింది.

శ్రీరామనవమి ఊరేగింపులో ఉద్రిక్తత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో శ్రీరామనవమి ఊరేగింపు సందర్భంగా పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పురూలియా జిల్లాలోని ఆర్షాలో ఆదివారం ర్యాలీ సందర్భంగా తలెత్తిన ఘర్షణలో ఒకరు మృతిచెందారు. డీఎస్పీ స్థాయి అధికారి సహా ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. రామనవమి సందర్భంగా రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించాయి. పురూలియాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయుధాలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంసీ, బీజేపీ మధ్య ఘర్షణ జరిగింది. వర్ధమాన్ జిల్లాలో ర్యాలీ సందర్భంగా బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, దీని వెనక టీఎంసీ హస్తముందని బీజేపీ ఆరోపించింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ర్యాలీలు మమత సర్కారుకు వ్యతిరేకంగా 'హిందువులను ఏకం చేసే'వంటూ బీజేపీ పేర్కొంది. మిడ్నాపూర్ జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ భారీ ఖడ్గాన్ని చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. రామనవమి సందర్భంగా అస్త్ర పూజ చేయటం సంప్రదాయమన్నారు. బీజేపీ చేపట్టిన ర్యాలీల్లో చిన్నారుల చేతికి ఆయుధాలిచ్చారని తృణమూల్ బాలల హక్కుల అధికారులకు ఫిర్యాదు చేసింది.

24 గంటలు.. ఏడు ఎన్‌కౌంటర్లు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న నేరస్తుల ఏరివేత కొనసాగుతోంది. సహరాన్‌పూర్, ఘజియాబాద్, గౌతమ్‌బుద్ధ నగర్, ముజఫర్‌నగర్ జిల్లాల్లో 24 గంటల్లో 7 ఎన్‌కౌంటర్లు జరిగాయి. పోలీసుల కాల్పుల్లో ముగ్గురు మోస్ట్ వాంటెడ్ నేరస్తులు హతమయ్యారు. ఏడుగురిని అరెస్టుచేశారు. నేరస్తులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు పోలీసులకు గాయాలయ్యాయి. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ గాయపడ్డ గ్యాంగ్‌స్టర్ శ్రవణ్ చౌదరీ ఆదివారం చికిత్స పొందుతూ చనిపోయాడని శాంతిభద్రతల డీఐజీ ప్రవీణ్ తెలిపారు. సహరాన్‌పూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పరారీలో ఉన్న సలీమ్ అనే నేరస్తుడిని హతమార్చినట్లు చెప్పారు. ఓ రైతు నుంచి బైక్, రూ.లక్ష దోచుకున్నట్లు ఫిర్యాదు రావడంతో తొలుత పోలీసులు రంగంలోకి దిగారన్నారు. ఛిల్కానాలో బైక్‌ను ఆపాల్సిందిగా కోరినప్పటికీ సలీమ్ పోలీసులపై కాల్పులు జరిపాడనీ, దీంతో తాము ఎదురుకాల్పులు జరపడంతో దుర్మరణం చెందాడన్నారు.



ఆదివారం చెన్నైలో ఓ ఎన్జీవో సందర్శనకు వచ్చిన జర్మనీ అధ్యక్షుడి భార్య ఎల్కె బిడెన్‌బెండర్‌కు స్వాగతం పలుకుతున్న యాసిడ్ దాడి బాధితురాలు. ఈ సందర్భంగా బిడెన్‌బెండర్ యాసిడ్ దాడి, గృహ హింస బాధితుల కోసం హాట్‌లైన్ సేవను ప్రారంభించారు.

పేదలదే నవభారతం

మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ

హేళన చేసిన వారందరినీ ఓడించి అంబేడ్కర్ గెలిచారు

ఏప్రిల్ 14 నుంచి గ్రామ్ స్వరాజ్ అభియాన్



న్యూఢిల్లీ

వెనకబడిన కుటుంబానికి చెందిన అంబేడ్కర్ ముందుకెళ్లకుండా చాలా మంది అవహేళన చేశారని ప్రధాని మోదీ తెలిపారు. వారందరి ప్రయత్నాలను అంబేడ్కర్ విఫలం చేసి రాజ్యాంగ నిర్మాతగా నిలిచారన్నారు. దేశం పేదలు, వెనకబడిన వర్గాలకే చెందుతుందని మాసాంతపు మన్‌కీ బాత్ కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉన్నత, ధనవంతుల కుటుంబంలో పుట్టడంతో సంబంధం లేకుండా పేదల ఇంట పుట్టినా లక్ష్య సాకారం కోసం అంబేడ్కర్ అహర్నిశలు శ్రమించి విజయం సాధించారని ప్రశంసించారు.

ఐక్యంగా గ్రామ్ స్వరాజ్ అభియాన్

'చాలా మంది అంబేడ్కర్‌ను అవహేళన చేశారు. వెనకబడిన వర్గాలకు చెందిన వ్యక్తి ముందుకెళ్లొద్దని ఆయన్ను వెనక్కు లాగేందుకు అనుక్షణం ప్రయత్నించారు. ఆయన అభ్యుదయ భావాలను అడ్డుకున్నారు. కానీ నేటి పరిస్థితి భిన్నంగా ఉంది. అంబేడ్కర్ కలలు గన్న పేదలు, వెనకబడిన వర్గాల నవభారతం చిత్రం మన ముందుంది' అని తెలిపారు. అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు 'గ్రామ్ స్వరాజ్ అభియాన్' నిర్వహించాలన్నారు. దేశవ్యాప్తంగా గ్రామాభివృద్ధి, పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

భవిష్యత్‌ను ముందే చూసి..

'దశాబ్దాల క్రితం అంబేడ్కర్ భారత్‌లో పారిశ్రామికీకరణ గురించి మాట్లాడారు. కొత్త ఉద్యోగాల కల్పన అభివృద్ధి గురించి చెప్పారు. నేడు అంబేడ్కర్ కోరిన నవభారత స్వప్న దృశ్యాన్ని నిజం చేసేలా మేకిన్ ఇండియా కార్యక్రమం విజయవంతంగా ముందుకెళ్తోంది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోర్టులు, జలమార్గాల అభివృద్ధినీ ఆయన గుర్తించారు' అనిపేర్కొన్నారు. భారత్‌లో దేశ విభజన, రెండో ప్రపంచ యుద్ధం, ప్రచ్ఛన్న యుద్ధం గురించి చర్చ జరుగుతున్న సమయంలోనే టీమ్ ఇండియా స్ఫూర్తికి అంబేడ్కర్ పునాదులు వేశారని మోదీ పేర్కొన్నారు. సమాఖ్యవిధానం గురించి మాట్లాడారని దేశాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని సూచించారన్నారు. సహకారాత్మక సమాఖ్య విధానమనే మంత్రాన్నే నేటి కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, రాంమనోహర్ లోహియా, చరణ్ సింగ్, దేవీలాల్ తదితర నేతలు వ్యవసాయం, రైతులను దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగంగా చూశారని ప్రశంసించారు. 'దుక్కిదున్నటం, మట్టిపై దృష్టిపెట్టడాన్ని మరిచిపోతే మనల్ని మనం మరిచిపోయినట్లే' అని గాంధీజీ సూక్తిని గుర్తుచేశారు. వ్యవసాయంలో మౌలిక వసతులను మెరుగుపరచాలన్న శాస్త్రి ఆలోచనలను, రైతుల ఆదాయం రెట్టింపుచేసేందుకు ఉద్యమాన్ని తీసుకురావాలన్న లోహియా సిద్ధాంతాలనూ జ్ఞప్తికి తెచ్చారు. రైతులు అధునాతన సాంకేతికతను ఒంటబట్టించుకోవాలన్న 1979నాటి చరణ్ సింగ్ ప్రసంగాన్నీ గుర్తుచేశారు.

నివారణే అసలైన మార్గం

అనారోగ్యం తలెత్తిన తర్వాత ఇబ్బందులు పడేకంటే.. నివారణ చర్యలపైనే ప్రజలు దృష్టిపెట్టాలని ప్రజలందరికీ మోదీ సూచించారు. 'వ్యాధి నివారణ ఖర్చు చాలా తక్కువ. త్వరగా నయమయ్యేందుకు దోహదపడుతుంది.నివారణ ద్వారా వ్యక్తిగతంగా లాభం పొందటంతోపాటు కుటుంబం, సమాజానికీ మేలు చేసినవారమవుతాం' అని ప్రధాని పేర్కొన్నారు. వ్యాధి నివారణమార్గాల్లో యోగా ఒకటని ఆయన సూచించారు. 2025 కల్లా దేశంలో క్షయ వ్యాధి లేకుండా చేయాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని.. ఆయుష్మాన్ భవ కార్యక్రమం ద్వారా పదికోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆరోగ్య భారతం స్వచ్ఛ భారతమంత ముఖ్యమైనదన్నారు. ఈ రెండూ ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉన్నాయన్నారు. ప్రజలకు తక్కువధరకే ఔషధాలు అందించేందుకు దేశవ్యాప్తంగా 3వేల జనఔషధి కేంద్రాలను ప్రారంభించినట్లు మోదీ తెలిపారు. వైద్యకళాశాలల్లో సీట్ల సంఖ్యనూ పెంచుతున్నట్లు ఆయన వెల్లడించారు.

'అవిశ్వాస'మంటే కేంద్రానికి భయం

కార్పొరేట్లకు దోచిపెట్టడమే మోదీ సాధించిన ఘనత: రాహుల్



సాక్షి, బెంగళూరు: పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానికి కేంద్రం భయపడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. మైసూరులో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. 10 రోజులుగా అవిశ్వాస తీర్మానం పెండింగ్‌లో ఉందని, దాన్ని చర్చకు చేపట్టేందుకు మోదీ ప్రభుత్వం ధైర్యం చేయడంలేదని విమర్శించారు. ఆంధ్రా పార్టీలు వైఎస్సార్సీపీ, టీడీపీ తరువాత కాంగ్రెస్ ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసేలా కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పించడమే బీజేపీ ప్రభుత్వం చేసిన అతిపెద్ద ఘనకార్యమని రాహుల్ ఆరోపించారు.

బీజేపీ వల్లే కశ్మీర్‌లో అస్థిరత..

ఒకప్పుడు మనకు మిత్ర దేశాలుగా ఉన్న నేపాల్, మయన్మార్, శ్రీలంక, మాల్దీవులు లాంటి దేశాలు ఇప్పుడు చైనాకు దగ్గరయ్యాయని తెలిపారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం వెన్నెముకను యూపీఏ ప్రభుత్వం విరిచేసిందని, కానీ ఆ రాష్ట్రంలో బీజేపీ మద్దతుతో పీడీపీ అధికారంలోకి వచ్చాక ఉగ్ర దాడులతో హింస యథావిధిగా కొనసాగుతోందని పేర్కొన్నారు.

నమో యాప్‌తో డేటా దుర్వినియోగం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ అధికార 'నమో యాప్' ద్వారా ప్రజల అనుమతి లేకుండానే వారి సమాచారం విదేశీ కంపెనీలకు చేరుతోందని రాహుల్ ఆరోపించారు. 'హాయ్.. నేను భారత ప్రధానిని. నా అధికార యాప్‌ని వాడుకుంటే మీ సమాచారాన్నంతా అమెరికా కంపెనీల్లోని నా స్నేహితులకు ఇస్తా' అని రాహుల్ ట్వీట్‌చేశారు. యాప్‌తో సమాచారం దుర్వినియోగమవుతోందన్న ఓ ఫ్రెంచ్ హ్యాకర్ ఆరోపణల ఆధారంగా ప్రచురితమైన కథనంపై రాహుల్ ఈ స్పందించారు. కాగా, రాహుల్ ఆరోపణలను బీజేపీ ఖండించింది. కాంగ్రెస్ అధ్యక్షుడి నుంచి ఇంతకన్నా గొప్ప మాటలు ఆశించలేమని బీజేపీ తిప్పికొట్టింది.

త్వరలో శతాబ్ది రైళ్ల చార్జీలు తగ్గింపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రద్దీ తక్కువగా ఉన్న మార్గాల్లో నడిచే శతాబ్ది ప్రీమియం రైళ్లలో చార్జీలను త్వరలో తగ్గించనున్నట్లు రైల్వేశాఖ ఉన్నతాధికారి చెప్పారు. ఈ ప్రతిపాదనపై రైల్వేశాఖ ప్రస్తుతం పనిచేస్తోందన్నారు. ఎక్కువ రద్దీలేని మార్గాల్లో నడుస్తున్న 25 శతాబ్ది రైళ్లలో చార్జీల్ని తగ్గించే అవకాశమున్నట్లు గుర్తించారు. గతేడాది ఢిల్లీ–అజ్మీర్, చెన్నై–మైసూరుల మధ్య చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో దీన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. బస్సులకు సమానంగా చార్జీలు తగ్గించడంతో ఈ మార్గాల్లో రైల్వే ఆదాయం 17 శాతం, ప్రయాణికుల బుకింగ్స్ 63 శాతం పెరిగాయన్నారు.

ముఖంతోనూ ఆధార్ ధ్రువీకరణ

జూలై 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: వృద్ధాప్యంతో వేలిముద్రలు చెరిగిపోయిన, మసకబారిన వారికి ఆధార్ ధ్రువీకరణ సమయంలో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ముఖంతోనూ ఆధార్ ధ్రువీకరణ చేపట్టేందుకు ఆధార్ ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సమాయత్తమవుతోంది. జూలై 1 నుంచే ఈ విధానం అమల్లోకి రానుంది. అయితే ఆధార్ ధ్రువీకరణకు ముఖం ఒక్కటే సరిపోదని యూఐడీఏఐ పేర్కొంది. దీనికి అదనంగా వేలిముద్రలు, కంటిపాప, వన్‌టైం పాస్‌వర్డ్(ఓటీపీ)ల్లో ఒకదాన్ని కూడా సరిపోల్చాల్సి ఉంటుందని స్పష్టతనిచ్చింది.

తెల్లోడి ముందు దుస్తులు విప్పగా లేనిది...

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి కేజే ఆల్ఫోన్స్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆధార్ సమాచారం దుర్వినియోగమవుతోందని ప్రచారం చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఆదివారం వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. వీసా కోసం విదేశీయుల ముందు దుస్తులు విప్పడానికి కూడా సిద్ధపడే భారతీయులు..ప్రభుత్వం వ్యక్తిగత వివరాలు అడిగితే మాత్రం ప్రైవసీ దెబ్బతింటుందని రాద్ధాంతం చేస్తున్నారని చురకలంటించారు. ' అమెరికా వీసా కోసం నేను కూడా 10 పేజీల దరఖాస్తును నింపా. తెల్లవాడికి మన వేలిముద్రలు ఇవ్వడానికి, వారి ముందు నగ్నంగా నిలబడటానికి మనకేం అభ్యంతరం ఉండదు. కానీ మన ప్రభుత్వమే పేరు, చిరునామా లాంటి వివరాలు అడిగితే మాత్రం గోప్యతను ఉల్లంఘిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు' అని ఆల్ఫోన్స్ వ్యాఖ్యానించారు.

సమాచార కమిషన్ అవసరమా?

- పారదర్శకత, జవాబుదారీతనం లేనప్పుడు ఏం ఉపయోగం?
- సీఐసీ ఆర్కే మాథుర్‌కు శ్రీధర్ ఆచార్యులు ఘాటు లేఖ



న్యూఢిల్లీ: ఫిర్యాదులను ఓ ధర్మాసనం విచారిస్తుండగా అర్ధాంతరంగా దానిని రద్దు చేసి అదే ఫిర్యాదు విచారణకు మరో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసిన విధానంపై సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆర్కే మాథుర్‌కు శ్రీధర్ ఫిబ్రవరిలో 2 లేఖలు రాయగా అవి ఇటీవలే బయటకొచ్చాయి. ఇలా ధర్మాసనాలు ఏర్పాటు చేస్తే సమాచార కమిషనర్ల స్వతంత్రతపై తీవ్ర అనుమానాలు రేకెత్తుతాయనీ, పారదర్శకత, జవాబుదారీతనం లేనప్పుడు ఇక ఈ సమాచార కమిషన్ ఉండటం ఎందుకని ప్రశ్నించారు.

అసలేం జరిగింది..

బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎంలను 2013లో సమాచార హక్కు చట్టం పరిధిలోకి తెచ్చారు. ఆ పార్టీలు ఈ చట్టానికి కట్టుబడి సమాచారం ఇవ్వడం లేదని ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ జరిపేందుకు 2016లో సమాచార కమిషనర్లు శ్రీధర్ సభ్యుడిగా త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటైంది. ఆరు నెలల అనంతరం కమిషనర్లకు చెప్పకుండానే మాథుర్ ఆ ధర్మాసనాన్ని రద్దు చేసి 2017 ఆగస్టులో కొత్త ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. కొత్త ధర్మాసనం ఆ ఫిర్యాదులను ఇప్పటివరకు విచారించలేదు. ప్రధాని మోదీ ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ ఉత్తీర్ణులయినట్లుగా చెబుతున్న విద్యా సంవత్సరం రికార్డులను బయటపెట్టాలని 2017లో శ్రీధర్ ఆదేశించారు. వెంటనే ఆయనను మానవ వనరుల శాఖ ఫిర్యాదులపై విచారణ బాధ్యతల నుంచి తప్పించారు. 'కేసులను ఎవరికి అప్పగించాలనే దానిని అర్థవంతమైన పద్ధతిలో కమిషన్ సభ్యులందరూ నిర్ణయించాలి. ఫిర్యాదులను మనం ఏళ్ల తరబడి విచారించడం లేదు. కీలకమైన రాజకీయ పార్టీలపై వచ్చిన ఫిర్యాదులను విచారించకపోతే, స్వతంత్రంగా వ్యవహరించలేకపోతే ఇక మనం పారదర్శకంగా ఉన్నామని ఎలా చెప్పగలం? ఈ కమిషన్ ప్రయోజనం లేకుండా ప్రభుత్వ ఖజానాకు భారంగా మారి కొనసాగాల్సిన అవసరమేంటి?' అని లేఖలో శ్రీధర్ ఆచార్యులు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

కర్ణాటకలో హోరాహోరీ!

అధికారం నిలుపుకోవడానికి కాంగ్రెస్, తిరిగి చేజిక్కించుకోవడానికి బీజేపీ తహతహ



వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాల్ని ప్రభావితం చేస్తాయని భావిస్తున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఎలాగైనా కన్నడ పీఠాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్, తిరిగి చేజిక్కించుకోవాలని బీజేపీ ఎత్తుకు పైఎత్తు వేస్తున్నాయి. కొన్ని నెలలుగా సీఎం సిద్దరామయ్య తీసుకున్న ప్రజాకర్షక నిర్ణయాలు గెలుపు కలలు కంటున్న బీజేపీని ఇరకాటంలోకి నెట్టాయి. అయితే 1985 నుంచీ ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో పాలకపక్షం ఓడిపోవడం రివాజుగా మారింది. ఆ ఆనవాయితీ ఇప్పుడూ కొనసాగుతుందని బీజేపీ ఆశతో ఉంది. అయినా ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తరచుగా కర్ణాటక పర్యటిస్తున్నారు. త్రిపురలో ఘనవిజయం సాధించిన బీజేపీ యూపీ లోక్‌సభ ఉప ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో కర్ణాటక ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది.

లింగాయత్‌లపై కాంగ్రెస్..రైతులపై బీజేపీ

బీజేపీకి గట్టి మద్దతుదారులైన లింగాయత్‌లలో చీలిక తెచ్చేందుకు వీరశైవ–లింగాయతుల ధర్మాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలని సిద్దరామయ్య ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సర్కారు సిఫార్సును కేంద్రం ఆమోదిస్తేనే కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ప్రయోజనం దక్కుతుంది. ఈ నిర్ణయం బీజేపీకి కూడా ఇబ్బందికరమే. కాంగ్రెస్ వ్యూహం ఫలిస్తే లింగాయత్‌లు అధికసంఖ్యలో నివసించే ఈశాన్య కర్ణాటక ప్రాంతాల్లో బీజేపీకి విజయావకాశాలు తగ్గుతాయి. ఉచిత బియ్యం పథకంతోపాటు స్కూళ్లలో ఉచితంగా పాలు, గుడ్ల సరఫరా, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు వంటి పలు సంక్షేమ పథకాల్ని కాంగ్రెస్ అమలు చేస్తోంది. సహకార బ్యాంకుల రుణాల మాఫీతో పాటు తక్కువ ధరకు భోజనం, ఆహారపదార్థాల సరఫరా కోసం ప్రారంభించిన ఇందిరా క్యాంటీన్లు కూడా ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ఇవన్నీ తమకు కలసి వస్తాయనే నమ్మకంతోఉంది. కర్ణాటకలో 80 లక్షల మంది రైతులే ఎన్నికల్లో జయాపజయాలు నిర్ణయిస్తారని భావిస్తున్నారు. అందుకే తాము అధికారంలోకి వస్తే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. పాత మైసూరు ప్రాంతంలో పరిస్థితి కాంగ్రెస్, జేడీఎస్‌కు అనుకూలంగా ఉందని అంచనా. 2004 ఎన్నికల నాటి నుంచీ రాజధాని బెంగళూరు ప్రాంతం బీజేపీకి కంచుకోటలా మారింది. కోస్తాలో కూడా బీజేపీ ఎక్కువ సీట్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోలింగ్ తేదీ నాటికి జనాదరణ పెరిగితే మెజార్టీ రాకున్నా అత్యధిక సీట్లు సాధించిన పెద్ద పార్టీగా బీజేపీ అవతరించవచ్చు. 25–35 సీట్లు సాధిస్తే జేడీ(ఎస్) ప్రభుత్వ ఏర్పాటులో కీలకం కానుంది.

సర్వేలు ఏం చెప్పాయంటే

ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన మూడు సంస్థల ఎన్నికల సర్వే ఫలితాల్లో కాంగ్రెస్ ముందంజలో ఉంది. ఫిబ్రవరి 2న క్రియేటివ్ సెంటర్ ఫర్ పొలిటికల్ అండ్ సోషల్ స్టడీస్ సంస్థ వెల్లడించిన ఫలితాల్లో.. మొత్తం 224 సీట్లలో బీజేపీకి 113, కాంగ్రెస్‌కు 85, జేడీఎస్‌కు 25 స్థానాలు రావచ్చని జోస్యం చెప్పింది. కర్ణాటకలో బీజేపీకి సాధారణ మెజారిటీ లభిస్తే వచ్చే డిసెంబర్‌లో జరగనున్న రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరగొచ్చనే అంచనాలు జోరందుకున్నాయి.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

మరో రెండ్రోజుల పాటు అసెంబ్లీ!

పంచాయతీరాజ్ బిల్లుపై చర్చించేందుకు..

సాక్షి, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలను మరో రెండ్రోజుల పాటు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. 27న ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించిన తర్వాత సమావేశాలను వాయిదా వేయాలని బీఏసీ గతంలో నిర్ణయించింది. అయితే పంచాయతీరాజ్ బిల్లుపై చర్చించి, ఆమోదించడానికి సభను మరో రెండ్రోజులు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేయాలని యోచిస్తోన్న ప్రభుత్వం ఈ మేరకు సభలో ఉన్న ప్రతిపక్ష పార్టీల నేతలకు సమాచారాన్ని ఇచ్చింది. 27న జరిగే బీఏసీ సమావేశంలో పంచాయతీరాజ్ బిల్లుపై చర్చ కోసం సభను పొడిగించాలనే నిర్ణయాన్ని అధికారికంగా తీసుకోనున్నారు.

డిసెంబర్ కల్లా 'ఇంటర్‌నెట్': కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే డిసెంబర్ నాటికల్లా ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. కోటి కుటుంబాలకు 15 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లోని పాఠశాలలు, కార్యాలయాలు, పీహెచ్‌సీలకు ఒక జీబీ స్పీడ్ ఇంటర్‌నెట్ సౌకర్యం అందించి పౌర సేవలను సులభతరం చేస్తామని వెల్లడించారు. ఆదివారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు ఎంఎస్ ప్రభాకర్, రామచందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా శాశ్వత చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

కొందరికి నిద్ర పట్టట్లేదు: జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 24 గంటల కరెంట్ కొందరికి నిద్ర పట్టనీయడం లేదని.. అందుకే దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. యాసంగిలో సహజంగానే భూగర్భ జలాలు తగ్గుతాయని, కానీ పనిగట్టుకొని కొన్ని పార్టీల నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు: మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే సెప్టెంబర్ నెలలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తుందని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఫేమ్ ఇండియా పథకం కింద కేంద్రం సహకారంతో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. తొలి దశలో 40, రెండో దశలో 60 బస్సులను ప్రవేశపెడుతున్నామని తెలి పారు. ఏసీ ఎలక్ట్రానిక్ బస్సును ఒకసారి చార్జ్ చేస్తే కనీసం 4 గంటలు పనిచేస్తుందని చెప్పారు.

రైతు యూనిట్‌గా బీమా కావాలి: పోచారం

సాక్షి, హైదరాబాద్: రైతులకు బీమా సౌకర్యం పూర్తిగా కలగాలంటే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో.. గ్రామం, మండలం యూనిట్ కాకుండా రైతు వారీగా పరిగణించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పథకంపై సభ్యుడు పాతూరి సుధాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ పథకాన్ని రైతు యూనిట్‌గా అమలు చేయాలని ఉభయ సభల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి గతంలోనే పంపామని తెలిపారు.

పాఠశాలలోనే అంగన్‌వాడీలు: కడియం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లోనే అంగన్‌వాడీలు ఏర్పాటు చేసి, అక్కడ ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించే ఆలోచన చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెల్లడించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 11,800 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల్లో ఉన్నందున అక్కడే ఎల్‌కేజీ, యూకేజీ నిర్వహించడంపై ఆలోచిస్తున్నామని తెలిపారు.

డీజీపీ నియామకాధికారం రాష్ట్రానికే

సాక్షి, హైదరాబాద్: డీజీపీని నియమించుకునే అధికారం రాష్ట్రానికే కల్పిస్తూ కొత్త పోలీసు చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆదివారం శాసనమండలి బిల్లును ఆమోదించింది. బిల్లును మంత్రి కేటీఆర్ ప్రవేశపెట్టగా, మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్ర అసైన్డ్ భూముల చట్టం–1977ను సవరించేందుకు ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ ప్రవేశపెట్టిన బిల్లును, విద్య, వృత్తిదారుల రిజిస్ట్రేషన్ చట్టం–1968 ను సవరించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రవేశ పెట్టిన బిల్లును, పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి చేస్తూ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టిన బిల్లును, న్యాయవాదుల గుమాస్తాల సంక్షేమ నిధి చట్టం, న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టంను సవరించేందుకు పెట్టిన రెండు బిల్లులను ఆమోదించింది.

120వ రోజు

25–03–2018, ఆదివారం
ముప్పాళ్ల,
గుంటూరు జిల్లా



మీరు చేసిన పాపాలను ప్రజలెందుకు మోయాలి?

ఈ రోజు ఉదయం నరసరావుపేట పట్టణంలో ఉప్పొంగిన జనాభిమానం మధ్య రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేయడానికి మూడున్నర గంటలు పట్టింది. పాదయాత్ర దారి వెంబడి.. పండుగ ముందురోజే శ్రీరామనవమి సందడి కనిపించింది. వీధివీధినా చలువ పందిళ్లు వేశారు. సీతారాముల కల్యాణానికి వైభవంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లోక కల్యాణార్థం జరిగే పండుగ అందరిలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని.. నన్ను కలిసిన జనం చెప్పారు. ఈ రావణాసుర పాలన పోవాలని, రాజన్న తరహాలో మళ్లీ రామరాజ్యాన్ని స్థాపించాలని ఆకాంక్షించారు.

ఆరేళ్ల సందీప్ కళ్లల్లో వెలుగులు చూసి చాలా సంతోషించాను. కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేస్తున్నప్పుడు వాళ్ల తల్లిదండ్రులు ఇదే బాలుడితో నన్ను కలిశారు. అతనికి పుట్టు చెవుడు, మూగ. అప్పుడా దంపతుల కళ్లల్లో కన్నీళ్లే కనిపించాయి. ఆ చిన్నారి దివ్యాంగుడని తెలిసి చలించిపోయాను. వారిని హైదరాబాద్ పంపించి కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించాను. ఆ చిన్నారికి ఇప్పుడు వినికిడి శక్తి రావడంతో తమ ఆనందాన్ని నాతో పంచుకోవాలని వచ్చారు. ఆ తల్లిదండ్రుల కళ్లల్లో ఆనంద భాష్పాలు జాలువారాయి. నా మనస్సు చాలా తేలికనిపించింది. గతంలో జరిగిన ఓ సంఘటన నాకు ఇప్పటికీ గుర్తుంది. ఇదే నరసరావుపేట ప్రాంతానికి చెందిన ఇస్రత్ అనే చిన్నారికి నాన్నగారు ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టిన తొలినాళ్లలోనే కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయించి కొత్త జన్మనిచ్చారట. ఆ తల్లిదండ్రులు నాన్నగారి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో నివాళులర్పించి నన్ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. చాలా సంతోషం అనిపించింది. ఇలాంటి ఘటనలే మనకు కొత్త శక్తినిస్తాయి.

మురళీచంద్ అనే వైద్యుడు కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్‌ను మరింత పకడ్బందీగా నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించి కొన్ని సూచనలు చేశారు. ఈ ఆపరేషన్‌కు వాడే వైద్య ఉపకరణాల రేట్లు నియంత్రించాలని, దేశీయ పరిజ్ఞానంతో వాటిని తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, చంద్రబాబు హయాంలో జవసత్వాలు కోల్పోయిన ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తేనే.. మూగ, చెవిటి వారందరికీ మేలు జరుగుతుందని సూచించాడు. ఆ సూచనల్ని ఆచరణలోకి తేవడానికి గట్టి ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చాను.

'ప్రత్యేక హోదా వస్తేనే భావితరానికి మనుగడ.. దాన్ని సాధించి తీరాలన్నా..' అంటూ పిల్లల గురించి ఆలోచించే ప్రతి అమ్మా కోరుకుంటోంది. ఈ రోజు చినలక్ష్మి అనే అక్క చెప్పిందీ ఇదే. కొబ్బరిబోండాల చిరు వ్యాపారంతోనే తన ఇద్దరు పిల్లలను బీటెక్ చదివిస్తోందట. హోదాపై బాబుగారు ఆడుతున్న నాటకాలు, కేంద్రానికి తాకట్టు పెట్టిన తీరు చూసి కలత చెందుతోందట. 'అన్నా.. ఈ నాలుగేళ్లలో ఒక కంపెనీ రాలేదు.. ఒక ఉద్యోగమూ లేదు. పిల్లల భవిష్యత్తుపై బెంగగా ఉంది' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. 'హోదా వస్తే మన రాష్ట్రంలోనే ఉద్యోగాలొస్తాయి. మా పిల్లల జీవితాలు బాగుపడతాయి. మాలాంటి వారికోసమైనా హోదా సాధించాలన్నా.. మీరొస్తేనే హోదాను తీసుకొస్తారన్నా..' అంటూ ఆ అక్క అన్న మాటలు నా సంకల్పానికి బలాన్నిచ్చాయి. ఇలాంటి అక్కచెల్లెమ్మల ఆవేదన ఈ సర్కారుకు పట్టకపోవడం శోచనీయం. ప్రజల కోసం ఆలోచించే ఏ నేతా ఇంత దుర్మార్గంగా హోదాను తాకట్టుపెట్టడేమో.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీ తప్పులను ప్రశ్నిస్తుంటే.. అది రాష్ట్ర ప్రజలపై జరుగుతున్న దాడి అని అభివర్ణిస్తున్నారు. మీ స్వార్థ ప్రయోజనాల కోసం.. దేన్నీ వదలకుండా విపరీతంగా అవినీతికి పాల్పడ్డారు. ఆ అవినీతి సొమ్ముతో అక్రమాలు చేస్తూ దొరికిపోయారు. కేసులకు భయపడి.. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. అక్రమాలను ఎత్తిచూపితే.. దాన్ని రాష్ట్ర ప్రజలందరికీ ఆపాదించడం ఎంతవరకు సమంజసం? మీరు చేసిన పాపాలను ప్రజలెందుకు మోయాలి?

వైఎస్. జగన్.

మాకు విపక్షమూ స్వపక్షమే

అసెంబ్లీలో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్య

- గత ముఖ్యమంత్రుల మాదిరి కేసీఆర్ సంకుచితంగా వ్యవహరించట్లేదు
- విపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకూ సమానంగా నిధులిచ్చాం
- న్యాయ, సమాచార, సాధారణ పరిపాలన పద్దులకు సభామోదం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తమ ప్రభుత్వం విపక్ష ఎమ్మెల్యేలను సైతం స్వపక్షంగానే భావిస్తూ పాలన సాగిస్తోందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు విశాల దృక్పథంతో పరిపాలన సాగిస్తున్నారని, గత ముఖ్యమంత్రులు వ్యవహరించినట్లుగా సంకుచిత మనస్తత్వం ప్రదర్శించడం లేదన్నారు. రాష్ట్రంలో కేవలం నలుగురి పాలనే నడుస్తోందని, కొందరికే పాలనాధికారాల వల్ల పరిపాలన దెబ్బతింటోందంటూ ఆదివారం అసెంబ్లీలో వివిధ పద్దులపై చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన విమర్శలను హరీశ్‌రావు తిప్పికొట్టారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ. 1.5 కోట్ల చొప్పునే ఉండేవని, వాటిని కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలున్న చోట్ల మాత్రమే మంజూరు చేసేవారని హరీశ్‌రావు గుర్తుచేశారు. విపక్ష పార్టీ సభ్యులున్న చోట ఇన్‌చార్జి మంత్రి పేరిట, నియోజకవర్గ నేత పేరిట మంజూరు జరిగేదన్నారు. కానీ తమ ప్రభుత్వం విపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధికి కూడా రూ. 3 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తోందన్నారు. అలాగే ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో తలకెత్తుకున్న మిషన్ భగీరథ పథకాన్ని మొత్తం 119 నియోజకవర్గాల్లోనూ చేపడుతున్నామన్నారు. ప్రతి గూడెం, గిరిజన తండా, గ్రామాల్లో అత్యంత వేగంగా పనులు సాగుతున్నాయన్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు కావాలని ఎమ్మెల్యేలు వేడుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రమంతటా ఒకటే పాలసీ. ప్రజలకు ఏం కావాలో సీఎంకు తెలుసని, రాష్ట్ర సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ముందుకెళ్తున్నామన్నారు.

అక్కడా మిషన్ కాకతీయ..

మిషన్ కాకతీయ పథకంలోనూ విపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఏయే నియోజకవర్గాల్లో చెరువుల పునరుద్ధరణను తొలుత ప్రారంభించాలని సీఎం కేసీఆర్‌ను తాను అడగ్గా ప్రతిపక్ష ఎమ్మెల్యేలూ ఉద్యమకారులేనని, వారి నియోజకవర్గాల్లోని ప్రజలు కూడా తెలంగాణ వాళ్లేనని చెప్పిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో 20 శాతం చెరువులను తీసుకుని అభివృద్ధి చేశామన్నారు. ప్రతీ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి జిల్లా కేంద్రం నుంచి డబుల్ రోడ్డు వేయమని సీఎం చెప్పారని, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. గతంలో 31 లక్షల పెన్షన్లు ఉంటే ఇప్పుడు 41 లక్షల పెన్షన్లు ఇస్తున్నామని హరీశ్ వెల్లడించారు. పక్క రాష్ట్రంలో పెన్షన్లు ఇవ్వాలంటే టీడీపీ నేతలే సభ్యులుగా ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు కావాల్సిన వాళ్లకే పెన్షన్లు మంజూరు చేస్తున్న విషయాన్ని సండ్ర వెంకట వీరయ్య గ్రహించాలని సూచించారు. ఎమ్మెల్యేల చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేసే మంచి పనులను కూడా విమర్శించాలనుకోవడం సరి కాదన్నారు.

గుర్తింపు కోసమే ప్రకటనలు

రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు పెట్టి పత్రికలకు ఇస్తున్న ప్రకటనలపై వివరణ ఇవ్వాలని టీడీపీ, బీజేపీ, సీపీఎం డిమాండ్‌పైనా మంత్రి హరీశ్‌రావు స్పందించారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా తెలియజేసేందుకే ప్రకటనలు ఇస్తున్నామన్నారు. జర్నలిస్టుల సంక్షేమంలోనూ తమ ప్రభుత్వం దేశంలో నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా మొదటిసారిగా కార్పొరేట్ స్థాయిలో వైద్య చికిత్సలు అందించేందుకు 8,535 మంది జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, 16,793 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేశామని, 16,492 మందికి ప్రమాద బీమా కింద రూ. 5 లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. ఏటా జర్నలిస్టుల సంక్షేమానికి రూ. 34.50 కోట్లు కేటాయిస్తున్నామన్నారు. కాగా, న్యాయశాఖ, సమచార, సాధారణ పరిపాలన విభాగంతో పాటు పలు పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపింది. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది.

కాంగ్రెస్సోళ్లది జిల్లాకో మాట

ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుంటే.. అవి పూర్తికాకుం డా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని హరీశ్‌రావు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు జిల్లాకో రీతిగా మాట్లాడుతున్నారని.. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ నేత హర్షవర్ధన్‌రెడ్డి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులేసి ప్రాజెక్టులు అడ్డుకుంటే.. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివారం అసెంబ్లీలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని చంద్రసాగర్.. నల్లగొండ జిల్లాలోని పిల్లా యిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగానీ కాలువల అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. '60 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా సింగూరు ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాలకు సాగునీరిచ్చాం. టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటికి కొదు వలేదని రైతులు అంటున్నారు' అని వివరిం చారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగానీ కాలువ అభివృద్ధి కోసం ప్రభు త్వం రూ.284.5 కోట్లు విడుదల చేసిందని, ఈ ఏడాది డిసెంబర్ లోపు పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఏప్రిల్ 31 లోపు కొత్త రేషన్ కార్డులు: ఈటల

ఏప్రిల్ 31 లోపు కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని పౌరసరఫరాల మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. రేషన్ కార్డుల జారీపై అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో 4.06 లక్షల బోగస్ రేషన్ కార్డులను తొలగించామని చెప్పారు. కొత్త కార్డుల కోసం 2.56 లక్షల దరఖాస్తులొచ్చాయని.. వీటిలో 89,713 దరఖాస్తులు పరిశీలించి 77,000 మందిని అర్హులుగా తేల్చామన్నారు.

బోదకాలు బాధితులకు పెన్షన్: లక్ష్మారెడ్డి

బోదకాలు వ్యాధిగ్రస్తులకు నెలవారీ పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని వైద్యారోగ్య మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. బోదకాలు బాధితులకు సహాయం, బస్తీ దవాఖానాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. బోదకాలు బాధితులు మలవిసర్జన సమయంలో ఇబ్బంది పడుతున్నారని, ఈ దృష్ట్యా ఉపాధిహామీ కింద నిర్మించే మరుగుదొడ్లను వెస్ట్రన్ పద్ధతిలో నిర్మించాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు.

కొత్తగూడెంలో అబ్కారీ కార్యాలయం: పద్మారావు

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అబ్కారీ శాఖ కార్యాలయం, బేవరేజెస్ కార్పొరేషన్ గోదాము నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ మంత్రి పద్మారావు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. భవన నిర్మాణ నమూనాలు సిద్ధమయ్యాయని, బడ్జెట్ సమావేశాలు ముగియగానే తానే స్వయంగా వెళ్లి పనులు ప్రారంభిస్తానని చెప్పారు.

బావిలో పడ్డ ఆటో

▶ మొదటిపేజీ తరువాయి


కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఎలా జరిగింది..?

ముప్కాల్ నుంచి మెండోరాకు 20 మందితో కిక్కిరిసిన ఆటో బయల్దేరింది. డ్రైవర్ సీటుకు కూడా ఇరువైపులా నలుగురు కూర్చున్నారు. రెండు నిమిషాలైతే ఆటో మెండోరాకు చేరుకునేది. కానీ ఇంతలోనే అతివేగం కారణంగా ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. రోడ్డుకు కేవలం రెండు మీటర్ల లోపే ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ఈ బావి ఉంది. రోడ్డుకు బావికి మధ్య చిన్న పాటి కాలువ కూడా ఉంది. ఈ కాలువ గట్టును ఢీకొనడంతో కొంత ఎత్తు ఎగిరి ఆటో నేరుగా బావిలో పడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఎడమ వైపు నుంచి పడిపోవడం, ఆటోలో కుడివైపు రాడ్డు ఉండటంతో ప్రయాణికులకు బయటకు రావడానికి వీల్లేకుండా పోయింది. మృతుల సంఖ్య పెరగడానికి ఇదే కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పంటల చుట్టూ కట్టే చీరలను, దగ్గర్లో ఉన్న ఓ తాడును తెచ్చి బావిలోకి వదిలారు. తాడు, బావిలోని మోటారు పైపును పట్టుకుని తొమ్మిది మంది బయటకు వచ్చారు. మిగతా 11 మంది చనిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆర్మూర్, నిర్మల్ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఓవైపు నీటిని తోడేస్తూ మరోవైపు గజ ఈతగాళ్లతో మృతదేహాల గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఎం.రామ్మోహన్‌రావు, జేసీ రవీందర్‌రెడ్డి, సీపీ కార్తికేయ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. నిర్లక్ష్యంగా ఆటోను నడిపిన డ్రైవర్ శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతివేగం, ఓవర్‌లోడ్ ఈ ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.



చిన్నారుల మృతదేహాలు



ప్రమాదం నుంచి బయటపడ్డ రెండు నెలల చిన్నారి



బావిలో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న రైతులు, స్థానికులు

మృతుల వివరాలు..

1. బొప్పారం సాయమ్మ (50), వేంపల్లి, 2. మద్దికుంట లక్ష్మి (38), ధర్మోరా, 3. గుండం గంగామణి (45) కేశాపూర్, 4. పెద్దోళ్ల సంపత్ (14) మోస్రా, 5. తెడ్డు రోజ (25), చిట్టాపూర్, 6. తెడ్డు ప్రశంస (7) చిట్టాపూర్, 7. తెడ్డు చిన్ని (2), చిట్టాపూర్, 8. తెడ్డు చక్కాని (5), చిట్టాపూర్, 9. మెట్టు వినయశ్రీ (6), కొడిచర్ల 10. మనస్విని (3), ఆలూరు, 11. గుర్తు తెలియని మహిళ

క్షతగాత్రులు వీరే..

వర్ని మండలం మోస్రాకు చెందిన పెద్దోళ్ల సుమలత, పెద్దోళ్ల మల్లవ్వ, ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బొప్పారం చిన్నరాజు, బొప్పారం విజయ, సంజయ, ప్రవీణ, సంగీత, రెండు నెలల పసికందు మనీష్, డ్రైవర్ గోపి శ్రీనివాస్.

ఆ చిన్నారి.. మృత్యుంజయుడు

మెండోరాకు చెందిన సంగీతకు ఆర్మూర్ మండలం ఆలూరుకు చెందిన మహేశ్‌తో వివాహమైంది. భర్త వ్యవసాయ కూలీ పనిచేస్తుండగా సంగీత బీడీలు చుడుతోంది. వీరికి మనస్విని (3), రెండు నెలల బాబు ఉన్నారు. ఇటీవలే పుట్టిన మనుమడిని, తన బిడ్డ సంగీతను ఇంటికి తీసుకువచ్చేందుకు మెండోరాకు చెందిన సత్తెమ్మ (45) ఆదివారం ఆలూరు వెళ్లింది. సంగీత, మనుమరాలు మనస్విని, మనవడితో ముప్కాల్ వరకు బస్సులో వచ్చి, అక్కడి నుంచి ఆటోలో మెండోరాకు బయల్దేరింది. ఆటో బావిలో పడడంతో సత్తెమ్మ, మనస్విని మృతి చెందారు. సంగీత కాలు విరిగింది. ఆమెతోపాటు ఆమె రెండు నెలల బాబు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

వదినను తీసుకొస్తూ..

మెండోరా మండలం కొడిచెర్లకు చెందిన ప్రవీణకు నిజామాబాద్‌కు చెందిన రాజుతో వివాహమైంది. ప్రవీణ వాళ్ల అన్నకు ముగ్గురు పిల్లల్లు. ఒక కొడుకు, ఇద్దరు బిడ్డలు. వదిన, ఆమె పిల్లలు విన్యశ్రీ(6), కొడుకును వెంట తీసుకుని ప్రవీణ తమ గ్రామమైన కొడిచెర్లకు బయల్దేరింది. ముప్కాల్ వరకు బస్సులో వచ్చిన తర్వాత.. వదిన, ఆమె కొడుకు ఇద్దరూ దిగిపోయారు. అక్కడే చదువుకుంటున్న విన్యశ్రీని తీసుకొని ప్రవీణ ఆటోలో బయల్దేరింది. ప్రమాదంలో విన్యశ్రీ మృతిచెందింది. తీవ్రంగా గాయపడ్డ ప్రవీణ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం...

సంగారెడ్డికి చెందిన నలుగురి మృతి

మనూరు (నారాయణఖేడ్): కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు మృతి చెందారు. నాగల్‌గిద్ద మండలం వల్లూర్‌కు చెందిన మేత్రి లక్ష్మి (40), ఆమె కూతురు ముత్తమ్మ (25), అల్లుడు పండరి, మనవడు సాయి (2), బంధువు గొల్ల పద్మ (35), ఆమె కూతురు సునీత (6), మరో ఐదుగురు సాయి పుట్టువెంట్రుకల కోసం శనివారం ఉదయం కర్ణాటకలోని మొగుల్‌కోడ్ బయల్దేరారు. రాత్రి 11.00 గంటలప్పుడు గుల్బర్గాకు 40 కి.మీ. దూరంలోని జవర్గీ దాబా వద్ద భోజనాలకు డ్రైవర్ బస్సును ఆపాడు. వారు రోడ్డు దాటుతుండగా గుల్బర్గా వెళ్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టింది. లక్ష్మి, పద్మ, సునీత, సాయి అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలు గుర్తించడానికి వీల్లేకుండా నుజ్జునుజ్జయ్యాయి.

వాయిదా తీర్మానాల తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ మధుసూదనాచారి తిరస్కరించారు. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీఎల్పీ నేత జి.కిషన్‌రెడ్డి, రైతుల నుంచి కొనుగోలు చేసిన కందుల బకాయిలను చెల్లించాలని టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, కాలం చెల్లిన ప్రభుత్వ ఉత్తర్వులను కార్మిక శాఖ పాలకమండలి ఆమోదంతో కొనసాగించాలని సీపీఎం సభ్యుడు సున్నం రాజయ్య వాయిదా తీర్మానాలిచ్చారు.

రాజ్యాధికారంలోనూ వాటా

- బీసీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఈటల
- త్వరలోనే అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు: జోగు రామన్న

హైదరాబాద్: బీసీలకు బర్రెలు, గొర్రెలే కాదు, రాజ్యాధికారంలోనూ వాటా ఇచ్చామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న బీసీ కులాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిత్యం పాటుపడుతోందని అన్నారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన బీసీ నేతలు బండ ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్‌కు ఆదివారం ఇక్కడ జరిగిన ఆత్మీయ అభినందన సభలో ఈటల మాట్లాడారు. బీసీల్లోని ఏ కులమూ నిరాశ చెందవద్దని, అన్ని కులాలను ఆర్థికంగా, రాజకీయంగా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

బీసీలను పెద్దలసభకు పంపాం..

అన్ని పార్టీలు బీసీలతో జెండాలను మోయించుకుంటూ వాడుకుంటుండగా టీఆర్‌ఎస్ పార్టీ మాత్రం పెద్దలసభకు పంపిందని బీసీ సంక్షేమ మంత్రి జోగు రామన్న అన్నారు. బీసీ, ఎంబీసీ, సంచార జాతుల్లోని ప్రతి కులానికి వంద ఎకరాల్లో కుల సంఘ భవనాలను జ్యోతిబాపూలే పేరు మీద నిర్మిస్తామని హామీనిచ్చారు. బీసీలుగా ఉండటం వల్లే పెద్దల సభలో అడుగుపెట్టే అవకాశం తమకు వచ్చిందని బండ ప్రకాశ్, లింగయ్య యాదవ్ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియమాల పుస్తకాల ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ నియమాలు, రూల్స్‌కు సంబంధించిన పలు పుస్తకాలను అసెంబ్లీ ఆవరణలో ఆదివారం ఆవిష్కరించారు. స్పీకర్ మధుసూదనాచారి, చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, జోగు రామన్న, జూపల్లి కృష్ణారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ విప్‌లు పాతూరి సుధాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, శాసన సభా కార్యదర్శి వి.నర్సింహాచార్యులు, ఉపకార్యదర్శి ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు.

రామరాజ్యం రావాలన్నా..

అడుగడుగునా ఆకాంక్షించిన ప్రజలు

- అవినీతి సర్కారు కుప్పకూలాలని నినాదాలు
- జననేత అడుగులో అడుగేయడానికి పోటీపడిన యువత

ప్రజా సంకల్ప యాత్ర నుంచి
సాక్షి ప్రత్యేక ప్రతినిధి

'రామ రాజ్యం రావాలి.. రాజన్న పాలన కావాలి.. సీతారామచంద్రుల కల్యాణోత్సవం సాక్షిగా మేమిదే కోరుకుంటున్నాం. ఇలాగే వేడుకుంటున్నాం' అని నరసరావుపేట పట్టణంలో వేద పండితులు వైఎస్ జగన్‌తో అన్నారు. అక్షింతలు వేసి ఆశీర్వదించారు. 'హోదా కోసం మా అన్న రామబాణం వదిలాడు. అడ్డపడుతున్న పది తలల రావణుడులాంటి చంద్రబాబు సర్కారు ఇక నేల కూలాల్సిందే' అని శ్రీరామ నవమి శుభాకాంక్షలు చెప్పేందుకు 30 కేజీల కేకుతో సిద్ధంగా ఉన్న సువర్చల, వసంత లక్ష్మిలు ఆవేశంగా చెప్పారు. ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 120వ రోజు ఆదివారం గుంటూరు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలో పూర్తి చేసుకుని సత్తెనపల్లి నియోజకవర్గంలో అడుగుపెట్టింది. పాదయాత్ర సింహభాగం నరసరావుపేటలోనే సాగడంతో పట్టణం జన సంద్రమైంది. ప్రజా వెల్లువను దాటుకుని ముందుకెళ్లడానికి జననేతకు గంటల కొద్దీ సమయం పట్టింది. హారతులిచ్చే మహిళలు.. 'అన్నా ఒక సెల్ఫీ ప్లీజ్...' అంటూ గుంపులు గుంపులుగా వచ్చారు. 'అయ్యా సల్లంగుండు' అంటూ దీవించే అవ్వాతాతలు, నువ్వొస్తే ఈ రాష్ట్రానికే పండగే అని చెప్పిన అక్కచెల్లెమ్మలు అడుగడుగునా కనిపించారు. ఆ జనవాహినిలో జగన్ ఎక్కడున్నాడో తెలియని సరికొత్త సన్నివేశం కనిపించింది. ఎండ మండిపోతున్నా జనం బారులు తీరారు. మైళ్ల కొద్దీ హుషారుగా ఆయన వెంటే కదిలివచ్చారు. నినాదాల హోరు, డప్పు దరువుల కోలాహలం, గెంతులేసే కుర్రకారు హుషారు.. ఎటుచూసినా పండుగ వాతావరణమే కనిపించింది. బరంపేట, బీసీ కాలనీ, ఇసప్పాలెం, ములకలూరు, గొల్లపాడు, ముప్పాళ్ల.. ఎక్కడికెళ్లినా బోసినవ్వుల పసిపాపలతో జగన్‌ను చూసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



గుంటూరు జిల్లా గొల్లపాడు వద్ద భారీ జనసందోహంతో కలసి ముందుకు సాగుతున్న వైఎస్ జగన్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం, 26-3-2018



అమా సిస్టర్ ఆఫ్ లామా

జెట్‌సన్ పెమా బాలలు, మహిళలు, వృద్ధుల సంక్షేమం కోసం పథక రచన

నేడు శ్రీరామ నవమి

మూడు ముత్యాలు



రామకథలో ప్రతి ఘట్టం ఒక ముత్యం. ప్రతి ముత్యం ఒక రామాయణం. ఈ శ్రీరామ నవమికి.. హనుమంతుడు మోసుకొచ్చిన మూడు ముత్యాల పర్వతాలు మీకోసం.

హిమాలయాలలో నిద్రిస్తున్న హనుమంతుడికి మెడలోని ముత్యాల హారం చేతికి తగలగానే మెలకువ వచ్చింది! 'నేడు నా రామయ్య తండ్రి కల్యాణం, నా సీతారాములు ముత్యాల తలంబ్రాలు పోసుకునే రోజు. రామనామం జపిస్తూ భద్రాద్రికి బయలుదేరతాను' అనుకుంటూ రామనామ స్మరణతో భద్రాద్రి చేరుకున్నాడు. కల్యాణం కనులారా వీక్షించి పరవశించిపోయాడు హనుమంతుడు. కల్యాణం పరిసమాప్తి తర్వాత ఆ దంపతులతో మాట్లాడసాగాడు హనుమంతుడు.

నాటి గాథ (ఒకటో ముత్యం)

''నీ పట్టాభిషేక సమయంలో నువ్వు సీతమ్మ చేతికి ఒక ముత్యాల హారం ఇచ్చి, 'జానకీ! ఈ హారాన్ని నీకు ఇష్టమైన వారికివ్వు' అన్నావు. సీతమ్మ ఆ హారాన్ని అందుకుని సింహాసనం దిగి, విభీషణ, జాంబవంత సుగ్రీవ, అంగదాది వానరులను ఒక్కొక్కరినీ దాటుకుంటూ నా దగ్గరకు రాగానే నిలబడిపోయింది. 'మారుతీ! ఈ హారానికి నీవు మాత్రమే అర్హుడవు' అంటూ నా చేతికి అందించింది. అక్కడున్నవారంతా హర్షధ్వానాలు చేశారు. నేను సిగ్గుతో ముడుచుకుపోతూ, 'తల్లీ! అంతా రాముని మహిమ వల్లే!' అన్నాను. ఇదంతా నాటి గాథ'' అన్నాడు హనుమ.

నేటి సందేహం (రెండో ముత్యం)

''తండ్రీ! నీ వెంటే ఉండి, నీ అడుగులో అడుగులు వేసిన నాకు, నువ్వంటే ఏమిటో తెలుసు. ఇతరులు నిన్ను శంకిస్తుంటే నా మనసుకి కష్టంగా ఉంది. మా సీతమ్మ తల్లి రావణుని చెరలో ఉండి వచ్చిన తరవాత, నువ్వు ఆమెను అనుమానించావని అందరూ అనుకుంటున్నారు'' అంటుండగానే... సీతమ్మ అందుకున్నారు. ''హనుమా! రాముడు నాకు భర్త మాత్రమే కాదు, కోట్లమందికి ప్రభువు. ఆయనను ఎవ్వరూ వేలెత్తి చూపకూడదు. అందుకే నాకుగా నేను చితి పేర్చుకున్నాను'' అని చెప్పింది. రాముడు, ''హనుమా! ఎవరి ఆలోచనలు వారివి. వారి కళ్లకు నా ప్రవర్తన అలా కనిపించిందేమో, వారు అలా అనుకోవడంలో తప్పులేదేమో'' అన్నాడు.

రేపటి సందేశం (మూడో ముత్యం)

''రామా! నిన్ను తొలిసారి చూసినప్పుడే నువ్వేమిటో అర్థమైందయ్యా. సీతమ్మను వెతుకుతూ మా కిష్కింధకు వచ్చావు. సీతమ్మ జాడ అడిగావు. నేను నగల మూటను చూపించాను. నువ్వు ఒక నగను చేతిలోకి తీసుకుని కంట తడిపెట్టి, పక్కనే ఉన్న సౌమిత్రితో, 'తమ్ముడూ! నా కళ్లకు కన్నీళ్లు అడ్డపడుతున్నాయి. నగలు గుర్తించలేకపోతున్నాను. మీ వదినగారి నగలను గుర్తించవయ్యా' అన్నావు. అమ్మ అంటే నీకు ఎంత ప్రేమయ్యా. అంతేనా, నీ తమ్ముడు నీకు తగ్గ అనుజుడు. ఆయనకు నగలు చూపితే, సీతమ్మ కాలి మంజీరాలు మాత్రమే గుర్తుపట్టగలిగాడు. ఎంత ఉత్తములయ్యా మీరు'' అన్నాడు హనుమ.

ఏటేటా కల్యాణం

''చివరగా ఒక్క మాట తండ్రీ.. ఎన్ని యుగాలు గడిచినా, దాంపత్యానికి చిహ్నంగా నా తల్లి సీతమ్మను, నా తండ్రి రామయ్యనే చెప్పుకుంటారు. అది నాకెంతో సంతోషం. నాడు మీ కల్యాణం చూడలేకపోయామని ఎవ్వరూ బాధపడక్కర్లేదు. ఏటేటా మీ కల్యాణం చూస్తూనే ఉంటాం'' అని, సీతారాముల ఆశీస్సులు తీసుకుని హిమాలయాలలో తపస్సు కోసం నిష్క్రమించాడు హనుమంతుడు.

- వైజయంతి

చెట్టు నీడ

కోతల కాలం

ఒక రైతు కష్టపడి పనిచేసేవాడు. రోజంతా పొలంలోనే ఉండేవాడు. ఆ రైతు కష్టాన్ని ఆ పొలంలోనే గూడు కట్టుకుని ఉన్న ఒక పిచ్చుకల కుటుంబం చూస్తూ ఉండేది.

కొన్నాళ్లకు రైతు కష్టం ఫలించింది. పంట కోతకొచ్చింది. ఊళ్లో మిగతా రైతులు కూడా కోతలకు సిద్ధం అయ్యారు. ''ఇరుగు పొరుగును తీసుకొచ్చి రేపే నేను కూడా కోతలు మొదలు పెట్టాలి'' అని ఆ రైతు ఎవరితోనో అంటుంటే పిల్ల పిచ్చుకలు విన్నాయి. వెంటనే వెళ్లి తల్లికి చెప్పాయి. ''అమ్మా.. ఇవాళే మనం ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి. కోతలు మొదలైతే మన గూడును కూడా పడగొట్టేస్తారు'' అన్నాయి.

''తొందరేం లేదు. రేపు మన రైతు కోతలు మొదలవ్వవు'' అంది పిచ్చుకల తల్లి నమ్మకంగా. అన్నట్లే మర్నాడు కోతలు మొదలవ్వలేదు. పిచ్చుకలు ఆశ్చర్యపోయాయి.

రైతు మళ్లీ.. ''రేపే దగ్గరి బంధువుల్ని తీసుకొచ్చి కోతలు మొదలు పెట్టాలి'' అని అంటుంటే విని, ఆ విషయాన్ని తల్లికొచ్చి చెప్పి, ''వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోదాం'' అన్నాయి పిచ్చుకలు.

''తొందరేం లేదు. రేపు కూడా మన రైతు కోతలు మొదలవ్వవు'' అంది తల్లి పిచ్చుక. అన్నట్లే ఆ రేపు కూడా కోతలు మొదలవ్వలేదు! పిల్ల పిచ్చుకలు మళ్లీ ఆశ్చర్యపోయాయి.

ఈసారి రైతు.. ''రేపు నేనే కోతలకు సిద్ధమౌతున్నాను'' అని ఎవరితోనో అంటుంటే పిచ్చుకలు విని, తల్లికి చెప్పాయి కానీ, 'మనం వెళ్లిపోదాం' అని అనలేదు!

అయితే ఈసారి తల్లే ఆ మాట అంది.. ''మనం వెంటనే గూడును ఖాళీ చేసి వేరే చోటుకు వెళ్లిపోవాలి'' అని!

పిచ్చుకలు తల్లి వైపు ఆశ్చర్యంగా చూశాయి.

''అవును. మన రైతు రేపు కోతలు మొదలు పెట్టేస్తాడు. తన కష్టాన్ని నమ్ముకున్నవాడు ఎవరి కోసమూ ఎదురు చూడడు'' అంది పిచ్చుకల తల్లి.

> **"తొందరేం లేదు. రేపు మన రైతు కోతలు మొదలవ్వవు" అంది పిచ్చుకల తల్లి నమ్మకంగా. అన్నట్లే మర్నాడు కోతలు మొదలవ్వలేదు. పిచ్చుకలు ఆశ్చర్యపోయాయి.**

**ఆమె చుట్టూ బాలల వికసిత వదనాలు.
అప్పుడే విచ్చుకున్న పువ్వుల్లాంటి
ఆ ముఖాలను చూస్తుంటే
ఆమెకి మరో ప్రపంచమే తెలియదు.
ఎందుకంటే అది ఆమె సృష్టించుకున్న ప్రపంచం!
'బాల్యానికి కష్టాలు ఉండకూడదు.
బాల్యం ఒత్తిడులకు లోను కాకూడదు.
బాల్యం చిదిమిన మొగ్గ అవకూడదు...'
అనుకున్నారు ఆమె.
ఆమె పేరు.. జెట్‌సన్ పెమా.
అందరూ పిలుచుకునే పేరు.. 'అమా'.
అమా అంటే అమ్మ. దలైలామాకు సొంత చెల్లి!**

జన్మభూమి అని చెప్పుకోడానికి ఓ దేశం అంటూ లేకుండా కాందిశీకుల్లా వచ్చి, ఆశ్రయం ఇచ్చిన పొరుగు దేశంలో తలదాచుకుని బతుకు వెళ్లబారుస్తున్నామనే ఆవేదన ఓ వైపు.. దేశాల మధ్య ఆధిపత్య పోరులో పిల్లలు నలిగిపోకూడదనే బాధ్యత మరోవైపు... ఈ రెండే జెట్‌సన్ పెమా జీవితాన్ని నడిపిస్తున్నాయి. 52 వేల మంది పిల్లలు, వారి భవిష్యత్తు కోసం స్థాపించిన విద్యాసంస్థలతో కాందిశీకులకు అండగా నిలుస్తున్నారు 'అమా లా'. అమా లా అంటే టిబెట్ భాషలో 'టిబెట్ దేశమాత' అని. 77 ఏళ్ల జెట్‌సన్ పెమాను మనదేశం ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా సత్కరించింది. మహిళలకు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'నారీశక్తి'ని ప్రదానం చేసి గౌరవించింది.

చైనా ఆక్రమణతో చెల్లాచెదురు

జెట్‌సన్ పెమా 1940, జూలై ఏడవ తేదీన టిబెట్‌లోని లాసాలో పుట్టారు. నలుగురు పిల్లల్లో చిన్నది. ఆమె పెద్దన్న టెన్‌జిన్ గ్యాస్తో. అతడే ప్రస్తుత 14వ దలైలామా. టిబెట్‌ను చైనా ఆక్రమించుకున్నప్పుడు సంభవించిన అభద్రతల కారణంగా టిబెట్ వాసులు భారీ సంఖ్యలో దేశం వదిలి పారిపోయారు. వేలాది టిబెటన్‌లు ఇండియాకి వచ్చేశారు. అలా వచ్చిన వారిలో పెమా కుటుంబం కూడా ఉంది. మొదట కాలింపాంగ్ లోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్, ఆ తర్వాత డార్జిలింగ్‌లోని లోరెటో కాన్వెంట్‌లో చదువుకున్నారు పెమా. ఉన్నత చదువుల కోసం 1960లో కేంబ్రిడ్జికి వెళ్లారు. ఇంగ్లండ్, స్విట్జర్లాండ్‌లలో చదువు పూర్తయిన తర్వాత 1964లో తిరిగి ఇండియాకి వచ్చేశారు.

అమ్మలా అక్కున చేర్చుకున్నారు

అప్పటికి ఆమె పెద్దక్క త్సేర్రింగ్ దోల్మా టాక్లా జబ్బు పడ్డారు. దోల్మాను చూసుకోవడంతోపాటు దోల్మా సంరక్షణలో ఉన్న టిబెట్ అనాథ పిల్లల బాధ్యత కూడా పెమా తీసుకున్నారు. తమ ఆశ్రయంలో ఉన్న పిల్లలతోపాటు, దారీతెన్నూ లేకుండా పుట్టకొకరు చెట్టుకొకరుగా మిగిలిపోయిన వేలాది చిన్నారులను చేరదీశారామె. కాందిశీకులుగా వచ్చి అనాథలుగా మారిన పిల్లలను అమ్మలా అక్కున చేర్చుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాల వేదికగా వారికి ఒక నీడనిచ్చి, అన్నం పెట్టారామె. కానీ అది మాత్రమే సరిపోదని ఆమె అనుకున్నారు.



బాలలతో పెమా

టిబెట్‌ను వదిలేయడమేనా?!

పిల్లలు, మహిళలు, వృద్ధులు... ఒక్కమాటలో చెప్పాలంటే నిరాశ్రయులందరికీ ఆశ్రయం కల్పించారు జెట్‌సన్ పెమా. భారత దేశం తల్లిలా ఆదుకుంటే, ఆ దేశంలో తమ వాళ్ల కోసం తన ఒడిని విశాలం చేసింది పెమా. మరి తాము కోల్పోయిన టిబెట్‌ను అలా వదిలేసుకోవడమేనా? ఆమెలో ఆవేదన రగులుతూనే ఉండేది. దలైలామా ఆదేశంతో వాస్తవాల అన్వేషణ కోసం విస్తృతంగా ఆమె పర్యటించారు. ప్రవాసంలో ఉన్న టిబెట్ వాసుల కోసం ఏర్పాటైన మంత్రివర్గంలో కూడా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. టిబెట్ పరిపాలనలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ కూడా పెమానే.

యునెస్కో పురస్కారం

అమా జెట్‌సన్ ప్రతిపాదించిన 'టిబెటన్ చిల్డ్రన్స్ విలేజ్' ఆలోచన వినూత్నమైంది. ఆ ప్రతిపాదనకు భారత ప్రభుత్వం నుంచి అనుమతి పొందడంలోనూ ఆమె విజయం సాధించారు. ఆ తర్వాత వాటి స్థాపనలో నిమగ్నమయ్యారు. భారత ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆమె టిబెట్ పిల్లల పునరావాసాన్ని ఒక యజ్ఞంలా చేశారు. ఆ సేవలను గుర్తించిన యునెస్కో 1999లో ఆమెను అవార్డుతో గౌరవించింది.

పిల్లల కోసం ప్రత్యేక గ్రామాలు!

కాందిశీకులుగా మారిన చిన్నారుల కోసం బడి పెట్టించారు పెమా. మొదట్లో ఇది తాత్కాలిక అవసరమనే అనుకున్నారు. ఆశ్రయం కల్పించి, ఆరేడేళ్లు వచ్చిన పిల్లల్ని సమీపంలోని పాఠశాలల్లో చదివించేవారు. అయితే టిబెట్ నుంచి వలసల ప్రవాహం తగ్గలేదు కదా ఇంకా పెరుగుతూనే ఉంది. అప్పుడు భారత ప్రభుత్వాన్ని సంప్రదించి హిమాలయ పర్వత శ్రేణులలో ఆమె 'టిబెటన్ చిల్డ్రన్స్ విలేజెస్' పేరుతో స్కూళ్లను స్థాపించారు. ఆ స్కూళ్లలో టిబెట్ పిల్లలు, హిందూ, క్రైస్తవ క్యాథలిక్, ప్రొటెస్టెంట్ పిల్లలు కూడా చదువుకుంటున్నారిప్పుడు. జెట్‌సన్ పెమా చదువు పూర్తి చేసుకుని ఇండియాకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 52 వేల మంది ఏ దారీతెన్నూ లేని పిల్లలను గ్రాడ్యుయేట్లను చేశారు. మొత్తం పది రెసిడెన్షియల్ స్కూళ్లు, 17 డే స్కూళ్లు, మూడు వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లు, నాలుగు కాలేజీలు, మూడు హాస్టళ్లను స్థాపించారు.

మహిళల్నీ, వృద్ధుల్నీ చేరదీశారు

పిల్లల సంరక్షణకు ఒక చక్కటి దారి పడింది. చదువుకుని బయటకు వచ్చిన పిల్లలు ఉద్యోగాలలో స్థిరపడే వరకు ఒక ఆశ్రయం కావాలి. అందుకోసం యూత్ హాస్టల్స్ ఏర్పాటు చేశారు జెట్‌సన్ పెమా. ఇక భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరాలలో తలదాచుకున్న మహిళలు, వృద్ధులకు ఒక దారి చూపించాలి. అందుకోసం ఆశ్రమాలు నెలకొల్పారు. టిబెట్ నుంచి భారత్‌కు వచ్చిన మహిళలు, వృద్ధులు ఆ ఆశ్రమాలలో తలదాచుకుంటున్నారు. అందుకే వీరంతా జెట్‌సన్ పెమాను 'మదర్ ఆఫ్ టిబెట్'గా అంతా అభిమానిస్తున్నారు.

- మంజీర

గుడ్ ఫుడ్ / గుడ్ డ్రింక్

శ్రీరామ నవమి ప్రసాదం... స్వీకరిద్దాం రారండి!

శ్రీరామ నవమి నాడు పానకం ప్రసాదంగా స్వీకరించడం మన సంప్రదాయం. కేవలం ఒక ప్రసాదంగా మాత్రమే కాదు... అందులోనూ ఎన్నో పోషకాలూ, ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి.

బెల్లం

● జీర్ణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఆహారం బాగా జీర్ణమయ్యేలా తోడ్పడుతుంది బెల్లం. జీర్ణ వ్యవస్థ మీద, పేగుల మీద భారాన్ని తొలగిస్తుంది ● బెల్లం శ్వాసకోశ వ్యవస్థనూ, జీర్ణ వ్యవస్థను శుభ్రం చేస్తుంది ● బెల్లంలో పీచు ఎక్కువ. అందుకే ఇది మలబద్ధకాన్ని నివారిస్తుంది. అంతేకాదు... ఈ పీచుపదార్థాలే బెల్లాన్ని మంచి క్లెన్సర్‌గా పనిచేసేలా చేస్తాయని ప్రతీతి. క్లెన్సర్‌గా ఇది కాలేయాన్ని సైతం శుభ్రపరుస్తుంది ● బెల్లంలో ఖనిజాలు, లవణాలు చాలా ఎక్కువ. మరీ ముఖ్యంగా ఐరన్ ఎక్కువ ● బెల్లంతో చేసిన పదార్థాలు తినడం వల్ల అవి ఒంట్లోని ఫ్రీరాడికల్స్‌ను హరిస్తాయి. ఫలితంగా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది ● కీళ్ల నొప్పులు ఉన్నవారి బాధలకు బెల్లం కాస్త ఉపశమనం కలిగిస్తుంది.

మిరియాల్లో...

● మిరియాలలోని పైపరిన్ అనే పోషకం మెదడులోని కణాలను ఉత్తేజపరుస్తుంది. అందువల్ల మెదడు చురుగ్గా ఉండటంతో పాటు మతిమరుపు, అల్జైమర్స్ లాంటి అనేక సమస్యలు నివారితమౌతాయి ● మన శరీరంలోని ఫ్రీరాడికల్స్‌ను మిరియాలు సమర్థంగా అరికట్టి ఎన్నో రకాల క్యాన్సర్ల నివారణకు సమర్థంగా తోడ్పడతాయి, మలబద్ధకాన్ని, డయేరియాను సైతం నివారిస్తాయి ● జలుబు, దగ్గులకు తొలి చిట్కా మిరియాలే ● ఛాతీ పట్టేసినట్లు ఉన్నా, ఊపిరితిత్తుల్లో శ్వాస తీసుకోవడం కష్టమైనా మిరియాలు ఆ సమస్యను తక్షణం ఉపశమింపజేస్తాయి. సైనసైటిస్ సమస్యకు మిరియాలు మంచి ఉపశమనం.

యాలకులు... శ్రీరామ నవమి వేసవిలో వచ్చే పండుగ. ఈకాలంలో ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరని గుణాన్ని నివారించడానికి తోడ్పడేవి యాలకులు. శ్రీరామ నవమి పానకానికి మంచి రుచి, సువాసనను ఇస్తాయవి. వాటితోనూ కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. ఈ సుగంధద్రవ్యం వల్ల కలిగే ప్రయోజనాలలో కొన్ని...

● ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ క్యాన్సర్లతోపాటు గుండెజబ్బులనూ నివారిస్తాయి ● దేహంలో ఎక్కడ ఇన్ఫెక్షన్ లేదా ఇన్‌ఫ్లమేషన్ ఉన్నా యాలకులు నివారిస్తాయి ● యాలకుల్లో మూడ్‌ను బాగుండేలా చేసే లక్షణంతో పాటు డిప్రెషన్‌ను దూరం చేసే గుణం ఉంది ● నోటి పరిశుభ్రతనూ, ఆరోగ్యాన్ని (ఓరల్ హైజీన్)ను కాపాడతాయి.

ఇక నవమి ప్రసాదంలోని వడపప్పులో...

పెసర్లలో ఆరోగ్యానికి మేలు చేసే గుణాలివి...

● పెసర్లలో పీచు పాళ్లు ఎక్కువ. అందుకే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఇవి ఎంతగానో మేలుచేస్తాయి. మలబద్ధకాన్ని నివారించి, జీర్ణశక్తిని మెరుగుపరుస్తాయి ● ఒంట్లోని కొవ్వులు, కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుతాయి ● పొటాషియమ్ పాళ్లు ఎక్కువ. అందుకే హైబీపీని తగ్గించేందుకు ఇవి బాగా ఉపయోగపడతాయి ● పెసర్లలో ఐరన్ పుష్కలం. రక్తహీనతను తగ్గించడానికి అవి తోడ్పడతాయి.

కొబ్బరిలో...

వడపప్పులో చిన్నచిన్న కొబ్బరి ముక్కలు, కొబ్బరి కోరు వేస్తారు. దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్ని...

● కొబ్బరిలో 61 శాతం డయటరీ ఫైబర్ ఉంటుంది. కాబట్టి అది ఒంట్లోకి విడుదల అయ్యే చక్కెరను చాలా నెమ్మదిగా అయ్యేలా చూస్తుంది ● కొబ్బరిలోని సైటోకైనిన్స్, కైనెటిన్, ట్రాన్స్ జీటిన్ అనే అంశాలు వయసును తగ్గిస్తాయి. కొబ్బరి తినేవారు దీర్ఘకాలం యౌవనంతో ఉంటారు ● కొబ్బరిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే కొబ్బరి తినేవారిలో వైరల్, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లను తట్టుకునే శక్తి బాగా పెరుగుతుంది. అంతే కాదు... ఆహారంలో కొబ్బరిని ఎక్కువగా వాడేవారికి గొంతు ఇన్ఫెక్షన్లు, బ్రాంకైటిస్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు ఒక పట్టాన రావు ● కొబ్బరిలో కొవ్వుల పాళ్లు ఎక్కువ అన్న సంగతి తెలిసిందే. కొబ్బరి తిన్నప్పుడు ఆ కొవ్వుల కారణంగా ఆకలి అంతగా అనిపించదు. అందుకే కొబ్బరి తినేవారిలో ఆకలి కాస్త తగ్గడం వల్ల తినే కోరిక కూడా తగ్గుతుంది. అందుకే బరువు తగ్గాలనుకునే వారు ఆరోగ్యవంతమైన బరువు తగ్గే సాధనంగా కొబ్బరిని ఎంచుకొని, దాని వాడకం పెంచుకోవడం మంచిదనేది ఒబేసిటీని తగ్గించే నిపుణులు చెబుతున్న మాట.

మన సంప్రదాయంలో స్వాభావికంగానే ఆరోగ్యాన్ని కాపాడే మంచి లక్షణాలు ఉన్నాయి. శ్రీరామనవమి నాటి వడపప్పులో, పానకంలో కూడా. అందుకే నవమి నాటి ప్రసాదాలను స్వీకరిస్తే... దైవ కృపకు కృప... ఆరోగ్యానికి ఆరోగ్యం.



లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను రెండేళ్లుగా ఒక అబ్బాయితో లవ్‌లో ఉన్నాను. ఇద్దరం చాలా హ్యాపీగా ఉండేవాళ్లం. కానీ సడన్‌గా మా లైఫ్‌లోకి మరో వ్యక్తి వచ్చాడు. వాడు నన్ను లవ్ చేస్తున్నాడట. నేను లవ్‌లో ఉన్నాననే విషయం తెలుసుకొని, నేను లవ్ చేస్తున్న అబ్బాయిని కలిసి, చంపేస్తానని బెదిరించాడట. దాంతో నా లవర్ ఇప్పుడు నాతో మాట్లాడటంలేదు. నేను ఈ బాధని భరించలేకపోతున్నా. ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నా. చాలా సిన్సియర్ లవ్ సార్ మాది. మీరే మంచి సలహా ఇవ్వండి ప్లీజ్.

– దివ్య

గూండా రాజ్యంలో ప్రేమ పూలు వికసించవు. పూలేంటి.. ప్రేమ మొగ్గలు తొడగనైనా తొడగవు. ప్రేమ ఆకు చిగురించదు. ప్రేమ మొక్క ఎదగదు.

'సార్... ఈ బోటనీ క్లాస్ ఏంటి సార్???
దివ్య అడిగింది ఏంటి...???
మీరు ఫ్లోలో ఏదో పీకడమేంటి సార్???
పాపం దివ్య, ఇంకా భయపడుతుందేమో సార్???'

వాడెవడో గూండాగాడు... ''నేను ప్రేమిస్తున్న, నీ తాట తీస్తా''నంటే... మన లవర్ తోక ముడుచుకొని పారిపోయాడు. అమ్మాయి ముడుచుకుపోయి బాధపడుతోంది. ప్రేమ పరిమళం... పరవశంతో నాట్యం చేయాల్సిన సమయంలో విచ్చుకోక, తొడగనే తొడగక, ముడుచుకుపోతే.... పొయెట్రీ రాయక ఆన్సర్ రాస్తానా నీలాంబరీ!!!???!

'ప్చ్...! ఒక్క ముక్క అర్థం కాలేదు సార్....!'
గూండాలకు గుండు కొట్టించేది ఎవరు?
'పోలీస్...! పోలీస్..... సార్!'
మరి వాళ్లకు రాయాల్సిన ఉత్తరం నాకు రాస్తే పొయెట్రీ కాక ప్రోజ్ రాస్తానా నీలూ????

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

ఖానుకో సుడోకు

	9			2				
		2			6	8	5	7
		7	4	8		1		
4	5				1	6	3	
3	7	6				5	2	1
	2	1	5				7	4
		4		1	2	3		
7	1	5	3			2		
				5			1	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	1	7	5	8	3	2	4	9
9	5	2	4	6	1	3	7	8
4	3	8	7	9	2	6	5	1
1	7	6	2	5	4	9	8	3
8	4	3	1	7	9	5	2	6
5	2	9	8	3	6	4	1	7
7	6	1	9	4	5	8	3	2
3	8	5	6	2	7	1	9	4
2	9	4	3	1	8	7	6	5

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



సీతారాముల కల్యాణము చూతము రారండి
శ్రీసీతారాము కల్యాణము చూతము రారండి

చరణం: 1
సిరికల్యాణపు బొట్టును పెట్టి బొట్టును బెట్టి బొట్టునె బెట్టి
మణిబాసికమును నుదుటను కట్టి నుదుటను కట్టి
పారాణిని పాదాలకు పెట్టి ఆ...ఆ...ఆ..
పారాణిని పాదాలకు పెట్టి
పెళ్లికూతురై వెలసిన సీతా కల్యాణము చూతము రారండి
శ్రీసీతారాముల కల్యాణము చూతము రారండి

చరణం: 2
సంపగినూనెను కురులను దువ్వి కురులను దువ్వి
సొంపుగ కస్తూరి నామము తీర్చి నామము తీర్చి
చెంప జవ్వాజి చుక్కను బెట్టి ఆ...ఆ...
చెంప జవాక్వజి చుక్కను బెట్టి
పెళ్లి కొడుకై వెలసిన రాముని కల్యాణము చూతము రారండి
శ్రీసీతారాముల కల్యాణము చూతము రారండి

జానకి దోసిట కెంపులప్రోవై కెంపుల ప్రోవై
రాముని దోసిట నీలపురాశై నీలపురాశై
ఆణిముత్యములు తలంబ్రాలుగా ఆ... ఆ...
ఆణిముత్యములు తలంబ్రాలుగా
శిరముల మెరసిన సీతారాముల కల్యాణము చూతము రారండీ
శ్రీసీతారాము కల్యాణము చూతము రారండీ

చిత్రం: సీతారామ కల్యాణం
రచన: సముద్రాల సీనియర్
సంగీతం: గాలిపెంచల నరసింహారావు
గానం: పి. సుశీల, బృందం

కట్‌చేయ్...దాచేయ్...

నినదిస్తా నిత్యం జనహితం




మహేశ్‌బాబు

''పాలించే ప్రభువును కానని, సేవించే బంటును నేనని.. అధికారం అర్థం ఇదని తెలిసేలా.. చేస్తా నా పని'' అని ప్రజాప్రతినిధిగా హామీ ఇస్తున్నాడు భరత్ రామ్. అట్టడుగున నలిగే కలలకి బలమివ్వని పదవులు దేనికి అని ప్రశ్నిస్తున్నాడు. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. ఇందులో కియారా అద్వాని కథానాయిక. సీయం భరత్ రామ్ పాత్రలో మహేశ్‌బాబు నటిస్తున్నారు. నెక్ట్స్ షెడ్యూల్ కోసం ఫారిన్ వెళ్లనుంది చిత్రబృందం. ఈ చిత్రంలోని ఫస్ట్ సాంగ్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. ''విరచిస్తా నేడే నవశకం, నినదిస్తా నిత్యం జనహితం.. దిస్ ఈజ్ మీ'' అంటూ సాగే ఈ సాంగ్ శ్రోతలను ఆకట్టుకునేలా ఉంది. ''ఆల్రెడీ రిలీజ్ చేసిన చిత్రం ఫస్ట్ లుక్, ఫస్ట్ ఓత్ అండ్ విజన్ ఆఫ్ భరత్‌కు మంచి స్పందన లభించింది. ఆదివారం రిలీజ్ చేసిన ఫస్ట్ సాంగ్‌కు ఆడియన్స్ రెస్పాన్స్ సూపర్. రామజోగయ్యశాస్త్రి రాసిన అద్భుతమైన సాహిత్యానికి దేవిశ్రీ ప్రసాద్ వీనుల విందైన సంగీతం తోడైంది. డేవిడ్ సిమన్ అంతే అద్భుతంగా పాడారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఏప్రిల్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

సమ్మర్‌లోనే టిక్కెట్టు


'సోగ్గాడే చిన్నినాయనా, రారండోయ్.. వేడుక చూద్దాం' వంటి కుటుంబ కథా చిత్రాలతో మంచి విజయాలు అందుకోవడంతో పాటు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు కల్యాణ్ కృష్ణ. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'నేల టిక్కెట్టు'. రవితేజ హీరోగా



రవితేజ

తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయిక. తెలుగులో ఆమెకు ఇదే తొలి సినిమా. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమాని మే 24న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా రామ్ తాళ్లూరి మాట్లాడుతూ– ''సకుటుంబ సపరివార సమేతంగా చూసేలా తెరకెక్కుతోన్న చిత్రమిది. రవితేజ ఎనర్జీ లెవల్స్‌కి తగ్గట్టుగా ఉంటూనే, కల్యాణ్ కృష్ణ శైలిలో ఉంటుంది. దాదాపు 80% షూటింగ్ పూర్తయింది. మరో మూడు పాటలు చిత్రీకరించాల్సి ఉంది. వేసవికి సినిమా విడుదల చేయనున్నాం. 'ఫిదా' ఫేమ్ శక్తికాంత్ చక్కటి సంగీతం అందించారు'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్, సమర్పణ: సాయిరిషిక.

వీ2 ఇన్ ఎఫ్2



వెంకటేశ్



వరుణ్‌తేజ్

వీ స్క్వేర్ ప్లస్ వీటీ బికమ్స్ వీ2. ఈక్వల్ టు ఎఫ్2. ఫైనల్లీ వీ2 ఇన్ ఎఫ్2. ఫార్ములా ఫన్‌గా ఉంది కదూ. సేమ్ టైమ్ కన్‌ఫ్యూజ్డ్‌గా కూడా ఉంది కదూ. డిఫికల్ట్‌గా ఉన్న ఈ ఫన్ ఫార్ములా సాల్వ్ చేయడం ఈజీ. విక్టరీ వెంకటేశ్ (వీవీ) ఈజ్ వీ స్క్వేర్. వీటీ ఈజ్ వరుణ్ తేజ్. ఈ ఇద్దరూ కలిసి చేయబోతున్న సినిమా 'ఎఫ్2'. అదే 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మిస్తున్న మల్టీస్టారర్ మూవీకి 'ఎఫ్2' అనే టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా టైటిల్ లోగోను రిలీజ్ చేశారు. ''వెంకటేశ్‌గారు, 'దిల్' రాజుగారు, అనిల్ రావిపూడిలతో సూపర్ ఫన్ ఫిల్మ్ చేయబోతున్నందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది'' అన్నారు వరుణ్ తేజ్. ''వెంకటేశ్‌గారు, సూపర్ కూల్ వరుణ్ తేజ్ హీరోలుగా నా దర్శకత్వంలో 'దిల్' రాజుగారి బ్యానర్‌లో సినిమా రానుండటం ఆనందంగా ఉంది'' అన్నారు అనిల్ రావిపూడి. ''చక్కటి కుటుంబ కథా చిత్రమిది. జూలైలో షూటింగ్ స్టార్ట్ అవుతుంది'' అన్నాయి చిత్రవర్గాలు.

నిర్మాతలకు దండం పెట్టాలనిపించింది

- తమ్మారెడ్డి భరద్వాజ



తమ్మారెడ్డి భరద్వాజ, శ్రీవిష్ణు, నారా రోహిత్, వేణు ఊడుగుల, దేవిప్రసాద్

''నీదీ నాదీ ఒకే కథ' టైటిల్ విని ఈరోజుల్లో ఇటువంటి సినిమాలు ఎవరు చూస్తారులే అనుకున్నా. రివ్యూస్ చూశాక సినిమా చూడాలనిపించింది. ఈ సినిమా చూశాక నా మైండ్ బ్లాంక్ అయ్యింది. ఇంత మంచి సినిమా నిర్మించిన నిర్మాతలకు దండం పెట్టాలనిపించింది'' అని దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. శ్రీ విష్ణు, సాట్నా టైటస్ జంటగా వేణు ఊడుగుల దర్శకత్వంలో ప్రశాంతి, కృష్ణ విజయ్ నిర్మించిన 'నీదీ నాదీ ఒకే కథ' సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. చిత్ర సమర్పకుడు నారా రోహిత్ మాట్లాడుతూ– ''మా ఆరాన్ మీడియా వర్క్స్ బేనర్‌లో కొత్తదనం ఉన్న కథలతో మరిన్ని సినిమాలు వస్తాయి. ఈరోజుల్లో ఇలాంటి సినిమాలు ఎవరు చూస్తారు? అని చెప్పారు. అయినా నా డబ్బు, నా ఇష్టం. నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాను. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు. ''నా సినిమాలకు వేణు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఇలాంటి కొత్త కాన్సెప్ట్ సినిమాలు చేయడానికి నాలాంటి దర్శకులందరికీ కొత్త ఉత్సాహాన్ని కలిగించిన చిత్రమిది'' అన్నారు దర్శకుడు మదన్. ''సినిమా చూస్తున్నంతసేపు నాకు దర్శకుడు వేణు, శ్రీవిష్ణులే కన్పించారు'' అన్నారు దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి. ''సినిమా చూస్తున్నంత సేపు నాకు బాలచందర్‌గారే గుర్తుకొచ్చారు'' అని దర్శకుడు వీఎన్ ఆదిత్య అన్నారు. ''ఈ సినిమా చేయకపోయుంటే జీవితంలో ఒక గొప్ప గౌరవాన్ని మిస్ అయ్యేవాణ్ణి'' అన్నారు దేవిప్రసాద్. ''ప్రతి ఒక్కరూ ఇది నా కథ, మా ఇంట్లో జరిగిన కథ అని ఓన్ చేసుకుంటున్నారు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు శ్రీవిష్ణు. ''రివ్యూస్ బాగున్నాయి. కొన్ని విమర్శలూ ఉన్నాయి. అవన్నీ సరిదిద్దుకొని తర్వాత ఓ మంచి సినిమా తీయడానికి కృషి చేస్తా'' అన్నారు వేణు ఊడుగుల. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, కెమెరామెన్ రాజ్ తోట, ఎడిటర్ బొంతల నాగేశ్వరరెడ్డి, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ అధినేత నారాయణరావు, నిర్మాతలు రాజ్ కందుకూరి, బెక్కం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా కోసం ఏరా.. పోరా అని తిట్టుకున్నాం - నితిన్



నితిన్, మేఘా ఆకాశ్

''16ఏళ్ల నా సినీ కెరీర్‌లో 25వ సినిమా 'ఛల్ మోహన్‌రంగ'. నా చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. 'తొలిప్రేమ' సినిమా చూసిన తర్వాతే హీరో అవ్వాలనుకున్నా'' అని నితిన్ అన్నారు. నితిన్, మేఘా ఆకాశ్ జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఛల్ మోహన్‌రంగ'. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ట్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకకు హీరో పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నితిన్ మాట్లాడుతూ– ''నాకు నటన రాకున్నా నేర్పి, తొలి సినిమా (జయం)కు అవకాశం ఇచ్చిన నా గురువు తేజగారికి థ్యాంక్స్. నేను సినిమాల్లోకి వెళతానంటే నా తల్లి తండ్రులు వద్దనకుండా ప్రోత్సహించారు. నేను సినిమాలకు తప్ప వేరే దేనికీ పనికిరానని వారు ముందుగానే అనుకున్నారేమో(నవ్వుతూ). దర్శకుడు చైతన్య నాకు చాలా ఏళ్ల నుంచి మంచి ఫ్రెండ్. సినిమా కోసం ఏరా.. పోరా అని తిట్టుకున్నాం. ఈ చిత్రం తనకి మంచి హిట్ ఇవ్వాలి. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. నా కెరీర్‌లో 'ఛల్ మోహన్‌రంగ' 25వ సినిమా అని ప్రత్యేకమైంది కాదు. ఈ సినిమాని పవన్‌గారు, త్రివిక్రమ్‌గారు, మా నాన్నగారు నిర్మించడమే ప్రత్యేకం. నా లైఫ్‌లో ఇష్టమైన వ్యక్తుల్లో ఈ ముగ్గురే ఉంటారు'' అన్నారు. ''నా బలం నితిన్. తనతో సినిమా చేయాలని బలంగా కోరుకున్నా.. కుదిరింది. తమన్‌గారికి నేను ఓ 50 పాటలు రాసి ఉంటా. ఈ చిత్రానికి చక్కని సంగీతం అందించారాయన'' అన్నారు కృష్ణచైతన్య. ''కృష్ణచైతన్య చక్కగా తెరకెక్కించారు. సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. నితిన్‌తో నాకు తొలి సినిమా. కచ్చితంగా హిట్ అవుతుంది'' అన్నారు తమన్. సుధాకర్‌రెడ్డి, సమర్పకురాలు నిఖితా రెడ్డి, కెమెరామెన్ ఎం. నటరాజ సుబ్రమణియన్, నిర్మాతలు బీవీఎస్ఎన్ ప్రసాద్, 'దిల్' రాజు, కిరణ్, కె.ఎల్. దామోదర ప్రసాద్, కె.కె. రాధామోహన్, మేఘా ఆకాశ్, నటి లిజీ తదితరులు పాల్గొన్నారు.

అనుష్క 1... ప్రియాంక 2



అనుష్కాశర్మ, ప్రియాంకచోప్రా

రేసింగ్‌లో ఫస్ట్ ప్లేస్ కొట్టేశారు బాలీవుడ్ బ్యూటీ అనుష్కా శర్మ. ఇదేదో కార్, బైక్ రేసింగ్ కాదు. ఆన్‌లైన్ రేసింగ్. ఓ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ జరిపిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ప్రింట్ పబ్లికేషన్స్, వైరల్ న్యూస్ ఆన్ సోషల్ మీడియా, బ్రాడ్‌కాస్ట్ అండ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ఆధారంగా దేశంలోని 14 భాషలను ఆధారంగా చేసుకుని ఈ ర్యాంకింగ్‌ను కేటాయించినట్లు సంబంధిత సర్వే ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సర్వేలో అనుష్కా శర్మ 71.90 మార్కులతో ఫస్ట్ ప్లేస్ సంపాదించారు. తర్వాత ప్రియాంకా చోప్రా, దీపికా పదుకోన్, కంగనా రనౌత్ వరుసగా సెకండ్, థర్డ్ అండ్ ఫోర్త్ ప్లేస్‌లలో నిలిచారు. ''కచ్చితమైన కొలమానాల ఆధారంగా సర్వే నిర్వహించాం. మా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన సాఫ్ట్‌వేర్ అల్‌గారిథమ్స్ ఇంత పెద్ద సోషల్ మీడియా, ఇతర డేటాను విశ్లేషించడంలో ఉపయోగపడ్డాయి'' అని సర్వే ప్రతినిధి పేర్కొన్నారు. ఇక.. సన్నీ లియోన్, సోనమ్ కపూర్, శ్రద్ధా కపూర్, విద్యాబాలన్, తాప్సీ పన్ను, మాధురి దీక్షిత్ టాప్ టెన్‌లో నిలిచారు.

సంతలో ప్రేమ



సూర్య, శ్రావ్యారావు

సూర్య భరత్‌చంద్ర, శ్రావ్యారావు జంటగా రూపొందుతోన్న చిత్రం 'సంత'. 'మట్టి మనుషుల ప్రేమకథ' అన్నది ట్యాగ్‌లైన్. నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకత్వంలో శ్రీ జైవర్ధన్ బోయినేపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుపుకుంటోంది. ప్రవీణ్ చందర్ మాట్లాడుతూ– ''ఓ సంత నేపథ్యంలో జరిగే ప్రేమకథా చిత్రమిది. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైన్మెంట్. ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయింది. మిగిలిన టాకీ పార్ట్, పాటలను హైదరాబాద్, వరంగల్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నాం. ఈ షెడ్యూల్‌తో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఫణీంద్ర వర్మ అల్లూరి, కథ– కథనం– సంగీతం– దర్శకత్వం: నెల్లుట్ల ప్రవీణ్ చందర్.

పరి పరిశోధన


బ్యాగ్ భుజాన వేసుకుంటే బల్బు వెలుగుతుంది...

భుజాన బ్యాగ్ వేసుకుని వెళుతూంటే కాసేపట్లో చెమట్లు పట్టడం ఖాయం. ఇది కాస్తా మనల్ని చీకాకు పెడుతుంది గానీ.. ఛాల్మర్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన సరికొత్త ఎలక్ట్రిక్ వస్త్రం మాత్రం చెమటతోపాటు కొంత కరెంటూ పుట్టిస్తుంది. బరువు ఎంత ఎక్కువైతే స్వేదంతోపాటు విద్యుత్తు కూడా ఎక్కువ అవుతుందన్నమాట. ఇంకోలా చెప్పాలంటే ఒత్తిడి ఎక్కువైనా... ఎక్కువగా లాగినాసరే... ఈ వస్త్రంతో విద్యుత్తు పుడుతుందన్నమాట. ప్రస్తుతానికైతే బ్యాగ్‌ను భుజానికి తగిలించుకునే స్ట్రాప్‌లో కొంతభాగంలో మాత్రమే ఈ వస్త్రాన్ని వాడారు. దీంతో ఒక ఎల్ఈడీ బల్బును వెలిగించేంత కరెంటు మాత్రమే పుడుతోందనీ, ఇది డిజిటల్ వాచీలూ, పాకెట్ కాలిక్యులేటర్, వంటి చిన్న చిన్న గాడ్జెట్లను నడిపేందుకు సరిపోతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త అంజా తెలిపారు. పీజోఎలక్ట్రిక్ ఎఫెక్ట్ అనే భౌతిక శాస్త్ర ధర్మం ఆధారంగా ఈ వస్త్రం పనిచేస్తుందని ఇందులోని పదార్థం రూపురేఖలు మారినప్పుడల్లా విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని వివరించారు. విద్యుత్తును ప్రసారం చేయగల నూలుపోగులు, పీజో ఎలక్ట్రిక్ పదార్థాలను కలిపి దీన్ని తయారు చేసినట్లు తెలిపారు. మూడు కిలోల బరువును బ్యాగ్‌లో ఉంచినప్పుడు నాలుగు మైక్రోవాట్ల విద్యుత్తు పుట్టిందన్నీ... బ్యాగ్ మొత్తాన్ని పీజో ఎలక్ట్రిక్ పదార్థంతో తయారు చేస్తే వైర్‌లెస్ సిగ్నళ్లను ప్రసారం చేయగలిగేంత విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని అంజా తెలిపారు.



మూలకణాలతో మళ్లీ చూపు!

శరీరంలోని ఏ కణంగానైనా మారిపోగల సామర్థ్యం మూలకణాల సొంతం. బ్రిటిష్ వైద్యులు ఈ లక్షణం ఆధారంగా కండరాలు బలహీనమవడం వల్ల క్రమేపీ చూపు కోల్పోతున్న ఇద్దరు మళ్లీ చూడగలిగేలా చేశారు. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో ఐదేళ్లలోనే ఈ రకమైన చికిత్స ద్వారా వయసుతోపాటు వచ్చే దృష్టి లోపాలను సరిచేయగలమని శాస్త్రవేత్తలు అంటున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ కళ్లలోని కండరాలు బలహీన పడుతుంటాయి. ఈ క్రమంలో ఒక పొర కణాలు నాశనమవుతాయి. రెటీనల్ పిగ్మెంట్ ఎపిథీలియం అని పిలిచే ఈ పొర కళ్లను శుభ్రం చేసేందుకు, కంటి బయటి పొరకు పోషకాలను అందించేందుకూ ఉపయోగపడుతుంది. ఈ రకమైన సమస్యతో బాధపడుతున్న ఇద్దరికి బ్రిటిష్ వైద్యులు ఏడాది క్రితం శస్త్రచికిత్స చేసి మూలకణాలు ఎక్కించారు. ఆ తరువాత జరిపిన పరిశీలనల్లో ఈ మూలకణాలు అక్కడే పెరగడంతోపాటు రెటీనల్ పిగ్మెంట్ ఎపిథీలియం కణాలుగా ఎదిగినట్లు గుర్తించారు. రోగ నిరోధక వ్యవస్థ ఈ కొత్త కణాలను తిరస్కరించే అవకాశం ఉందా? లేదా? మూలకణాలు కాస్తా కేన్సర్ కణాలుగా మారతాయా? వంటి విషయాలను మరిన్ని పరిశోధనల ద్వారా రూఢి చేసుకున్న తరువాత ఈ పద్ధతిని అందరికీ అందుబాటులోకి తీసుకురావచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.



సెల్ఫ్ చెక్

మీపై మీకు విశ్వాసం ఉందా?

తమపై తాము నమ్మకాన్ని కోల్పోయినప్పుడు, భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది. జీవితం శూన్యంగా కనిపిస్తుంది. చిన్నచిన్న సమస్యలు పెద్దవిగా కనిపిస్తాయి. ఒత్తిడి, ఆందోళన మనిషికి విశ్రాంతి లేకుండా చేస్తాయి. అపనమ్మకం జీవితంపై ఆశావహదృక్పథం లేకుండా చేస్తుంది. ఇలా లైఫ్ నిస్సారంగా లేకుండా ఉండాలంటే మనపై మనం నమ్మకంతో ఉండాలి. విశ్వాసాన్ని రెట్టింపు చేసుకోవాలి. ప్రతిపనిని నమ్మకంతో చేయడానికి ప్రయత్నించాలి. మీ జీవితం ఎలా ఉంది? నమ్మకానికి మీకు ఎంత దూరం? అనుమానం మీ ఆనందాన్ని దూరంచేస్తోందా? విశ్వాస రాహిత్యం మీలోని ప్రతిభను అడ్డుకుంటోందా? మీపై మీకు విశ్వాసం ఉందా?

1. **ముందు నమ్మకానికి చోటిస్తారు. తర్వాతే ప్రశ్నించటానికి ప్రయత్నిస్తారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. **''ఎందుకు బాధపడాలి'' అని ప్రశ్నించుకుంటారు. బాధ పడటం వల్ల మేలేమీ ఉండదని గ్రహిస్తారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. **భవిష్యత్తు గురించి బెంగ పెట్టుకోరు. ప్రస్తుత పరిస్థితులకే ప్రాధాన్యం ఇస్తారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. **మీలో వున్న స్కిల్స్‌ను లిస్ట్‌గా రాసుకుంటారు. వాటిని వెలుగులోకి తేవటానికి ప్రయత్నిస్తారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. **ఎక్కువ ఆందోళనగా ఉన్నప్పుడు మీకు బాగా ధైర్యాన్నిచ్చే వ్యక్తితో మాట్లాడతారు లేదా మీ ఇష్టదైవాన్ని తలచుకుంటారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. **మీరు సాధించిన విజయాలను పదేపదే తలచుకొని మీకై మీరే స్ఫూర్తి పొందుతారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. **తమపై తమకు నమ్మకంలేని వారు ఎలా ఇబ్బందులు పడుతున్నారో, వారి భవిష్యత్ ఎలా ఉండబోతోందో ఊహిస్తారు. వారిలా మీరూ ఉండకూడదని దృఢనిశ్చయానికి వస్తారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. **ఏదైనా సాధించాలనుకున్నప్పుడు మీరెలా ఉంటారు? విచారంగా ఉన్నప్పుడు ఎలా ఉంటారు? ఈ రెండు విషయాలను పోల్చి చూసుకుంటారు. ఆ తేడాను గమనించి ఉత్సాహంగా ఉండటం నేర్చుకుంటారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. **ఉదయాన్నే నవ్వుతూ లేస్తారు. మంచి సంగీతాన్ని వింటానికి ప్రయత్నిస్తారు. విశ్వాసాన్ని నింపే పుస్తకాలు చదువుతారు. స్ఫూర్తిగొలిపే ఉపన్యాసాలు వింటారు.**
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. **మీరేదైనా అనుకుంటే చేసేస్తారు. ఫలితం గురించి బెంగపెట్టుకోరు. కాలయాపన చేయరు.**
    ఎ. అవును ☐ బి. కాదు ☐



'ఎ' సమాధానాలు ఏడు దాటితే మీపై మీకు నమ్మకం ఉంటుంది. ఎలాంటి పనినైనా చేయగలగమనే నమ్మకం మీలో పుష్కలంగా ఉంటుంది. దీనివల్ల ఎలాంటి ఆందోళన మీ దరిచేరదు. భవిష్యత్తు గురించి బెంగ పెట్టుకోకుండా సానుకూల దృక్పథంతో ముందు కెళతారు. ఇలాంటి మనస్తత్వం మీకుండటం నిజంగా అభినందనీయం. 'బి' లు ఆరుదాటితే మీపై మీకు నమ్మకం ఉండదు. ప్రతివిషయానికీ బెంగపడుతూ అభద్రతాభావంతో ఉంటారు. దీనివల్ల ప్రతిపనిలో మీకు అడ్డంకి కలుగుతుంది. మీపై మీకు నమ్మకం లేకపోతే జీవితం అంతా నిరాశ, నిస్పృహల మధ్య ఊగిసలాడుతుంది. 'ఎ'లను సూచనలుగా భావించి మీ విశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవచ్చో తెలుసుకోండి.



బయోగ్రఫీ రేమా రాజేశ్వరి

రేమా ధీమా

ఏ మనిషికైనా... తాను ఒక పని చేస్తున్నప్పుడు... అది ఇతరుల శ్రేయస్సు కోసమైతే ఒక ధీమా ఉంటుంది. అదే పని... తన సొంతానికైనప్పుడు తెలియని న్యూనత ఉంటుంది. రేమా చేస్తున్న పనులు సమాజహితం కోసం... అందుకే రేమా ఏ పనినైనా ఎంతో ధీమాగా చేయగలుగుతోంది.



రేమా రాజేశ్వరి ఎస్.పి.గా నేరాల దర్యాప్తు, వాటి పరిష్కారంతో సరిపెట్టుకోవడం లేదు, సమస్య మూలాలను తెగ నరుకుతోంది.

ఒక ఆలోచన జీవితాన్ని మార్చేస్తుంది, నిజమే. గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలనేది గొప్ప ఆలోచన. ఎంపీలంతా ఒక్కో గ్రామాన్ని తీసుకున్నారు. వాటి తీరు ఎలా ఉందనే నివేదిక ఇవ్వమంటే వెనకడుగు వేస్తారు. పోలీస్ దత్తత తీసుకున్న ఈ గ్రామం మాత్రం ధైర్యంగా ఛాతీ విరుచుకుని మరీ చూపించుకోగలిగినట్లు మారిపోయింది. ఇది పోలీస్ దత్తత గ్రామం అని గ్రామస్థులు గర్వంగా చెప్పుకుంటున్నారు. మా బడి పోలీస్ బడి అని చెప్పేటప్పుడు ఆ పిల్లల ముఖాలు వెలిగిపోతాయి. పెద్దయ్యాక పోలీస్ అవుతాం అంటారు 'చోటా భీమ్'ను అనుకరిస్తూ. ఇది మహబూబ్ నగర్ జిల్లా, అడ్డాకుల గ్రామంలోని గవర్నమెంట్ స్కూల్. కార్పొరేట్ స్కూల్‌ని తలపిస్తుంటుందా పాఠశాల. గోడలకు చోటాభీమ్, టామ్ అండ్ జెర్రీ వంటి కామిక్ స్టోరీల ఆయిల్ పెయింటింగ్స్, స్కూల్‌లో టాయిలెట్‌లు, వాటర్ సప్లయ్, కరెంట్, కంప్యూటర్ ఉన్నాయి. పోలీస్ బృందం టేకప్ చేసేనాటికి రాలిపోతున్న కప్పు, పెచ్చులూడిన గోడలతో ఉండేది. రిపేర్‌లు చేసి, రంగులు వేసి, ఫ్లోరింగ్ మార్చేసి, కొత్త గదులు కట్టించి మోడరన్ లుక్ తెచ్చేశారు. ఇదంతా ఎవరు చేశారంటే పిల్లల చూపులన్నీ అక్కడే ఫొటోలో ఉన్న ఎస్.పి. రేమా రాజేశ్వరి వైపు మరులుతాయి. అదేమాట ఆమెను అడిగితే... 'క్రెడిట్ మొత్తం మా టీమ్‌లోని సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కానిస్టేబుల్ బాలరాజులదే' అన్నారు నవ్వేస్తూ.



అమ్మమ్మ చెప్పిన కథలు... తాను చూసిన వాస్తవాలు!

రేమా రాజేశ్వరి పుట్టింది కేరళ రాష్ట్రం మున్నార్ జిల్లా ఇడుక్కిలో. పశ్చిమ కనుమల్లో విస్తరించిన టీ తోటల్లో ఆమె బాల్యం పచ్చదనం మధ్య అచ్చమైన స్వచ్ఛదనంతో గడిచింది. తండ్రి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో, తల్లి టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉన్నారు. వాళ్ల ఉద్యోగాలతో వాళ్లు బిజీగా ఉంటే రేమాను పెంచడంలో అమ్మమ్మ పార్వతి రోల్ కీలకమైంది. వేళకింత అన్నం పెట్టి, స్నానం చేయించి స్కూలుకి పంపి ఊరుకోలేదామె. రేమాలో భవిష్యత్తు మీద ఒక గురిని ఏర్పరిచింది. ఆమె చూసిన బ్రిటిష్ పాలకులను కథలుగా చెప్పేది. కలెక్టర్ వేసవిలో మున్నార్‌కు వచ్చినప్పుడు సిబ్బంది చేసే హడావిడిని కళ్లకు కట్టేది. 'నువ్వు కలెక్టర్ అవ్వాలి' అని పదే పదే చెప్పేది. అమ్మమ్మ చెప్పింది సరే... ఆ గమ్యాన్ని చేరాలనే తపన పిల్లల్లో ఉంటేనే సాధ్యమవుతుందన్నప్పుడు ఆమె... ''కేరళలో పిల్లలకు చదువుకోమని ఒకరు చెప్పాల్సిన పని ఉండదు. చదవడం తమ బాధ్యత అన్నట్లు ఉంటారు. స్కూలు పూర్తయ్యేలోపే ఏ కాలేజ్‌లో ఏకోర్సులో చేరాలనే ఆలోచనలతో ఉంటారు. పేరెంట్స్ వాళ్లను కొద్దిగా గైడ్ చేస్తే చాలు. నేను స్కూల్ కోసం రోజూ పదిహేను కిలోమీటర్ల దూరం నడిచేదాన్ని. గ్రాడ్యుయేషన్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ పోలీస్ మేనేజ్‌మెంట్‌లో పీజీతోపాటు సివిల్స్‌కి ప్రిపేరయ్యాను. ఐఏఎస్ రాలేదు. ఐపీఎస్ వచ్చింది. అమ్మమ్మ చెప్పిన కథలు ఒక కారణం అయితే, నేను చిన్నప్పటి నుంచి చూసిన సమాజంలో మహిళలకు, పిల్లలకు, కామన్ మ్యాన్‌కు ఎదురయ్యే సమస్యలను తీర్చే అవకాశం ఐఏఎస్ అయితేనే సాధ్యం అనే నమ్మకం నాది. అందుకే మళ్లీ ప్రయత్నిద్దాం అనుకున్నాను. కానీ ఇంట్లో వద్దన్నారు. దాంతో ఐపీఎస్‌లో చేరిపోయాను. ఇడుక్కి నుంచి ఐపీఎస్ అయిన తొలి మహిళను నేనే'' అన్నారు.

ఐపీఎస్ అయినప్పటికీ నా దృష్టి ఎప్పుడూ సామాజికాంశాల మీదనే లగ్నమవుతుంటుంది. సివిల్ సర్వెంట్‌గా సోషల్ ఇష్యూస్‌ని పరిష్కరించే దారులనే వెతుకుతుంటాయి నా కళ్లు. నాకు నచ్చిన దృశ్యాన్ని కెమెరాలో క్యాప్చర్ చేయడం, నా దృష్టికి వచ్చిన విషయాన్ని రాయడం నాకు ఇష్టమైన వ్యాపకాలు. వీలు చేసుకుని మరీ టైమ్స్ ఆఫ్ ఇండియా పేపర్‌లో వ్యాసాలు రాస్తుంటాను. ఇక నాకు ఇప్పటికీ మిగిలిపోయిన కోరిక హార్వర్డ్ యూనివర్సిటీలో రీసెర్చ్ చేయాలనేది.

ఆపరేషన్ స్మైల్!

రేమా రాజేశ్వరి 2009 బ్యాచ్ ఐపీఎస్ ఆఫీసర్. హైదరాబాద్‌లో ట్రెనింగ్. రంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పని చేశారు. ఇప్పుడు జోగుళాంబ గద్వాల్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌గా మొదలైన ఆమె కెరీర్ తెలంగాణ క్యాడర్‌లో కొనసాగుతోంది. కృష్ణా పుష్కరాల నిర్వహణలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టారు రేమా. సైబరాబాద్ డి.సి.పిగా ఈవ్‌టీజింగ్‌ను అరికట్టడానికి షీ టీమ్‌లో పని చేశారీ బ్రేవ్ సూపర్ కాప్. రంగారెడ్డి జిల్లాలో 'ఆపరేషన్ స్మైల్' ప్రోగ్రామ్‌లో వలస వచ్చిన బాల కార్మికులను బడిబాట పట్టించారు. 'సేవింగ్ చైల్డ్ బ్రైడ్' క్యాంపెయిన్ చేపట్టి నాలుగు వందల మంది అమ్మాయిలను బాల్య వివాహాల నుంచి విముక్తి కలిగించారు. వాళ్ల పేరెంట్స్‌కి కౌన్సెలింగ్ ఇచ్చి ఆ అమ్మాయిలను మళ్లీ బడిలో చేర్పించారు.

సీనియర్ సిటిజెన్ సర్వీసులు!

ఎస్పీగా ఆమె శాంతి భద్రతల నిర్వహణ, ప్రమాదాల నిర్వహణ, నేరాల దర్యాప్తుకు పరిమితం కావడం లేదు. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. వాటి మూలాలను నిర్మూలించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని నమ్మారామె. ఫ్యామిలీ రిలేషన్ ప్రోగ్రామ్ పెట్టారు. టీచర్లు, ఇతర ఉద్యోగాలలో రిటైర్ అయిన సీనియర్ సిటిజెన్‌ను ఈ ప్రోగ్రామ్‌లో భాగస్వాములను చేశారు. పోలీసులు ప్రతి కాలనీకి వెళ్లి ప్రమాదాల మీద అవేర్‌నెస్ తీసుకురావడం అయ్యే పని కాదు. అందుకే పట్టణంలోని సీనియర్ సిటిజెన్‌ని సమీకరించి వారి చేత కాలనీ వాసులకు చెప్పించేవారు. ఇది మంచి ఫలితాలనిచ్చింది. వేగం తాత్కాలికంగా ఆనందాన్నిస్తుందేమో కానీ ప్రమాదం జరిగితే కుటుంబం తల్లకిందులవుతుందని పెద్దవాళ్లు చెప్తుంటే విన్నవాళ్లలో పరివర్తన రాక మానుతుందా? అదే ఆమె టచ్ చేసిన పాయింట్.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో!

పోలీస్ యూనిఫామ్ కనిపిస్తేనే ఆమడదూరం పారిపోతారు గ్రామాల్లో. చిన్న సమాచారం సేకరించాలన్నా తలకు మించిన పని అవుతుంటుంది. ఎంత పెద్ద సమస్య వచ్చినా పోలీస్ దగ్గరకు రావడానికి భయపడుతుంటారు. అలాంటిది రేమా గ్రామస్తుల్లో ఒకరిగా కలిసిపోయారు. వారితోపాటు బతుకమ్మను మోశారు, పాట పాడుతూ ఆట ఆడారు. గ్రామీణ మహిళల్లో తమ కష్టాన్ని తీర్చడానికి ఒక ఆలంబన ఉందనే భరోసా కలిగించారు. జోగినులకు కొత్త జీవితాన్నివ్వడం, దత్తత తీసుకున్న గ్రామాన్ని అభివృద్ధి చేయడం, పిల్లలకు, మహిళలకు ఎదురయ్యే సమస్యల మూల కారణాల మీద కొరడా ఝుళిపించడం వంటి వన్నీ తొలి దశాబ్దంలోనే సొంతం చేసుకున్నారు. ఇందుకు ఆమె విస్తృతంగా సాహిత్యాన్ని చదవడమూ ఒక కారణమే. తమిళ, మలయాళ, తెలుగు, పంజాబీ, ఇంగ్లిష్, హిందీ భాషలు మాట్లాడతారామె. ఏ భాష సాహిత్యమైనా సరే ఆ కథల్లో ఇతివృత్తం కానీ, ప్రధాన సమస్యలు, సంఘటనలు అన్నీ పిల్లలు, స్త్రీల చుట్టూనే ఉండేవి. ఏ సమాజమైనా బాధితులు స్త్రీలు, పిల్లలే అని అర్థమైంది. అందుకే ఆమె డిజైన్ చేసిన ప్రోగ్రామ్‌లన్నీ మహిళలు, కుటుంబాల శ్రేయస్సు కోరుతూ ఉంటాయి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత తను భుజానికెత్తుకుని గురి తప్పని షూటర్‌లా వాటిని లక్ష్యాలకు చేరుస్తుంది.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటో సహకారం: బి.రాజు, సాక్షి, జోగుళాంబ గద్వాల్ జిల్లా

నా పిల్లలతో మాట్లాడించండి!

అది వేసవి కాలం, సోమవారం, గ్రీవెన్సెస్‌డే. ఓ ముప్పై ఏళ్ల మహిళ దైన్య స్థితిలో వచ్చింది. గట్టిగా గాలి వీస్తే పడిపోతుందేమో అన్నంత బలహీనంగా ఉంది. ఆమె తన కష్టం చెప్పుకోవడానికి ముందు గతాన్ని చెప్పింది. ఆమె 17 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు పెద్దవాళ్లు స్కూలుకు వచ్చారు, ఆమెను స్కూలు నుంచి నేరుగా కల్యాణ మండపానికి తీసుకెళ్లారు. మేనమామతో పెళ్లి అని అప్పుడు తెలిసింది. మేనమామ తనకంటే పన్నెండేళ్లు పెద్దవాడు, అంతేకాదు అతడికి అప్పటికే పెళ్లయింది. అయినా తనతో మళ్లీ పెళ్లికి సిద్ధమయ్యాడు. తన అమ్మానాన్నలే ఆ పెళ్లి చేస్తున్నారు. ఆమెకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండానే పెళ్లి చేసేశారు. పెళ్లి కాగానే భర్త ఆమెను మహబూబ్‌నగర్ జిల్లాలోనే తాను ఉద్యోగం చేసే టౌన్‌కు తీసుకెళ్లాడు. తొలి భార్య కూడా ప్రభుత్వ ఉద్యోగి. ఆమెకి పిల్లలు లేనందువల్ల ఈమెను పెళ్లి చేసుకున్నాడు. కేవలం పిల్లలకోసమే. పిల్లలను కనడమే ఆమె చేయాల్సిన పని అన్నట్లే వ్యవహరించాడా భర్త. చీకట్లో భర్త దేహానికి తగలడం తప్ప అతడితో ఇంకే బాంధవ్యమూ పెరగలేదామెకు. పెంచుకోవడం అతడికీ ఇష్టం లేదు. ముగ్గురు పిల్లలు పుట్టారు. అప్పటి నుంచి ఆమెను పూర్తిగా వంటగదికి పరిమితం చేశారు. చివరికి ఆమె పిల్లలను కూడా ఆమెకు చూపించకుండా కట్టడి చేశారు. ఆ పరిస్థితిలో ఆమె పోలీస్ స్టేషన్ మెట్లెక్కింది. 'నా పిల్లలతో ఒక్కసారి మాట్లాడించండి' అని కళ్లనీళ్లు పెట్టుకుంది. ఆమె భర్త, అతడి మొదటి భార్యను అదుపులోకి తీసుకుని ఆమె పిల్లలను దగ్గర చేయడంతోపాటు జీవితానికి భరోసా కల్పించారు రేమా. అప్పుడామెను 'ఇంత జరుగుతున్నా ఇన్నాళ్లూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎందుకు కంప్లయింట్ ఇవ్వలేదు, ఇప్పుడు కూడా దగ్గరలో ఉన్న స్టేషన్‌ను వదిలిపెట్టి ఎస్పీ ఆఫీస్‌కు ఎందుకొచ్చావు?' అని అడిగారు రేమా. అందుకామె చెప్పిన సమాధానం ఒక్కటే... 'ఆడవాళ్లకైతేనే ఆడవాళ్ల కష్టం తెలుస్తుందని, ఇంకా మగ పోలీసుల నుంచి వచ్చే ప్రమాదాలుండవని' చెప్పింది. 'పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళల సంఖ్య పెరగాలని తాను ఇస్తున్న నివేదికకు ఇలాంటి సంఘటనలన్నీ కారణమే. అందుకే సెక్యూరిటీ ఫోర్సెస్‌లో కూడా జెండర్ ఈక్వాలిటీ ఉండా'లంటారు రేమా రాజేశ్వరి.

రేమా రాజేశ్వరి, ఎస్.పి, జోగుళాంబ గద్వాల్ జిల్లా

పున్నమి వెన్నెల

రేమా రాజేశ్వరి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీగా ఉన్నప్పటికీ ఊటుకూరు గ్రామ ప్రాంతంలో జోగినీ వ్యవస్థ కొనసాగుతూనే ఉండేది. రూపుమాసిపోయిందనుకున్న దురాచారం కళ్ల ముందే కనిపిస్తుంటే దానిని నిర్మూలించి తీరాలని నిర్ణయించుకున్నారామె. 'పున్నమి వెన్నెల' ప్రోగ్రామ్‌తో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మొత్తం 36 మంది జోగినులకు కొత్త జీవితాన్నిచ్చారు. టైలరింగ్‌లో రెండు నెలలు ట్రైనింగ్ ఇప్పించి, వారందరికీ మెషీన్లు అందజేశారు.

చిన్నప్పటి నుంచి చూసిన సంఘటనలు ఆమెకు సమాజంలో హానికి గురవుతున్నది మహిళలు, పిల్లలేనని చెప్తున్నాయి. తాము దోపిడీకి గురవుతున్నామని తెలుసుకోలేని అమాయకత్వం కూడా బలంగానే రాజ్యమేలుతోందనీ తెలుస్తోంది. దాంతో 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' గురించి పిల్లలను చైతన్యవంతం చేయడాన్ని కూడా చాలా ఇష్టంగా చేపట్టారామె. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతి హైస్కూల్‌లోనూ ఈ ప్రోగ్రామ్ చేశారు. పాంప్లెట్లు, పోస్టర్‌లు వేశారు. షార్ట్ ఫిల్మ్‌లు చిత్రీకరించి స్కూళ్లలో ప్రదర్శించారు. అనేక స్కూళ్లకు ఆమె స్వయంగా వెళ్లి ఆడపిల్లలతో మాట్లాడారు. అసహజమైన స్పర్శను ఉపేక్షించరాదని, టీచర్లకు, అమ్మకు చెప్పి తీరాలని, ఆ ధైర్యాన్ని పెంచుకోవాలని చెప్పేవారామె. అడ్డాకులను నూరు శాతం టాయిలెట్‌లున్న గ్రామంగా తీర్చిదిద్దారు.

ఈ వారం YouTube హిట్స్

వరద గుడి – షార్ట్ ఫిల్మ్



నిడివి: 24 ని. 25 సె. ::: హిట్స్: 82,550

భాండశుద్ధి లేని పాకమేల అంటారు పెద్దలు. చిత్తశుద్ధి లేని శివపూజలేల అని కూడా అన్నారు. స్వధర్మం, గృహధర్మం పాటించలేని వ్యక్తి ఎదుటివారికి ధర్మపన్నాలు వల్లించడం ఎంత సమంజసం? భార్యపట్ల, సంతానం పట్ల ఎటువంటి ధర్మాన్ని కలిగి ఉండాలో బోధ చేస్తూ తాను మాత్రం ఆ బోధ తప్పితే? అలాంటి భర్తకు బుద్ధి చెప్పి తిరుగుబాటు చేసిన ఒక భార్య కథ 'వరద గుడి'. పాటిబండ్ల రజని కథ 'సత్యవ్రతం' ఆధారంగా అంజనీ యలమంచలి స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ప్రతిభావంతంగా రూపకల్పన చేశారు. నటి అర్చన ప్రధాన పాత్ర. ఎం.వి.రఘు కెమెరా. ప్రముఖ లలిత సంగీత గాయకులు మల్లాది సూరిబాబు ఈ షార్ట్‌ఫిల్మ్ కోసం టైటిల్ సాంగ్ ఆలపించారు. తెలుగు సాహిత్యంలోని మంచి కథలకు దృశ్యరూపం ఇచ్చే ఈ పరంపర కొనసాగాలని కోరుకుందాం.

ఏక్ దో తీన్ – రీమిక్స్ సాంగ్



నిడివి: 1 ని. 37 సె. ::: హిట్స్: 3,18,93,400

నటి మాధురి దీక్షిత్‌ని రాత్రికి రాత్రి సూపర్‌స్టార్ చేసిన పాట 'ఏక్ దో తీన్'. ఎన్.చంద్ర దర్శకత్వం వహించిన 'తేజాబ్' (1988)లో వచ్చిన ఈ పాట దేశం మొత్తం ఊపేసింది. ముప్పై ఏళ్ల తర్వాత ఈ పాటను మళ్లీ రీమిక్స్ చేశారు టైగర్ ష్రాఫ్ నటించిన 'భాగీ2' కోసం. నటి జాక్విలిన్ ఫెర్నాండెజ్ ఈ పాటలో హుషారైన స్టెప్స్ వేస్తూ కనిపించింది. గతంలో ఈ పాటను అల్కా యాగ్నిక్ పాడగా ఇప్పుడు రీమిక్స్ కోసం శ్రేయా ఘోషల్ గొంతు విప్పడం సంగీతాభిమానులకు ఇరువురిలో ఎవరు బాగా పాడారని బేరీజు వేసుకునే సరదా కలిగిస్తుంది. 'భాగీ 2' మన తెలుగు సినిమా 'క్షణం'కు రీమేక్. తెలుగులో హిట్టయిన ఆ సినిమాకు మార్పుచేర్పులు చేసి హిందీకి తగినట్టుగా టైగర్ ఇమేజ్‌కు తగినట్టుగా మార్చి రిలీజ్ చేస్తున్నారు. మార్చి 30 విడుదల. ఏక్ దో తీన్ పాట ఈ సినిమా ఘన విజయానికి ఏమేరకు ఉపయోగపడుతుందో చూడాలి.

బేవఫా బ్యూటీ – ఐటమ్ సాంగ్



నిడివి: 2 ని. 05 సె. ::: హిట్స్: 39,29,460

ఒకప్పుడు 'రంగీలా', 'అనగనగా ఒకరోజు', 'ఏక్ హసీనా థీ' వంటి సినిమాలతో ఎంతో బిజీ హీరోయిన్‌గా వెలిగిన ఊర్మిళా మంటోడ్కర్ చాలా గ్యాప్ తర్వాత ఈ ఐటమ్ నంబర్‌తో బాలీవుడ్‌లో రీఎంట్రీ ఇచ్చింది. ఏదైనా మంచి పాత్రతో కాక ఐటమ్ గర్ల్‌గా ఆమె రీఎంట్రీ ఇవ్వడం కుతూహలం రేపే అంశమే. 'బ్లాక్ మెయిల్' సినిమాలో 'బేవఫా బ్యూటీ' అంటూ ఊర్మిళ చేసిన ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో మంచి హిట్లు సాధిస్తోంది. వంగపండు రంగు చమ్కీల చీరలో ఈ వయసులో కూడా మంచి శారీరక పటిమతో ఆమె సత్తా చాటుకునేలా ఉంది. 'బ్లాక్ మెయిల్' సినిమాలో హీరో ఇర్ఫాన్ ఖాన్. తన భార్య మరొకరితో సంబంధం కలిగి ఉండటం చూసి ఇర్ఫాన్ ఖానే వాళ్లను 'ఈ సంగతి నీ భర్తకు చెప్పేస్తాను' అంటూ అజ్ఞాత వ్యక్తిగా బ్లాక్‌మెయిల్ చేయడానికి పూనుకోవడం కథ. 'ఢిల్లీ బెల్లీ' వంటి పెద్ద హిట్ ఇచ్చిన దర్శకుడు అభినయ్ డియో ఈ సినిమాకు దర్శకుడు కావడంతో అందరి అంచనాలు దీని మీద పెరిగాయి.

ఫ్యామిలీ డాక్టర్

లైఫ్‌స్టైల్ కౌన్సెలింగ్

వేసవి వేడి పెరిగింది కదా... వ్యాయామం ఆపేయాలా?



ఈమధ్యే ఫిబ్రవరి మొదటివారంలో వ్యాయామం చేయడం మొదలుపెట్టాను. అయితే ఇప్పుడు మార్చిలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి కదా... ఇలాంటి వేడి వాతావరణంలో వ్యాయామం చేయకూడదని, అది మంచిదికాదని ఫ్రెండ్స్ అంటున్నారు. నేను వ్యాయామం ఆపేయాలా? దయచేసి నాకు సలహా ఇవ్వండి.

– ఎల్. రామచంద్రం, విజయవాడ

వేసవిలో వ్యాయామం ఆపేయాల్సిన పనిలేదు గానీ ఈ సీజన్‌లో వ్యాయామం చేసేవారు కొన్ని అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి. అవేమిటంటే... మన శరీర ఉష్ణోగ్రతను ఎప్పుడూ ఒకేలా ఉంచడానికి శరీరంలోని చర్మం, రక్తనాళాలు పనిచేస్తాయి. మన శారీరక శ్రమ పెరగగానే రక్తనాళాల్లోకి రక్తం ఎక్కువగా ప్రవహించి చర్మాన్ని చేరుతుంది. శరీరంలోని ఉష్ణోగ్రతను తగ్గించడానికి చర్మంపైన ఉన్న స్వేదగ్రంథులు చెమటను స్రవిస్తాయి. ఆ చెమట ఆవిరి అయ్యే క్రమంలో శరీరం నుంచి ఉష్ణోగ్రతను తీసుకుంటుంది. అందుకే చర్మంపై చెమట పట్టినప్పుడు ఫ్యాన్ నుంచి గానీ, చెట్ల నుంచి గానీ గాలి సోకితే ఒంటికి హాయిగా అనిపిస్తుంది. అలా శరీరంలో పెరిగిన ఉష్ణోగ్రతను తగ్గించడానికి చెమట తోడ్పడుతుంది. అయితే శారీరక శ్రమ అలాగే కొనసాగి ఈ చెమట పట్టే ప్రక్రియ అదేపనిగా జరుగుతుంటే... మన మేను నీటినీ, దానితో పాటు ఖనిజలవణాలను కోల్పోతుంది. మరీ ఎక్కువ వేడిమికి ఎక్స్‌పోజ్ అయినప్పుడు, మనం తగినన్ని నీళ్లు, ద్రవాహారం తీసుకోనప్పుడు మనకు చెమట అతిగా పట్టి శరీర ఉష్ణోగ్రతను ఒకేలా నిర్వహించే వ్యవస్థ దెబ్బతినవచ్చు. అప్పుడు కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాదు... వాతావరణంలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు చాలాసేపు కూర్చొని ఉండి, అకస్మాత్తుగా నిలబడినా లేదా అదేపనిగా నిలబడి వ్యాయామం చేసినా అకస్మాత్తుగా కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది. దీన్నే 'హీట్ సింకోప్ అండ్ ఎక్సర్‌సైజ్ అసోసియేటెడ్ కొలాప్స్' అని అంటారు. చాలా మంది చెప్పేట్లుగా వాతావరణంలో వేడి పెరుగుతున్న ఇలాంటి సమయంలో వ్యాయామం మాననక్కర్లేదు గానీ పైన చెప్పిన అనర్థాలు నివారించడానికి కొన్ని జాగ్రత్తలు పాటించండి. అవి...

- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో పగటివేళ ఎండకు ఎక్స్‌పోజ్ కావద్దు. మీరు మీ వ్యాయామాలను వాతావరణం చల్లగా ఉండే వేకువజామున చేయండి.
- చెమటను పీల్చే కాటన్ దుస్తులను ధరించండి.
- బాగా నీళ్లు తాగండి. ఒంట్లో ఖనిజ లవణాలు (ఎలక్ట్రొలైట్స్) భర్తీ అయ్యేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోండి.
- మీరు వ్యాయామం చేసే ముందర ఒకసారి వాతావరణం ఎలా ఉందో పరిశీలించండి. మరీ వేడిగా ఉంటే వ్యాయామాన్ని చల్లటి వేళకు వాయిదా వేసుకోండి. ఒకవేళ మీరు వ్యాయామం చేస్తున్న సమయంలో తలనొప్పి, కళ్లుతిరిగినట్లు, వాంతి వచ్చినట్లు అనిపిస్తే వెంటనే వ్యాయామం ఆపేసి, డాక్టర్‌ను సంప్రదించండి.

నా వయసు 23 ఏళ్లు. నేను చాలా సన్నగా ఉంటానని అందరూ ఎగతాళి చేస్తుంటారు. నా ఎత్తు ఐదడుగుల తొమ్మిది అంగుళాలు. బరువు కేవలం 46 కేజీలు మాత్రమే. నేను లావు పెరగడానికి సలహాలు ఇవ్వండి. ఏమైనా మందులు వాడాలా చెప్పగలరు.

– ఎమ్. సంతోష్, విశాఖపట్నం

ఆరోగ్యకరంగా బరువు పెరగడం ఎలా?



కొందరు బరువు పెరగకపోవడానికి సాధారణ కారణాలు ఇవి... ● జన్యుపరమైనవి ● సరిగా తినకపోవడం ● చాలా తీవ్రమైన శారీరక శ్రమ ఉన్న వృత్తిలో ఉండటం ● అతి వ్యాయామం. ఈ సమస్యలే గాక ఇక ఆరోగ్యపరంగా కొందరికి ఆహారం తీసుకోవడం విషయంలో వైద్యపరమైన రుగ్మతలు ఉన్నప్పుడు కూడా బరువు పెరగరు. మీ విషయంలో సమస్య ఏమిటో తెలుసుకోడానికి ముందుగా వైద్యుడిని కలవండి. డాక్టరు మిమ్మల్ని పరీక్షించి... ● మీకు ఏదైనా వైద్యపరమైన సమస్య ఉందేమో తెలుసుకోడానికి తగిన పరీక్షలు చేయించి వాటిని నిర్ధారణ చేస్తారు (ఉదా: హైపర్ థైరాయిడిజమ్) ● మీరు తీసుకునే ఆహరంలో పోషకాలు పాళ్లు ఎలా ఉన్నాయో అన్నదానితో పాటు మీ శారీరక శ్రమ వివరాలను అడిగి తెలుసుకుంటారు. ● ఆ తర్వాత ఆరోగ్యకరంగా బరువు పెరిగేందుకు మీరు తీసుకోవాల్సిన ఆహారం, చేయాల్సిన వ్యాయామాల గురించి వివరిస్తారు. మీకు కొన్ని సూచనలు : ● మీరు ఇప్పుడు తీసుకుంటున్న పరిమాణం కంటే పెద్ద పరిమాణాల్లో కనీసం మూడుసార్లయినా ఆహారం తీసుకోండి. మధ్యలో మరో మూడుసార్లు చిన్న పరిమాణాల్లో మరో మూడుసార్లు తినండి. ఇలా రోజుకు ఆరుసార్లు తినండి ● మీరు తీసుకునే ఆహారంలో ఆరోగ్యకరమైన ప్రోటీన్స్ ఉండేలా చూసుకోండి. అవి కండరాల పెరుగుదలకు దోహదపడతాయి. కేవలం ఆరోగ్యకరమైన ప్రోటీన్ మాత్రమే తీసుకోవాలి లేకపోతే మీరు అతిగా తీసుకునే ప్రోటీన్ మీ అంతర్గత అవయవాలపై చెడుప్రభావం చూపుతుంది. (ముఖ్యంగా కిడ్నీలు). అందుకే హై-ప్రోటీన్ డైట్ వద్దు. ● మీ ఆహారంలో పండ్లు, పెరుగు, కస్టర్డ్, మిల్క్‌షేక్‌లు నిత్యం ఉండేలా చూసుకోండి. ● ఆరుసార్లు తినే ఆహారంలో అతిగా కొవ్వులు, పోషకాలు లేకుండా ఉండే జంక్‌ఫుడ్ లేకుండా జాగ్రత్త తీసుకోండి. ● ఇక నట్స్ ఎక్కువగా తీసుకోండి. ● వెన్న, ఆల్మండ్, వేరుశెనక్కాయలు, డ్రైఫ్రూట్స్ మీ ఆహారంలో ఉండేలా చూసుకోండి. ● మీరు వాడే నూనెకు బదులు ఆరోగ్యకరమైన ఆలివ్ ఆయిల్‌ను వాడండి. ● అతి వ్యాయామం కాకుండా పరిమితమైన వ్యాయామం తప్పక చేయండి. మీ వ్యాయామాలు ఎలా ఉండాలంటే అతిగా చేసి కొద్దిసేపట్లో ముగిసేలా కాకుండా, మెల్లగా చేస్తూ... చాలాసేపు కొనసాగేలా జాగ్రత్తపడండి. బరువు పెరగడానికి దోహదపడతాయంటూ న్యూస్‌పేపర్లలో, టీవీల్లో కనిపించే ప్రకటనల లోని పౌడర్ల జోలికి వెళ్లకండి. పరిమితమైన కొవ్వులు శరీర జీవకార్యకలాపాలకు అవసరం. అంత మేరకు మాత్రమే కొవ్వులు పెరిగేలా ముందుగా మీరు ఆహారాన్ని ప్లాన్ చేసుకోవాలి. ఇక మీరు బరువు పెరిగే క్రమం కూడా చాలా మెల్లగా జరగాలి. అంతేతప్ప ఒకేసారి కాదు.



డాక్టర్ సుధీంద్ర ఊటూరి
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్

పాపం ప్రేమికుడు


జస్టిన్ బీబర్
సెలినా గోమేజ్
బాస్కిన్ చాంపియన్


ప్రేమలో ఉన్నవాళ్లు వింతగా కనిపిస్తారు. ఎప్పుడెలా ఉంటారో ఎవ్వరికీ అర్థం కాదు. ప్రేమలో విఫలమైన వాళ్లూ అంతే! ఈ రెండింటికీ మధ్యన ఉండే వాళ్లతోనే అసలు సమస్య అంతా. వాళ్లకు ఏం జరుగుతోందో అర్థం కాదు. ఏం చేస్తున్నారో అంతకుమించి అర్థం కాదు. నవ్వుతారు. ఏడుస్తారు. ఇంకేదేదో చేస్తుంటారు. అచ్చం మన పాప్ సింగర్ జస్టిన్ బీబర్‌లాగా! జస్టిన్, సెలెనా గోమేజ్‌లది ఎనిమిదేళ్ల ప్రేమ. అలా అని ఎనిమిదేళ్లుగా కలిసే ఉంటున్నారా అంటే లేదు. కొన్నాళ్లు కలిసి ఉంటారు. కొన్నాళ్లకు విడిపోతారు. మళ్లీ ఎప్పటికో కలిసిపోతారు. ఇలా ఆన్ అండ్ ఆఫ్ ఉంటుంది జస్టిన్ – సెలెనా లవ్‌స్టోరీ. ఈమధ్యే వీళ్లిద్దరూ చెట్టాపట్టాలేసుకొని చక్కగా కనిపించారు. సెలెనా, జస్టిన్ కోసం తన తల్లితో కూడా గొడవ పడి బయటకొచ్చింది. ఇంత జరిగాక ఇంక ఈ లవ్‌స్టోరీ సక్సెస్‌ఫుల్ అవుతుంది అనుకుంటే, చిన్న ట్విస్ట్ వచ్చింది. ఆ ట్విస్ట్ పేరే బాస్కిన్ చాంపియన్. జస్టిన్ గత కొద్దికాలం క్రితం ప్రేమించిన అమ్మాయే బాస్కిన్. సెలెనా తిరిగొచ్చేశాక బాస్కిన్‌తో తెగతెంపులు చేసుకున్నాడు జస్టిన్. కాకపోతే ఇప్పుడు జస్టిన్, బాస్కిన్ ఎలా దగ్గరయ్యారో మళ్లీ దగ్గరయ్యారు. ఈ విషయం సెలెనాకు నచ్చలేదు. జస్టిన్‌ను వదిలేసి పోయింది. దీంతో ఎనిమిదేళ్ల ప్రేమకథ ఇప్పుడు ఇక్కడికొచ్చి ఆగింది. ఇదిక్కడే పూర్తిగా ఆగిపోతుందా? చూడాలి!! ఈ మొత్తం వ్యవహారంలో మాత్రం జస్టిన్ ఎప్పుడెలా ప్రవర్తిస్తున్నాడో అతనికే అర్థం కావట్లేదు పాపం!

కుర్రాడు కావాలి!


జెన్నిఫర్ అనిస్టన్

జెన్నిఫర్ అనిస్టన్ ఈ మధ్యే భర్త జస్టిన్ థెరోకు విడాకులు ఇచ్చి ఫ్రీ బర్డ్ అయింది. అంతకు ముందు బ్రాడ్‌పిట్‌తోనూ ఆమె పెళ్లి నిలవలేదు. ఇప్పుడు రెండో పెళ్లీ బ్రేక్ చేసి, ఫ్రీ బర్డ్ అయ్యాక ఆమె ఒక వింత కోరిక బయటపెట్టింది. అదేమిటంటే.. కుర్రాడితో ప్రేమలో పడాలని. తన వయసున్న వారితో ప్రేమ, పెళ్లి బోర్ కొట్టిందట జెన్నిఫర్‌కు. ఇప్పుడిప్పుడే ముప్పెల్లోకి అడుగుపెడుతున్న, పాతికేళ్లు దాటిన కుర్రాళ్లైతే పూర్తిగా డిపెండ్ అవ్వరనీ, వారితో సరదాగా ప్రేమలో పడి లైఫ్‌ను కొన్నాళ్లు ఎంజాయ్ చెయ్యాలనుకుంటున్నట్లు జెన్నిఫర్ చెప్పింది. ఈ వయసు కుర్రాళ్లతో అయితే పూర్తిగా కమిట్ అవ్వాల్సిన అవసరం లేదని, వాళ్లైతే కొత్తగా ఆలోచిస్తారని, నాన్సెన్స్ కూడా చాలా తక్కువ ఉంటుందని జెన్నిఫర్ ఆలోచన. జెన్నిఫర్ వయసు ఇప్పుడు 49 ఏళ్లు. మరి ఆమె కోరిక ఎలా నెరవేరుతుందో చూడాలి!!

టైటానిక్‌కు ముందు నాలుగు పెళ్లిళ్లు!


జేమ్స్ కేమరూన్

ప్రఖ్యాత దర్శకుడు జేమ్స్ కేమరూన్ పేరు చెబితే ముందు 'టైటానిక్' సినిమా గురించి మాట్లాడాలా, 'అవతార్' గురించి మాట్లాడాలా అని ఆలోచిస్తాం. కానీ, అంతకుముందే అద్భుతాలు సృష్టించాడాయన. హాలీవుడ్ సినిమాకు ఒక కొత్త అర్థాన్ని, కొత్త రూపురేఖల్నీ పట్టుకొచ్చిన కేమరూన్, 'టైటానిక్'కు ముందు ప్రతి విషయానికీ కోపంతో ఊగిపోయేవాడట. ఏదైనా తప్పు జరిగితే అందరి మీదా అరిచేవాడట. 'టైటానిక్' విడుదలయ్యాక కొన్నాళ్లు కేవలం సముద్రాలను ఈదడాన్నే పనిగా పెట్టుకున్నాడు కేమరూన్. ఆ సమయంలోనే సినిమాలు ముఖ్యమే కానీ, మనుషులు, జీవితం అంతకంటే ముఖ్యమని తెలుసుకున్నాడట. అప్పట్నుంచీ కేమరూన్ కూల్ పర్సన్. 'టైటానిక్'కు ముందు నాలుగు పెళ్లిళ్లు బ్రేక్ చేశాడు కేమరూన్. ఆ తర్వాత 2000వ సంవత్సరంలో సుజీ అమిస్‌ను పెళ్లాడి, ఇప్పటికీ ఆవిడతోనే హ్యాపీగా ఉన్నాడు. అంతకుముందు పెళ్లిళ్లు ఎందుకు బ్రేక్ చేశారు? అనడిగితే, కేమరూన్ ఒక ఆసక్తికర విషయం చెప్పుకొచ్చాడు – ''నా కథల్లో స్ట్రాంగ్ వుమెన్ ఉంటారు. ఇండిపెండెంట్ ఉంటారు. అలాంటి అమ్మాయిలంటే నాకు బాగా ఇష్టం. లైఫ్‌లోనూ అలాంటి అమ్మాయిలే ఉండాలని కోరుకున్నా. అయితే స్ట్రాంగ్, ఇండిపెండెంట్ అమ్మాయిలతో సమస్య ఏంటంటే, వాళ్లకు నాలాంటి వాడి అవసరం ఉండదు'' అన్నారు. సుజీ అమిస్ గురించి మాట్లాడుతూ, ''తనకు మాత్రం నేనెందుకో అవసరమయ్యా!'' అంటూ తన ఐదు పెళ్లిళ్ల గురించి చెబుతున్నాడు జేమ్స్ కేమరూన్. ప్రస్తుతం 'అవతార్' సీక్వెల్ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడాయన.

మూడువేల కోట్ల బడ్జెట్...



'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్' హాలీవుడ్ చరిత్రలోని అద్భుతాల్లో ఒకటి. ఈ ఫిల్మ్ సిరీస్‌లో వచ్చిన సినిమాలన్నీ బాక్సాఫీస్‌ను దోచేసుకొని ఇంటికి తీసుకెళ్లాయి. అలాగే అవార్డులను కూడా. ఇప్పుడు దీనికి ప్రీక్వెల్‌గా టీవీ సిరీస్ వస్తోంది. నిజమే. సినిమా కాదు.. టీవీ సిరీస్. గత దశాబ్దకాలంలో హాలీవుడ్‌లో టీవీ సిరీస్ బిజినెస్ అమాంతంగా పెరిగిపోవడంతో పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు బడ్జెట్ స్థాయిని కూడా ఎంతంటే అంత పెంచేస్తున్నాయి. 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' ప్రీక్వెల్ కోసం అమెజాన్ 500 మిలియన్ డాలర్లు (సుమారు మూడువేల రెండొందల యాభై కోట్ల రూపాయలు) ఖర్చు చేస్తోందట. ఇందులో 250 మిలియన్ డాలర్లు కేవలం కథ రైట్స్ కోసమే వెచ్చించడం విశేషంగా చెప్పుకోవాలి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలోనే ఈ టీవీ సిరీస్ ఉంది. మరి ఇన్ని కోట్లు ఖర్చు పెట్టిన సిరీస్, అంత రిటర్న్స్ తెచ్చుకుంటుందా? సినిమాల్లోలానే టీవీ సిరీస్‌లోనూ లార్డ్ ఆఫ్ ది రింగ్స్ రికార్డులు సృష్టిస్తుందా? చూడాలి.

హాలీవుడ్ స్పైస్

బాక్సాఫీస్ రైడర్


ఎలీసియా వికాండర్

'బ్లాక్‌పాంథర్' జోరు మెల్లిగా తగ్గింది. వచ్చే నెల విడుదలయ్యే 'అవెంజర్స్'కు ఇప్పట్నుంచే హంగామా మొదలైంది. ఇక ఈ మధ్యన కూడా కొన్ని సినిమాలు వస్తున్నా ఈ రెండు పెద్ద సినిమాల స్థాయి మాత్రం ఇంకో సినిమాకు లేదు. అయినప్పటికీ గత శుక్రవారం విడుదలైన 'టూంబ్ రైడర్' బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. ఎలీసియా వికాండర్ మెయిన్ లీడ్ చేసిన ఈ సినిమా ఆద్యంతం యాక్షన్ అడ్వెంచర్ ఎపిసోడ్స్‌తో అభిమానులను మెప్పిస్తోంది. ముఖ్యంగా ఎలీసియా యాక్టింగ్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. అమెరికాలో ఈ వారం టాప్ ప్లేస్‌లో టూంబ్ రైడరే ఉంది. ఇక ఇండియాలోనూ ఈ సినిమాకు మొదట్నుంచీ మంచి ప్రమోషన్స్ చేయడంతో ఓపెనింగ్స్ బాగున్నాయి. రోర్ ఉతౌగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు.. అదే పేరుతో వచ్చి, పాపులర్ అయిన వీడియో గేమ్ ప్రేరణ.

పక్కా పాన్ మసాలా మోసం


పియర్స్ బ్రోస్నన్

పియర్స్ బ్రోస్నన్. మీరు జేమ్స్‌బాండ్ సినిమా అభిమానులైతే ఈయనను తప్పకుండా ఎప్పుడో ఒకప్పుడు చూసే ఉంటారు. ఒకవేళ కాకపోయినా, పాన్ బహార్ అన్న బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తూ, ఒక చిన్న మౌత్‌ఫ్రెషనర్ డబ్బాను చేతిలో పట్టుకొని, ఏదొక పేపర్లో, ఏదొక రోజు కనిపించే ఉంటాడు. పాపం ఆయన అది నిజంగానే 'కేవలం' మౌత్‌ఫ్రెషనర్ అనుకొని ప్రమోట్ చేశాడు. అయితే పాన్ బహార్ బిజినెస్ అంతా గుట్కాలని ఆయనకు తెలీదు. పాన్ బహార్‌ను చూడగానే ప్రపంచానికి పాన్, గుట్కాలు తప్ప ఇంకేం గుర్తుకురాదని కూడా ఆయనకు తెలీదు. మొత్తానికి చక్కగా ఇరుక్కున్నాడు. చివరకు అశోక్ అండ్ కో కంపెనీ తనను మోసం చేసిందని విన్నవించుకోవాల్సి వచ్చింది. భారత్‌లో పొగాకు సంబంధిత పదార్థాలు ఏవీ ప్రమోట్ చేయడానికి వీల్లేదు. బ్రోస్నన్ ఇలా పాన్ బహార్‌ను ప్రమోట్ చేసినందుకు ఆయన మన ప్రభుత్వానికి తన బాధను తన లాయర్ల ద్వారా తెలియపర్చుకోవాల్సి వచ్చింది. కేవలం మౌత్ ఫ్రెషనర్ అన్న పేరుతోనే ప్రమోట్ చేశానని, తనను మోసం చేశారని చెప్పుకొచ్చాడు బ్రోస్నన్. నాలుగు జేమ్స్‌బాండ్ సినిమాల్లో నటించి బాండ్ అంటే ఇలాగే ఉంటాడు అనిపించుకున్న బ్రోస్నన్ పాన్ బహార్‌ను ప్రమోట్ చేసినప్పుడు ఆయనపై ఇండియన్ సినిమా అభిమానులంతా రకరకాలుగా జోక్స్ చేసుకున్నారు.

ఒకే జీవితం


రమేష్, శ్రుతీ యుగల్

సూపర్‌గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా రూపొందిన చిత్రం 'ఒకటే లైఫ్'. 'హ్యాండిల్ విత్ కేర్' అన్నది ఉపశీర్షిక. శ్రుతీ యుగల్ కథానాయికగా నటించిన ఈ సినిమాలో సుమన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎం.వెంకట్ దర్శకత్వంలో లార్డ్ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ని హీరో జీవా విడుదల చేశారు. వెంకట్ మాట్లాడుతూ– ''టెక్నాలజీ పేరుతో పరుగెడుతోన్న నేటి తరం మానవ సంబంధాలకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. జితన్ రమేష్ చక్కగా నటించారు. ఓ మంచి సినిమా చూశామన్న సంతృప్తి మా చిత్రం చూసిన ప్రేక్షకులకు కలుగుతుంది'' అన్నారు. ''మోషన్ పోస్టర్ చాలా ఆసక్తిగా ఉంది. సరికొత్త కథ, కథనాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు జీవా. ''నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. అతి త్వరలోనే సినిమా విడుదల చేయనున్నాం'' అన్నారు నారాయణ్ రామ్. ఈ చిత్రానికి సంగీతం: అమ్రీష్, కెమెరా: వై.గిరి.

అతనెవరో కూడా నాకు తెలీదు


రాశీ ఖన్నా

వరుస సక్సెస్‌లు అందుకుంటున్న హీరోయిన్లు రిలేషన్‌షిప్‌లో లేకుండా సింగిల్‌గా ఉంటే తట్టుకోలేరు గాసిప్‌రాయుళ్లు. ఏదో ఒక బిజినెస్‌మేన్‌తోనో, క్రికెటర్‌తోనో లవ్‌లో ఉన్నటు వదంతులు సృష్టిస్తారు. అలాగే యంగ్ క్రికెటర్ బూమ్రాతో రాశీఖన్నా లవ్‌లో ఉన్నట్టు పుకార్లు సృష్టించారు. 'అబ్బే అలాంటిదేం లేదు' అని రాశీ ఖన్నా చెబుతూ –''అతను క్రికెటర్ అన్న విషయం వరకూ తెలుసు. అంతకు మించి అతనెవరో కూడా నాకు తెలీయదు. నేను ప్రస్తుతం ఎవరితోనూ రిలేషన్‌షిప్‌లో లేను. సరైన ఇన్ఫర్మేషన్ లేకుండా ఒక అమ్మాయిని ఇలా లింకప్ చేస్తూ రాయడం చాలా బాధాకరం'' అని పేర్కొన్నారు. ఇటీవల 'తొలిప్రేమ' సక్సెస్‌తో జోరులో ఉన్న రాశీ ప్రస్తుతం నితిన్ సరసన 'శ్రీనివాస కళ్యాణం', తమిళంలో మూడు సినిమాలతో బిజీగా ఉన్నారు.

చాలా స్పెషల్


శ్రీకాంత్, హేమలత

నూతన నటీనటులు శ్రీకాంత్, నితిన్, హేమలత (బుజ్జి) ముఖ్య తారలుగా రూపొందుతోన్న చిత్రం 'నిన్నే చూస్తు'. కె.గోవర్ధన్‌రావు దర్శకత్వంలో వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై హేమలతా రెడ్డి నిర్మిస్తున్నారు. సుహాసిని, సుమన్, భానుచందర్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ఇటీవల రెండో షెడ్యూల్ పూర్తి చేసుకుంది. హేమలతా రెడ్డి మాట్లాడుతూ– ''మంచి కుటుంబ కథా చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ అద్భుతమైన పాటలు అందించారు. ఈ చిత్రానికి 'నిన్నే చూస్తు' టైటిల్ సాంగ్ చాలా ప్రత్యేకం. మలేషియాలోని అందమైన లొకేషన్స్‌లో తెరకెక్కించాం. పాట అవుట్‌పుట్ చూసి యూనిట్ సభ్యులు సంతోషించారు. నృత్యదర్శకురాలు రేఖ కొరియోగ్రఫీ మరో హైలైట్. త్వరలోనే షూటింగ్ పూర్తవుతుంది'' అన్నారు. సన, కాశీ విశ్వనాథ్, సాయాజీ షిండే, 'వెన్నెల' కిశోర్, రజిత తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు కెమెరా: ప్రసాద్ ఈదర (శంకర్ కుమార్), శంకర్ (సెకండ్ కెమెరామెన్).


మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఉన్నత ప్రవేశ పరీక్షలు

వాట్ ఆఫ్టర్ ఇంటర్..

ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తిచేసుకున్న లక్షలాది విద్యార్థుల ముందు ఉన్నత విద్యావకాశాలు అనేకం..! కానీ, ఎక్కువ మందికి తెలిసినవి ఇంజనీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి కొన్ని కోర్సులు మాత్రమే!! వీటితోపాటు డిజైన్, ఫ్యాషన్, ఫారెన్ లాంగ్వేజెస్, సైన్సెస్, స్టాటిస్టిక్స్, సోషల్ సైన్సెస్, హోటల్ మేనేజ్‌మెంట్, లా వంటి కోర్సులకూ జాబ్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులను అందించడంలో పలు ఇన్‌స్టిట్యూట్‌లకు మంచి పేరుంది. ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షల వివరాలు..





1 నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఎంట్రన్స్

డిజైన్ కోర్సుల్లో జాతీయస్థాయిలో పేరుగాంచిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడీ)–అహ్మదాబాద్.. ఏటా బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తోంది. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్‌లో యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిజైన్ పరిధిలో ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ అండ్ అపెరల్ డిజైన్ కోర్సులను నిడ్ అందిస్తోంది.

పరీక్ష విధానం

పరీక్ష రెండు దశల్లో జరుగుతుంది. ప్రిలిమినరీ దశలో డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణత పొందిన వారికి డీఏటీ మెయిన్ నిర్వహిస్తారు. ఈ ఏడాది ప్రిలిమినరీ పరీక్ష జనవరి 7న జరిగింది. ఏటా ఎన్‌ఐడీ నోటిఫికేషన్ నవంబర్‌లో వెలువడుతుంది.

వెబ్‌సైట్: admissions.nid.edu

2 ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) క్యాంపస్‌లు.. దేశంలో ఉత్తమ సైన్స్ విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు. ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లలో అయిదేళ్ల బీఎస్–ఎంఎస్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్. ఇందులో మంచి స్కోర్ సాధించడం ద్వారా ఐఐఎస్ఈఆర్‌కు చెందిన ఏడు క్యాంపస్ (బరంపూర్, భోపాల్, కోల్‌కతా, పుణె, తిరువనంతపురం, మొహాలి, తిరుపతి)ల్లో అడుగుపెట్టొచ్చు. మొత్తం అందుబాటులో ఉన్న సీట్లు 1300. వాస్తవానికి ఈ కోర్సులో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు లేదా కేవీపీవై ఉత్తీర్ణతను ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ అర్హతలు లేని విద్యార్థులకు స్టేట్ అండ్ సెంట్రల్ బోర్డ్ ఛానల్ విధానంలో ప్రవేశం కల్పించేలా ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షకు నోటిఫికేషన్ ఏటా మేలో వెలువడుతుంది.

- ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నాలుగు సబ్జెక్టులు (బయాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో నిర్వహిస్తారు. ఒక్కో సబ్జెక్టు నుంచి 15 చొప్పున మొత్తం 60 ప్రశ్నలుంటాయి. మార్కులు 180. ఎంపికైన విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ పథకం ప్రకారం నెలకు రూ.5వేల ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది.
- వెబ్‌సైట్: www.iiseradmission.in

3 ఐఎస్ఐ ఎంట్రన్స్

గణాంక శాస్త్రంలో నిపుణులను తీర్చిదిద్దుతూ.. ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల పరంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన సంస్థ.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ). ప్రధాన క్యాంపస్ కోల్‌కతా. కాగా ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, తేజ్‌పూర్, బెంగళూరులకూ బోధన కార్యకలాపాలు విస్తరించింది. ఇంటర్మీడియెట్ అర్హతగా బ్యాచిలర్ డిగ్రీ స్థాయి నుంచే స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్‌లో పలు కోర్సులు అందిస్తూ భవిష్యత్తు గణాంక నిపుణులకు వేదికగా నిలుస్తోంది.

బ్యాచిలర్ డిగ్రీ స్థాయి కోర్సులు

- బ్యాచిలర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ (ఆనర్స్).
- బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఆనర్స్).
- **అర్హత:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టిక్స్ కోర్సు పరంగా.. ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ (ఐఎన్ఎంవో)లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.
- కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు నెలకు రూ.3 వేల స్టైపెండ్/ఫెలోషిప్ లభిస్తుంది.

ఐఎస్ఐ అడ్మిషన్ టెస్ట్–2018 సమాచారం

- ఈ సంవత్సరం దరఖాస్తులకు గడువు ముగిసింది.
- ప్రవేశ పరీక్ష తేదీ: మే 13, 2018.
- వెబ్‌సైట్: www.isical.ac.in

4 టిస్-బీఏటీ

ప్రస్తుత టెక్నాలజీ యుగంలోనూ సోషల్ సైన్సెస్ కోర్సుల్లో ప్రత్యేకత చాటుతున్న విద్యాసంస్థ.. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్). ముంబై ప్రధాన క్యాంపస్‌గా ఉన్న టిస్.. హైదరాబాద్, తుల్జాపూర్, గువహటిలోనూ క్యాంపస్‌లు ఏర్పాటు చేసింది. వీటిలో బ్యాచిలర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. టిస్–బ్యాచిలర్ అడ్మిషన్ టెస్ట్ (టిస్–బీఏటీ).

- బీఏ (సోషల్ సైన్సెస్, సోషల్ వర్క్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత.. ఇంటర్మీడియెట్.

టిస్-బీఏటీ స్వరూపం

- ఈ టెస్ట్‌లో రెండు విభాగాలు (పార్ట్–ఎ, పార్ట్–బి) ఉంటాయి.
- పార్ట్–ఎలో కరెంట్ అఫైర్స్, సోషల్ అవేర్‌నెస్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. మార్కులు 60.
- పార్ట్–బిలో ఇంగ్లిష్‌లో రెండు షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్‌కు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 20 మార్కులు చొప్పున మొత్తం 40 మార్కులు ఉంటాయి.

టిస్-బీఏటీ 2018 సమాచారం

- దరఖాస్తుకు గడువు ముగిసింది. టిస్–బీఏటీ తేదీ: మే 5, 2018.
- వెబ్‌సైట్: www.admissions.tiss.edu

5 నిఫ్ట్ అడ్మిషన్ టెస్ట్

ఫ్యాషన్ ప్రపంచంలో నిపుణులను తీర్చిదిద్దుతూ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్). కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ సంస్థకు హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా 16 క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియెట్ అర్హతగా బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి.. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (యాక్సెసరీ డిజైన్/ఫ్యాషన్ కమ్యూనికేషన్/ఫ్యాషన్ డిజైన్/నిట్‌వేర్ డిజైన్/లెదర్ డిజైన్/టెక్స్‌టైల్ డిజైన్.

- **అర్హత:** ఇంటర్మీడియెట్.
- ఫ్యాషన్ రంగానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు అందించే బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (అపెరల్ ప్రొడక్షన్) కోర్సు కూడా అందుబాటులో ఉంది. ఈ కోర్సుకు ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు.
- **రాత పరీక్ష:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుకు క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ), జనరల్ ఎబిలిటీ టెస్ట్ (జీఏటీ), సిట్యుయేషన్ టెస్ట్ ఉంటాయి. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి జీఏటీ ఉంటుంది.
- ఏటా అక్టోబర్ లేదా నవంబర్‌లో నోటిఫికేషన్ వెలువడుతుంది. ఫిబ్రవరి/మార్చి/ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయి.
- వెబ్‌సైట్: www.nift.ac.in/admissions

6 ఎన్‌సీహెచ్ఎంసీటీ

ఆతిథ్య రంగం, పర్యాటక రంగం, హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాల ఔత్సాహికులకు చక్కటి వేదికలు.. ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ) పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలున్నాయి. వీటిలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ పేరుతో బ్యాచిలర్ డిగ్రీ కోర్సు అందుబాటులో ఉంది. ఈ కోర్సులో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్ఎం జేఈఈ). ఈ పరీక్షను మొత్తం అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి..

- న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్– 30 ప్రశ్నలు.
- రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్–30 ప్రశ్నలు.
- జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్–30 ప్రశ్నలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్–60 ప్రశ్నలు.
- ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్–50 ప్రశ్నలు.
- మొత్తం 200 ప్రశ్నలతో ఉండే పరీక్షకు కేటాయించిన మార్కులు 200.

ఎన్‌సీహెచ్ఎం-జేఈఈ 2018 సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11, 2018.
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 2018, ఏప్రిల్ 20 నుంచి.
- ఎన్‌సీహెచ్ఎం–జేఈఈ తేదీ: ఏప్రిల్ 28, 2018.
- వెబ్‌సైట్: https://applyadmission.net/nchmjee2018

7 క్లాట్-యూజీ

న్యాయ విద్యలో రాణించాలనుకునే వారికి నాణ్యమైన విద్యను అందించే నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశించేందుకు మార్గం.. క్లాట్–యూజీ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్). ఇందులో ఉత్తీర్ణత ద్వారా 19 నేషనల్ లా యూనివర్సిటీల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ–ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు. క్లాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఇంటర్మీడియెట్/10+2.

- క్లాట్–యూజీని ఆన్‌లైన్ విధానంలో అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. అవి...

■ ఇంగ్లిష్	40 ప్రశ్నలు
■ జీకే అండ్ కరెంట్ అఫైర్స్	50 ప్రశ్నలు
■ ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్	20 ప్రశ్నలు
■ లీగల్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు
■ లాజికల్ రీజనింగ్	40 ప్రశ్నలు
మొత్తం	200 ప్రశ్నలు

క్లాట్-యూజీ- 2018 సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2018.



- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: ఏప్రిల్ 20, 2018.
- క్లాట్ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: మే 13, 2018.
- వెబ్‌సైట్: www.clat.ac.in

8 ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ



ఉద్యోగం, ఉన్నత విద్య... రెండింటినీ ఒకే సమయంలో అందిస్తుంది... నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్. త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్)లలో పర్మనెంట్ కమిషన్ హోదాలో ఉద్యోగాల భర్తీకి ఉద్దేశించిన ఎన్‌డీఏ ఎగ్జామినేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏటా రెండుసార్లు ఎన్‌డీఏ–1, ఎన్‌డీఏ–2 పేరుతో నిర్వహిస్తుంది.

అర్హత

- ఆర్మీ విభాగం ఔత్సాహికులకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగం ఔత్సాహికులు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

పరీక్ష రెండు పేపర్లలో నిర్వహిస్తారు. అవి.. మ్యాథమెటిక్స్– 300 మార్కులు. జనరల్ ఎబిలిటీ టెస్ట్ – 600 మార్కులు.

- రాత పరీక్షలో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులోనూ విజయం సాధించిన అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న విభాగం ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారు. ఆర్మీ అకాడమీల్లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి బీఎస్సీ/బీఎస్సీ (కంప్యూటర్)/బీఏ డిగ్రీ; నేవల్ క్యాడెట్స్, ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్స్‌కు బీటెక్ డిగ్రీ లభిస్తుంది. దీంతోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభమవుతుంది.

ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ నోటిఫికేషన్ సమాచారం:

- ఎన్‌డీఏ– 2018 (1) దరఖాస్తు ప్రక్రియ ఇటీవల ముగిసింది.
- ఎన్‌డీఏ– 2018 (2) నోటిఫికేషన్ 2018, జూన్ 6న విడుదల కానుంది. వెబ్‌సైట్: www.upsc.gov.in

9 ఇఫ్లూ అడ్మిషన్ టెస్ట్



ఇంగ్లిష్ భాషతోపాటు ఇతర విదేశీ భాషల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలనుకునే వారికి సరైన వేదిక.. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ). దీని ప్రధాన క్యాంపస్ హైదరాబాద్‌లో ఉంది. లక్నో, షిల్లాంగ్‌ల్లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ క్యాంపస్‌ల్లో బీఏ–ఇంగ్లిష్ (ఆనర్స్)తోపాటు, బీఏ (ఆనర్స్)–ఫారెన్ లాంగ్వేజెస్ (అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్, స్పానిష్)కోర్సుల్లో; బీఏ–జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఈ అడ్మిషన్ టెస్ట్ బీఏ (ఆనర్స్)–ఇంగ్లిష్; బీఏ (ఆనర్స్)–ఫారెన్ లాంగ్వేజెస్‌కు వేర్వేరుగా ఉంటుంది.

బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్ అడ్మిషన్ టెస్ట్ స్వరూపం

- ఈ టెస్ట్‌లో గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్, రైటింగ్, జనరల్ నాలెడ్జ్, రీజనింగ్, లిటరేచర్ విభాగాల్లో ఉంటుంది.
- **బీఏ (ఆనర్స్) ఫారెన్ లాంగ్వేజెస్.. అడ్మిషన్ టెస్ట్ స్వరూపం:** ఈ టెస్ట్‌లో జనరల్ నాలెడ్జ్, లాంగ్వేజ్ ఆప్టిట్యూడ్, రిటెన్ కాంప్రెహెన్షన్, జనరల్ ట్రాన్స్‌ఫార్మేషన్స్, గైడెడ్ ఎస్సే, పిక్చర్ స్టోరీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- **బీఏ–జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్.. టెస్ట్ స్వరూపం:** ఈ పరీక్షలో నాలుగు విభాగాలు (జనరల్ అవేర్‌నెస్, మీడియా అవేర్‌నెస్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్, లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్) నుంచి ప్రశ్నలుంటాయి.
- 2018–19 సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ముగిసింది. ఏటా జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ వెలువడుతుంది.
- వెబ్‌సైట్: www.efluniversity.ac.in

10 నెస్ట్ (నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్)

బేసిక్ సైన్సెస్, బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో ఇంటర్‌తోనే పీజీ దిశగా అడుగులు వేయడానికి మార్గం.. నెస్ట్. ఇందులో ఉత్తీర్ణత ద్వారా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్), భువనేశ్వర్; యూనివర్సిటీ ఆఫ్ ముంబై– డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ సంయుక్తంగా అందిస్తున్న ఐదేళ్ల ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు.

అర్హత: ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌తో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.

నెస్ట్ నోటిఫికేషన్ సమాచారం

ఏటా నెస్ట్ నోటిఫికేషన్ జనవరిలో విడుదలవుతుంది. జూన్ మొదటి వారంలో పరీక్ష ఉంటుంది. 2018–19 విద్యా సంవత్సరానికి దరఖాస్తు గడువు ముగిసింది. పరీక్ష జూన్ 2న జరగనుంది.

- వెబ్‌సైట్: https://nestexam.in

11 ఐఎంయూ-సెట్



మెరైన్ విభాగంలో కెరీర్ కోరుకునే వారికి మార్గంగా నిలుస్తున్న పరీక్ష.. ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్. సెంట్రల్ యూనివర్సిటీ హోదా కలిగి.. చెన్నై ప్రధాన క్యాంపస్‌గా ఉన్న ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ.. తన అనుబంధ క్యాంపస్‌లతోపాటు అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌లలో యూజీ స్థాయిలో కోర్సుల్లో ప్రవేశానికి ఏటా ఐఎంయూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తోంది. దీనిద్వారా నాలుగేళ్ల వ్యవధిలోని బీటెక్ (మెరైన్ ఇంజనీరింగ్), బీటెక్ (నేవల్ ఆర్కిటెక్చర్, ఓషియన్ ఇంజనీరింగ్)తోపాటు మూడేళ్ల వ్యవధిలో ఉండే బీబీఏ (లాజిస్టిక్స్, రిటైలింగ్ అండ్ ఈ–కామర్స్), బీఎస్సీలో మారిటైమ్ సైన్స్, నాటికల్ సైన్స్, షిప్ బిల్డింగ్ అండ్ రిపెయిర్ గ్రూప్‌లలో ప్రవేశం పొందొచ్చు.

అర్హత


బీఎస్సీ మారిటైమ్ సైన్స్, నాటికల్ సైన్స్, షిప్ బిల్డింగ్ అండ్ రిపెయిర్; బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఓషన్ ఇంజనీరింగ్ కోర్సులకు ఎంపీసీ గ్రూప్‌తో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత. బీబీఏ లాజిస్టిక్స్ అండ్ ఈ–కామర్స్ కోర్సుకు 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.

ఐఎంయూ సెట్ స్వరూపం

- ఐఎంయూ సెట్ ఆన్‌లైన్ విధానంలో అయిదు విభాగాల్లో (ఇంగ్లిష్, జనరల్ ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్) 200 ప్రశ్నలతో ఉంటుంది.
- బీబీఏ–లాజిస్టిక్స్ అండ్ ఈ–కామర్స్ ఔత్సాహిక అభ్యర్థులకు సెట్ నుంచి మినహాయింపు ఉంది. ఈ అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ఎంపిక ఖరారు చేస్తారు.

ఐఎంయూ సెట్ నోటిఫికేషన్ వివరాలు

- ఏటా మార్చి చివరి వారంలో నోటిఫికేషన్ వెలువడుతుంది. మే మూడు లేదా నాలుగో వారంలో పరీక్ష నిర్వహిస్తారు.
- వెబ్‌సైట్: www.imu.edu.in



సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం 26-3-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	410 ▼	32,597
నిఫ్టీ	117 ▼	9,998

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	6,993	▽ 174
డోజోన్స్	23,533	▽ 424
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,922	▽ 31
డాక్స్	11,886	▽ 214
షాంఘై	3,153	▽ 110
నికాయ్	20,618	▽ 974

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			• కొనుగోలు	• అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.45	66.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.71	93.67
€	యూరో	ఎస్‌బీఐ	79.11	81.77
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	61.20	63.30
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.47	51.21
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.92	50.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.77	18.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.14	18.87
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.29	11.82

సమయం లేదు మిత్రమా...
ఐదు రోజులే..!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియటానికి నిండా నాలుగైదు రోజులే ఉంది. మార్చి 31తో ముగిసిపోతోంది. ఆదాయపన్ను జీవులు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలపై పన్ను మినహాయింపు అవకాశం పొందాలంటే అర్హత కలిగిన సాధనాల్లో ఆ మేరకు ఇన్వెస్ట్ చేయాలి. బీమా, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, ఈఎల్ఎస్ఎస్ ఇలా ఎన్నో సాధనాలున్నాయి. ఇప్పటికే మీరు చేసిన పెట్టుబడులు ఆ మేరకు ఉంటే ఫర్వాలేదు. లేదంటే పన్ను ఆదా కోసం బాగా ప్రాచుర్యంలో ఉన్న వాటిలో అనుకూలమైనవి ఎంచుకోవచ్చు. అందుకు పరిశీలించాల్సినవి ఇవే...

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

పన్ను ఆదాకు ఈ నెలాఖరు వరకే గడువు

బ్యాంకుల్లో ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయొచ్చు ● ఎన్‌పీఎస్, ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, సుకన్య కూడా
సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకూ అవకాశం ● ఎన్‌పీఎస్‌లో అదనంగా మరో రూ.50 వేలు పెట్టొచ్చు



ఈఎల్ఎస్ఎస్...

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) అన్నది ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకం. సెక్షన్ 80సీ కింద వీటికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఉంది. ఇవి మూడేళ్ల లాకిన్ పీరియడ్‌తో ఉంటాయి. అప్పటి వరకు విక్రయించేందుకు అవకాశం ఉండదు. వీటిలో గ్రోత్, డివిడెండ్ ఆప్షన్లలో నచ్చిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. పూర్తిగా ఈక్విటీ మార్కెట్ ఆధారిత పథకాలు కనుక వీటిలో పెట్టుబడులపై రాబడులు ఎంతొస్తాయన్నది చెప్పడం కచ్చితంగా సాధ్యం కాదు. అయితే, గడిచిన ఐదేళ్లలో ఈఎల్ఎస్ఎస్ పథకాల సగటు రాబడులు వార్షికంగా 18.5 శాతం ఉన్నాయని గణాంకాలను పరిశీలిస్తే తెలుస్తుంది. రిస్క్ భరించే ఇన్వెస్టర్లకు అధిక రాబడుల పరంగా ఇవి అనువైనవి. ఆర్థిక సలహాదారులు సైతం ఇతర పథకాల కంటే పన్ను ఆదా కోసం ఈఎల్ఎస్ఎస్ పథకాలనే ఎక్కువగా సూచిస్తుంటారు. ఇతర పథకాలతో పోలిస్తే తక్కువ లాకిన్ పీరియడ్ తక్కువగా ఉండటం ఆకర్షణీయ అంశం. ఇక ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో సిప్ మోడ్ ఎంచుకోవడం ద్వారా సగటున అదనపు రాబడులను పొందేందుకు అవకాశం ఉంటుంది.

నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)...

ఈ పింఛను పథకంలో ఎవరైనా చేరొచ్చు. సెక్షన్ 80సీ కింద వార్షికంగా రూ.1.50 లక్షలకు పన్ను మినహాయింపునకు ఇందులో ప్రయోజనం పొందొచ్చు. అలాగే, మరో రూ.50,000 వరకు ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసి సెక్షన్ 80సీసీడీ కింద కూడా పన్ను ఆదా చేసుకోవచ్చు. దీంతో మొత్తం రూ.2 లక్షలపై పన్ను మినహాయింపు ప్రయోజనం లభిస్తుంది. కాకపోతే సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల పరిమితి దాటి చేసే పెట్టుబడులపైనే సెక్షన్ 80సీసీడీ కింద రూ.50,000కు ఎన్‌పీఎస్‌లో పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ఉదాహరణకు సెక్షన్ 80సీ కింద మీరు ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్‌లో రూ.1.5 లక్షల మేర ఇన్వెస్ట్ చేసినట్టయితే, మరో రూ.50,000లను ఎన్‌పీఎస్‌లో పెట్టుబడి పెట్టి దానిపైనా పన్ను ప్రయోజనం పొందడానికి అవకాశం ఉంటుంది. ఎన్‌పీఎస్ పథకంలో 60 ఏళ్లు కాల వ్యవధి. ఆ తర్వాత పథకం నుంచి వైదొలగొచ్చు. అప్పటి కార్పస్‌లో 60 శాతాన్నే వెనక్కి తీసుకోగలరు. మిగిలిన 40 శాతాన్ని పెన్షన్ యాన్యుటీ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేయాలి. పెట్టుబడుల ఉపసంహరణలో 40 శాతంపైనే పన్ను మినహాయింపు. మిగిలిన 20 శాతంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ 60 శాతాన్ని యాన్యుటీలో ఇన్వెస్ట్ చేస్తే పన్ను ఉండదు. నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో డెట్, ఈక్విటీతో కూడిన పెట్టుబడి ఆప్షన్లను ఎంచుకోవచ్చు. ఎందులో చూసినా రాబడులు 9–12 శాతం మధ్య ఉన్నాయి.

ప్రజా భవిష్యనిధి (పీపీఎఫ్)..

ప్రభుత్వ హామీతో కూడిన పథకం. పెట్టుబడులపై పన్ను ఆదా, రాబడులకూ పన్ను మినహాయింపు ఉంది. పన్ను రహిత అధిక రాబడులను అందించే డెట్ పథకం. స్థిరాదాయ పన్ను రహిత సాధనం. పీపీఎఫ్‌లో వార్షికంగా చేసే రూ.1.5 లక్షల పెట్టుబడులపై సెక్షన్ 80సీ కింద పూర్తి పన్ను మినహాయింపు పొందొచ్చు. ప్రభుత్వ సెక్యూరిటీల ఈల్డ్స్‌తో పీపీఎఫ్ పథకాన్నీ కేంద్ర ప్రభుత్వం ముడిపెట్టడం, ఎప్పటికప్పుడు మార్కెట్ రేట్లకు అనుగుణంగా త్రైమాసికంవారీగా వడ్డీ రేట్లను సమీక్షిస్తుండటం చిన్న ప్రతికూలత. అయితే, పీపీఎఫ్‌లో పెట్టుబడులు, రాబడులు, ఉపసంహరణలపై పూర్తిగా పన్ను మినహాయింపు ఉండటంతో పన్ను ఆదాతో కూడిన మెరుగైన రాబడులకు ఇది ఇప్పటికీ మెరుగైన సాధనమేనన్నది విశ్లేషకుల అభిప్రాయం. ప్రస్తుతం ఇందులో 7.9% వడ్డీ రేటు అమల్లో ఉంది.

సుకన్య సమృద్ధి యోజన..

ఒకరిద్దరు కుమార్తెలున్నవారు వారి వయసు గనక 10 ఏళ్లలోపు ఉంటే ఈ పథకాన్ని ఎంచుకోవచ్చు. ఈక్విటీతో సంబంధం లేని కేంద్ర ప్రభుత్వ పథకమిది. ఆకర్షణీయమైన వడ్డీ రేటు, కాంపౌండింగ్ ప్రయోజనంతో కుమార్తె ఉన్నత విద్య, వివాహ అవసరాలకు ఉపయోగపడుతుంది. ఈ పథకంలో ఏటా కనీసం రూ.1,000, గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఏడాదిలో ఎన్నిసార్లయినా ఈ పరిమితికి లోబడి డిపాజిట్లు చేయొచ్చు. ఒక కుటుంబంలో గరిష్టంగా ఇద్దరు చిన్నారుల పేరిటే ఖాతాలు తెరిచేందుకు అవకాశం ఉంటుంది. ఖాతా తెరిచాక 15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయాలి. గరిష్టంగా ఖాతా తెరిచాక 21 ఏళ్ల పాటు లేదా అమ్మాయికి 18 ఏళ్లు నిండి వివాహం అయ్యేంత వరకు ఖాతా మనుగడలో ఉంటుంది. 18 ఏళ్లు నిండినా లేక 10వ తరగతి ఉత్తీర్ణత సాధించినా ఆ అవసరాల కోసం అప్పటి ఖాతా విలువలో 50 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఈ రెండింటిలో ఏది ముందు అయితే అదే అర్హత అవుతుంది. ఈ పథకంలో ప్రస్తుతం 8.1 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. మిగిలిన పన్ను ఆదా పథకాలతో పోలిస్తే ఎక్కువే. ప్రతీ త్రైమాసికానికీ ఈ పథకంపై వడ్డీ రేటును కేంద్రం సమీక్షిస్తుంటుంది. ఏటా రూ.1.5 లక్షల పెట్టుబడులకు సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపులు పొందొచ్చు. పెట్టుబడులపై వచ్చే వడ్డీకి, కాల వ్యవధి తీరాక చేతికందే మొత్తానికి కూడా పన్ను లేదు.

పన్ను ఆదా బ్యాంకు డిపాజిట్లు...

బ్యాంకులో చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే అన్ని రకాల డిపాజిట్లకు ఈ ప్రయోజనం లేదు. కేవలం పన్ను ఆదాతో కూడిన ఐదేళ్ల టర్మ్ డిపాజిట్లపైనే ఈ అవకాశం. వీటికి ఐదేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఆలోపు విత్‌డ్రా చేసుకునేందుకు వీలుండదు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఈ డిపాజిట్లను అందిస్తున్నాయి. వడ్డీ రేటు 6.5–7 శాతం వరకు లభిస్తోంది. పోస్టాఫీసుల ద్వారా కూడా ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

బీమా పథకాలు

మార్కెట్లో ఉన్న దాదాపు అన్ని రకాల జీవిత బీమా పథకాలకు చేసే ప్రీమియం చెల్లింపులపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు అమల్లో ఉంది. యులిప్‌లు, టర్మ్ ప్లాన్‌లు, సంప్రదాయ బీమా పథకాలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. బీమా పథకాల్లో చేసే పెట్టుబడులపై, జీవించి ఉంటే అందుకునే రాబడులు, అలాగే మరణ పరిహారంపైనా పన్ను లేదు.



కొత్త ఏడాదైనా
కాస్త ముందే!!

చెల్లించాల్సిన పన్నుపై ముందే అంచనాకు రావాలి

ఆరంభం నుంచే ఆదాకు అడుగులేయాలి ● వివిధ సాధనాలకు కేటాయింపులు అవసరం
ఆరు నెలలు, ఏడాదికోసారి పోర్ట్‌ఫోలియో సమీక్ష ● లాభాలు గణనీయంగా ఉంటే ప్రాఫిట్ బుకింగ్ ఇప్పడే

వేతన జీవులు, ఆదాయపన్ను చెల్లింపుదారులకు ప్రతీ ఆర్థిక సంవత్సరం కీలకమైనదే. పన్ను ఆదా కోసం చేసే ఇన్వెస్ట్‌మెంట్ ఆర్థిక సంవత్సరం చివర్లో కాకుండా ప్రారంభం నుంచే చేస్తే ఎంతో ఉపయోగం ఉంటుంది. ఎక్కువ మంది ఫిబ్రవరి, మార్చి మాసంలో పన్ను ఆదా చేసుకోవాలనే ఉద్దేశంతో అర్హత కలిగిన పథకాలలో ఏదో ఒకదానిలో పెట్టేస్తుంటారు. కానీ, తగిన ప్రణాళికతో తమకు అనువైన, లాభదాయకమైన సాధనాన్ని ముందే ఎంచుకుని ప్రతీ నెలా కొంత మొత్తం పెట్టుబడి పెడుతూ వెళితే ఆ సౌలభ్యమే వేరు. పైగా అదనపు రాబడి. ఈ విధంగా నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభంలో దృష్టి సారించాల్సిన అంశాలపై అందిస్తున్న ప్రాఫిట్ కథనమే ఇది.

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

తాజా బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాలపై (ఎల్‌టీసీజీ) పన్నును ప్రవేశపెట్టారు. కాకపోతే జనవరి వరకు ఆర్జించిన లాభాలకు మాత్రం మినహాయింపు (గ్రాండ్‌ఫాథర్డ్) కల్పించారు. ఇదో పెద్ద ఉపశమనమే. ఇప్పటికే మీకున్న పెట్టుబడులపై ఎల్‌టీసీజీని లెక్కించే విషయంలో కొంత శ్రమ అవసరమవుతుంది. అందుకే వాటిని ప్రత్యేకంగా ఒక డైరీ లేదా ఎక్సెల్ షీటులో పొందుపరచాలి. ఎల్‌టీసీజీని సులభంగా లెక్కించేందుకు ప్రభుత్వం మినహాయింపు కల్పించిన 2018 జనవరి 31 నాటి షేర్ల క్లోజింగ్ ధరలు, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు సంబంధించి ఎన్ఏవీలను నమోదు చేసి ఉంచుకోవాలి. దీంతో ఆ తర్వాత వచ్చిన లాభం నుంచి నాటి క్లోజింగ్ ధరలను మినహాయించి మిగిలిన లాభంపైనే పన్ను చెల్లించేందుకు వీలవుతుంది. వ్యాల్యూ రీసెర్చ్ వంటి కంపెనీలు ఉచితంగా పోర్ట్‌ఫోలియో ట్రాకర్ సేవలను అందిస్తున్నాయి. జనవరి 31 నాటి ధరల ఆధారంగా మీ పెట్టుబడులపై ఎల్‌టీసీజీని ఈ సంస్థల సాఫ్ట్‌వేర్ సులభంగా లెక్కించి చూపిస్తుంది.

స్టాక్స్‌లో లాభాల స్వీకరణ

2018 ఏప్రిల్ 1 నుంచి దీర్ఘకాలిక లాభాలపై 10 శాతం పన్ను అమల్లోకి వస్తుంది. లాభాలు అధికంగా ఆర్జించి ఉంటే కనుక, మార్చి 31లోపు వాటిని అమ్మేసి లాభాల స్వీకరణ చేయడం తెలివైన నిర్ణయమని పన్ను నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవేళ దీర్ఘకాలిక లాభం ఒక ఏడాదిలో రూ.లక్షలోపు ఉంటే లాభాల స్వీకరణ అవసరం లేదని బీడీవో ఇండియా పార్ట్‌నర్ అశ్రుజిత్ మండల్ పేర్కొన్నారు. ఒకవేళ మంచి లాభాలు ఆర్జించినప్పటికీ, చక్కని పనితీరు చూపించే స్టాక్స్ మీ పోర్ట్‌ఫోలియోలో ఉండి ఉంటే వాటిని మార్చి 31లోపు విక్రయించేసి, కొన్ని రోజుల తర్వాత ఏప్రిల్ వచ్చిన వెంటనే వాటిని కొనుగోలు చేసుకోవచ్చు. ''జనవరి 31 నాటి ధరల కంటే తక్కువకు ట్రేడ్ అవుతుంటే మంచి పనితీరు చూపిస్తున్న వాటిని విక్రయించక్కర్లేదు. ఎందుకంటే జనవరి 31 తర్వాత ఆయా షేర్ల ధరల పతనాన్ని స్వల్పకాలిక మూలధన నష్టంగా పన్ను అధికారులు పరిగణనలోకి తీసుకోరు. ఒకవేళ మీ పోర్ట్‌ఫోలియోలోని దీర్ఘకాలిక షేర్లు (ఏడాది దాటినవి) కొనుగోలు ధరల కంటే తక్కువకు ట్రేడ్ అవుతుంటే వాటిని ఏప్రిల్ 1 వరకు వేచి ఆ తర్వాత విక్రయించుకోవడం వల్ల వచ్చే నష్టాలను దీర్ఘకాలిక లాభాల నుంచి తగ్గించి చూపించుకోవచ్చు'' అని క్వికో డాట్ కామ్ వ్యవస్థాపకుడు విశ్వజిత్ సొనంగర తెలిపారు.

పన్ను రిటర్నులు

ఒకేసారి వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాల రిటర్నులు దాఖలు చేసే అవకాశం ఇక మీదట ఉండదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి గడిచిన అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించే రిటర్నులు దాఖలు చేయగలరు. అంటే 2015–16, 2016–17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నుల దాఖలుకు ఈ మార్చి 31 వరకే అవకాశం. రిటర్నులకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా గానీ జూలై 31లోపు వాటిని దాఖలు చేసి అవసరమైతే మార్చి 31లోపు సవరించిన రిటర్నులు దాఖలు చేసుకోవచ్చని విశ్వజిత్ సొనంగర తెలిపారు. రిటర్నులు ఆలస్యం అయితే నష్టాల పరిగణింపు పరంగా సమస్య ఎదురవుతుంది. ఒకవేళ పెట్టుబడులపై నష్టాలు వస్తే, ఆ మేరకు మినహాయింపు పొందాలంటే సకాలంలో రిటర్నులు ఫైల్ చేయాలి. లేదంటే వాటిని తదుపరి ఆర్థిక సంవత్సరానికి బదలాయించుకోవాల్సి వస్తుంది.



పోర్ట్‌ఫోలియో సమీక్ష

మీ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను ఏడాదికోసారి, ఆరు నెలలకోసారి సమీక్షించుకోవాలని నిపుణుల సూచన. ఆ సమీక్షకు అనుగుణంగా నూతన ఆర్థిక సంవత్సరం నుంచి చర్యలు తీసుకోవాలి. . కేవలం పోర్ట్‌ఫోలియో మార్పునకే సమీక్ష అవసరమని భావించ కూడదు. మీరు వివి ధ సాధనాలకు చేసిన కేటాయింపుల్లో వ్యత్యాసాన్ని గమనించాలి. స్టాక్ మార్కెట్ గడిచిన రెండేళ్ల కాలంలో ర్యాలీ చేసి ఉన్నందున ఈక్విటీల్లో పెట్టుబడుల విలువ అధికమైతే ఆ మేరకు పోర్ట్‌పోలియోలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది.

పన్ను ప్రణాళిక

పన్ను ఆదాకు సంబంధించిన పెట్టుబడులు అనేవి ఆర్థిక సంవత్సరం చివర్లో చూసుకుందాంలేనని చాలా మంది అనుకుంటుంటారు. చివర్లో తమకు సరిపోలని సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఈ విధమైన తప్పుడు నిర్ణయాలకు అవకాశం లేకుండా ఉండాలంటే పన్ను ఆదాకు సంబంధించిన పెట్టుబడులను ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే మొదలు పెట్టడం మేలు. ఇందు కోసం తొలుత పన్ను ఆదా కోసం ఎంత మేర ఇన్వెస్ట్ చేయాలన్న దానిపై స్పష్టతకు రావాలి. సెక్షన్ 80సీ కింద పిల్లల విద్యా ఫీజులు, గృహ రుణ అసలు చెల్లింపులు, బీమా పాలసీలపై ప్రీమియంకు పన్ను మినహాయింపు ఉంటుంది. ఒకసారి 80సీ కింద పన్ను ఆదాకు ఎంత విలువ మేర ఇన్వెస్ట్ చేయాలో నిర్ణయించుకుంటే, ఆ తర్వాత దేనికి ఎంత మేర అన్నది కేటాయింపులు చేయాలి. ఈక్విటీ కేటాయింపులు అయితే ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో సిప్ విధానంలో పెట్టుబడులు కొనసాగించాలి. ఆయా అంశాల్లో స్పష్టమైన అభిప్రాయానికి రావడానికి నిపుణుల సలహాలను తీసుకోవాలి.

వీపీఎఫ్ ఫండ్

ఇటీవల పీపీఎఫ్‌పై వడ్డీ రేటు తగ్గించినప్పటికీ (8.55 శాతం ప్రస్తుతం) వడ్డీ రేటు ఇప్పటికే ఎక్కువగానే ఉన్నట్టు. రాజకీయ పరమైన కారణాలతో ఈపీఎఫ్‌పై వడ్డీ రేటు మిగిలిన సాధనాల కంటే ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. కనుక ఈపీఎఫ్ చందాదారులు అదనంగా వాలంటరీ ప్రావిడెంట్ ఫండ్ ఆప్షన్ ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. దీనిపైనా ఈపీఎఫ్ వడ్డీ రేటే అమలవుతుంది. అయితే చాలా కంపెనీలు ఆర్థిక సంవత్సరం మొదట్లోనే ఇందుకు అనుమతిస్తాయనే విషయన్ని గుర్తుంచుకోవాలి.



పేటీఎం ఖాతాదారులకు స్వల్పకాలిక రుణాలు..

మొబైల్ చెల్లింపుల సంస్థ పేటీఎం తాజాగా తమ యూజర్లకు స్వల్పకాలికంగా స్వల్పమొత్తాల రుణాలను సమకూర్చేందుకు ఐసీఐసీఐ బ్యాంకుతో జతకట్టింది. పేటీఎం–ఐసీఐసీఐ బ్యాంక్ పోస్ట్‌పెయిడ్ పేరిట ఈ సర్వీసు అందించనుంది. ఈ ఒప్పందం కింద.. బిల్లుల చెల్లింపులు, ఫ్లయిట్... సినిమా టికెట్స్ బుక్ చేసుకోవడం మొదలైన వాటి కోసం పేటీఎం ఖాతా ద్వారా ఐసీఐసీఐ బ్యాంకు నుంచి డిజిటల్ క్రెడిట్ పొందవచ్చు. ఈ రుణమొత్తంపై 45 రోజుల దాకా వడ్డీ ఉండదు. రుణంగా తీసుకున్న మొత్తాన్ని 45 రోజుల్లోగా కట్టేస్తే.. వడ్డీ ప్రసక్తి ఉండదు. ఒకవేళ గడువు దాటితే రూ. 50 లేట్ ఫీజుతో పాటు 3 శాతం వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది. రుణపరిమితి రూ. 3,000 నుంచి రూ. 10,000 దాకా ఉంటుంది. ఒకవేళ తీసుకున్న రుణమొత్తాన్ని సక్రమంగా చెల్లిస్తూ మంచి ట్రాక్ రికార్డు ఉంటే.. రూ. 20,000 దాకా లిమిట్ పెంచుకోవచ్చు.

రూ.20 లక్షల దాకా పన్ను రహిత గ్రాట్యుటీ

ఉద్యోగులకు ఊరటనిచ్చే దిశగా పన్ను మినహాయింపు వర్తించే గ్రాట్యుటీ మొత్తాన్ని పెంచే బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రూ. 10 లక్షలుగా ఉన్న పరిమితిని రూ. 20 లక్షలకు పెంచింది. ఇప్పటిదాకా గ్రాట్యుటీ మొత్తం రూ. 10 లక్షలు దాటిన పక్షంలో పన్నులు వర్తించేవి. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తర్వాత ఈ పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ (సవరణ) బిల్లు 2018.. అమల్లోకి వస్తుంది. పదిమంది పైగా సిబ్బంది ఉన్న సంస్థలో నిరాటంకంగా అయిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు గ్రాట్యుటీ వర్తిస్తుంది. సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఏడాదికి పదిహేను రోజుల జీతం గ్రాట్యుటీ కింద పొందవచ్చు.



మనం ఎంత సంపాదిస్తున్నామన్నది కాదు ముఖ్యం.
సంపాదనలో ఎంత దాచిపెడుతున్నాం అన్నది ముఖ్యం.
- రాబర్ట్ కియోసాకి



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలన్స్‌డ్ ఫండ్

ఆటుపోట్లలోనూ స్థిరమైన రాబడులు

స్టాక్ మార్కెట్ అంటేనే తీవ్ర హెచ్చుతగ్గులు, ఆటుపోట్లు!!. ఈ తరహా పరిస్థితులు నచ్చని వారు ఒకింత స్థిరత్వంతో కూడిన పెట్టుబడి సాధనాల వైపు చూస్తారు. అలాంటి వారు తప్పక పరిశీలించాల్సిన పథకాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలన్స్‌డ్ ఫండ్ ఒకటి. ఇది పూర్తిగా ఈక్విటీ మార్కెట్‌పై ఆధారపడే పథకం కాదు. అలాగని అధిక రాబడులిచ్చే ఈక్విటీకి దూరంగానూ ఉండదు. అటు ఈక్విటీ రాబడులు, ఇటు డెట్ (బాండ్లు) నిలకడను కలిపి ఇన్వెస్టర్ల పెట్టుబడులపై స్థిరమైన రాబడులను అందించే దిశగా ఇది పనిచేస్తుంది. పథకం నిర్వహణ పరిధిలోని మొత్తం పెట్టుబడుల్లో 35 శాతం వరకు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది.

పెట్టుబడుల విధానం, పనితీరు



2011, 2013, 2015, 2016 సంవత్సరాల్లో మార్కెట్ల అస్థిరత సమయాల్లో పోటీ పథకం హెచ్‌డీఎఫ్‌సీ ప్రుడెన్స్ ఫండ్‌తో పోలిస్తే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలన్స్‌డ్ ఫండ్ మెరుగైన రాబడులను అందించింది. కారణం ఆయా సమయాల్లో ఈక్విటీ పెట్టుబడులను సాధ్యమైనంత తక్కువ స్థాయికి పరిమితం చేయడం వల్లే. 2014, 2017లో మార్కెట్ ర్యాలీల్లోనూ చక్కని రాబడులను అందించింది. మిడ్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా అధిక రాబడులను పంచింది. 2014లో ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో 40 శాతం వరకు స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్‌నే కొనసాగించింది. అలాగే, అదే ఏడాది ప్రభుత్వ సెక్యూరిటీలకు తగినంత నిధులు కేటాయించడం ద్వారా డెట్ విభాగంలోనూ మెరుగైన రాబడులను రాబట్టింది. ఇటీవలి కాలంలో బాండ్ ఈల్డ్స్ 6.6 శాతం నుంచి 7.6 శాతానికి



పెరిగిపోవడం, తీవ్ర అనిశ్చితి నేపథ్యంలో దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు తగ్గించుకుని కార్పొరేట్ బాండ్లకు పెట్టుబడులను మళ్లించింది. ఇక ఇటీవలి ఈక్విటీ మార్కెట్ల భారీ ర్యాలీతో మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ వ్యాల్యూషన్లు విపరీతంగా పెరిగిపోవడంతో వాటిలో ఎక్స్‌పోజర్ తగ్గించుకుంది. తాజాగా వీటిలో కేవలం 11 శాతం పెట్టుబడులనే కలిగి ఉంది. ఈ విధమైన పెట్టుబడి

టాప్ హోల్డింగ్స్

స్టాక్ పేరు	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	6.57
ఇన్ఫోసిస్	3.97
హెచ్‌డీఎఫ్‌సీ	3.50
ఐసీఐసీఐ బ్యాంకు	3.40
ఐటీసీ	3.30
ఎల్అండ్‌టీ	3.15
అరబిందో ఫార్మా	2

వ్యూహాలను అనుసరించడం ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలన్స్‌డ్ ఫండ్ ఈ కేటగిరీకి మించి ఏడాది, మూడేళ్లు, ఐదేళ్ల కాలంలో అధిక రాబడులను అందించింది.

ఈ రంగాలకు ప్రాధాన్యం

బ్యాంకింగ్ రంగానికి అగ్ర ప్రాధాన్యం ఇస్తోంది. ఈ రంగానికి చెందిన షేర్లలో 20 శాతం పెట్టుబడులను కలిగి ఉంది. హెచ్‌డీఎఫ్‌సీబ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్‌బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకులు పోర్ట్‌ఫోలియోలో ఉన్నాయి. కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులు, సాఫ్ట్‌వేర్, కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్స్ రంగాల పట్ల కూడా ఆశావహంగా ఉంది. ఏడాది కాలంలో ఈ పథకం 15.4 శాతం రాబడి అందించింది. మూడేళ్ల కాలంలో 10.1 శాతం, ఐదేళ్ల కాలంలో 18.4 శాతం, పదేళ్లలో 16 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇచ్చింది.

వాణిజ్య యుద్ధంలో ఎల్లో మెటల్ మెరుపు

అమెరికా ప్రారంభించిన వాణిజ్యయుద్ధం పసిడికి బలంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే బుధవారం అమెరికన్ ఫెడరల్ రిజర్వ్.. వడ్డీ రేట్లను పావు శాతం మేర పెంచింది. దీంతో వడ్డీ రేట్ల శ్రేణి 1.5 శాతం- 1.75 శాతానికి చేరింది. ఈ ఏడాది ఇది తొలి విడత పెంపు కాగా.. మరో రెండు దఫాలు పెంచే అవకాశాలున్నట్లు సంకేతాలిచ్చింది. నిజానికి ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సంకేతం కాబట్టి బుల్ ధోరణిలో ఉన్న పసిడి కొంత వెనక్కు తగ్గాలి. అయితే ఇదేమీ పట్టించుకోకుండా పసిడి శుక్రవారంతో ముగిసిన వారంలో ఏకంగా 33 డాలర్లు ఎగసింది. 1,347 డాలర్ల వద్ద ముగిసింది. ఒకేవారం పసిడి ఈ స్థాయిలో పెరగడం రెండేళ్లలో ఇదే తొలిసారి. 1,360 డాలర్లను తాకిన పసిడి 17తో ముగిసిన శుక్రవారం ముందు నాలుగు వారాలుగా తగ్గుతూ వచ్చి, 1,314 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. ఫెడ్ నిర్ణయం నేపథ్యంలో పైకి ఉరుకుతుందనుకున్న డాలర్ ఇండెక్స్ వారం వారీగా 90.17 నుంచి 89.10కి చేరింది.

- వారంలో 33 డాలర్లు పెరుగుదల
- ‘బుల్’ వేగంపై సానుకూల అంచనాలు



ఏడాది మధ్యలో 1,400 డాలర్లపైకి

ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి అమెరికా-చైనాల మధ్య తీవ్రమైన వాణిజ్యయుద్ధం, దీనికి తోడు అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలూ పసిడి సమీప భవిష్యత్తులో బలంగా ఉండేందుకు దోహదపడే అంశమని నిపుణుల విశ్లేషణ. ఈ ఏడాది మధ్యలో పసిడి 1,400 డాలర్లపైకి పెరుగుతుందన్నది తమ అంచనా అని డైలీఫారెక్స్.కామ్‌లో కరెన్సీ వ్యూహకర్త చిరిస్టోఫర్ వికిహో పేర్కొన్నారు. వాణిజ్య యుద్ధం, బలహీన డాలర్ మాత్రమే కాకుండా, పెరుగుతున్న అమెరికా ప్రభుత్వ రుణ భారాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. కాగా ప్రస్తుతం ఉన్న వాణిజ్యయుద్ధం ఉద్రిక్తత తగ్గితే మాత్రం పసిడి ప్రస్తుత స్థాయి నుంచి 40 డాలర్లు పడే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆందోళనలు కొనసాగితే, పెరుగుదల అపరిమితంగా ఉంటుందన్నది తమ అభిప్రాయమని వారు తెలిపారు. ఆయా ప్రభావ అంశాల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో పసిడి 1,250 డాలర్లు - 1,400 డాలర్ల స్థాయిలోనే తిరిగే అవకాశం ఉందన్నది నిపుణుల అభిప్రాయం. 1,300, 1,270, 1,240 డాలర్ల వద్ద పసిడికి పటిష్ట మద్దతు ఉందని వారు పేర్కొంటున్నారు. ఇక ఎగువస్థాయిలో తక్షణ నిరోధం 1,365 డాలర్లు.

దేశంలోనూ లాభాలు

అంతర్జాతీయంగా పసిడి బలోపేతం, దేశీయంగా డాలర్ మారకంలో రూపాయి వారం వారీగా దాదాపు అక్కడక్కడే ఉండడం (65.02) వంటి అంశాలు దేశీయంగా పసిడి పెరుగుదలకు దోహదపడ్డాయి. వారంలో ఫ్యూచర్స్ మార్కెట్- మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో 10 గ్రాముల ధర రూ. 683 పెరిగి రూ.30,907కి చేరింది. ఇక దేశీయంగా ముంబై ప్రధాన మార్కెట్‌లో పసిడి వారం వారీగా 99.9 స్వచ్ఛత ధర రూ. 375 పెరిగి రూ.30,835కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా అదే స్థాయిలో ఎగసి రూ. 30,685కు చేరింది. వెండి కేజీ ధర రూ. 190 లాభంతో రూ.38,465కి పెరిగింది.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, 2018 మార్చి 23 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.5	6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.35	6.70	6.70
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.30
కెనరా బ్యాంక్	6.35	6.50	6.20
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6.25	6.70	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7.15	7. 25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.25	6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6.50	6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6.50	6.75	6.50
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	6.25	6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.7	7.00	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.7	6.90	6.50
ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.50	6.60	6.40
ఎస్‌బీఐ	6.40	6.40	6.50
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.60

బ్యాంక్ బజార్. కామ్ అందించిన వివరాల ఆధారంగా...

స్టాక్స్ వ్యూ

సన్ ఫార్మా — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: షేర్‌ఖాన్

ప్రస్తుత ధర: రూ.502; టార్గెట్ ధర: రూ.600

ఎందుకంటే: దేశీయ దిగ్గజ ఫార్మా కంపెనీల్లో ఒకటైన సన్ ఫార్మా షేర్ ఇటీవల బాగానే పతనమైంది. సంస్థ 52 వారాల కనిష్ట-గరిష్ట స్థాయిలు రూ.432.70-రూ.709.65. తాజాగా ఈ కంపెనీకి చెందిన హలోల్ ప్లాంట్‌పై మళ్లీ తనిఖీ నిర్వహించిన అమెరికా ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) మూడు అభ్యంతరాలను వెలిబుచ్చింది. ప్లాంట్ పరికరాలు, ఉద్యోగుల శిక్షణ, ఇంక్యుబేషన్ టెంపరేచర్ వంటి అంశాలపై ఈ అభ్యంతరాలు... సహజమైన విషయాలే కాబట్టి, వీటిని సులభంగా పరిష్కరించవచ్చు. 2016 నాటి తనిఖీలో అమెరికా ఎఫ్‌డీఏ వ్యక్తం చేసిన తొమ్మిది పరిశీలనలతో పోల్చితే తాజా పరిశీలనలు మూడో వంతుకు తగ్గాయి. ఇది కంపెనీకి ఊరటనిచ్చే విషయం. ఈ సమస్యలు సమసిపోతే, ఈ ప్లాంట్ నుంచి ఈ కంపెనీ చాలా కాంప్లెక్స్ జనరిక్స్ ఔషధాలను అమెరికా మార్కెట్లో విడుదల చేయగలుగుతుంది. అంతేకాక అమెరికా మార్కెట్లో ప్రస్తుతమున్న ఔషధాలను పునర్వ్యవస్థీకరించగలుగుతుంది. ఈ ప్లాంట్‌కు క్లియరెన్స్ పొందలేకపోతే, ఔషధాల ఆమోదాల్లో జాప్యం కారణంగా ఈ కంపెనీ చాలా మంచి అవకాశాలను కోల్పోతుంది. మరోవైపు ఇదే ప్లాంట్‌పై 2015లో జారీ అయిన వార్నింగ్ లెటర్ సంబంధిత సమస్యలు కూడా తొలగిపోతాయని మేం భావిస్తున్నాం.

కరూర్ వైశ్యాబ్యాంక్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: సెంట్రమ్

ప్రస్తుత ధర: రూ.99; టార్గెట్ ధర: రూ.123

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్లో రికవరీ కనిపించినా, మూడో క్వార్టర్లో మాత్రం ఈ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉన్నాయి. అయితే రుణాలు 17 శాతం వృద్ధి చెందడం గమనించదగ్గ అంశం. 2015-17 క్యూ2 తర్వాత రుణ వృద్ధి ఇంత అధికంగా ఉండడం ఇదే మొదటిసారి. స్థూల మొండి బకాయిలు 1 శాతం పెరిగి 6 శాతానికి, నికర మొండి బకాయిలు 0.6 శాతం వృద్ధితో 3.88 శాతానికి పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం ఫ్లాట్‌గా 8.5 శాతంగా నమోదైంది. ఇతర ఆదాయం 32% వృద్ధి చెందడంతో కేటాయింపులకు ముందు లాభం 28% ఎగిసింది. కేటాయింపులు పెరగడంతో నికర లాభం 38% తగ్గిపోయింది. వ్యాపారం 9% వృద్ధితో రూ.1,01,955 కోట్లకు పెరిగింది. డిపాజిట్లు 4% వృద్ధితో రూ.16,024 కోట్లకు ఎగిశాయి. మొండి బకాయిలు పెరుగుతున్నాయని, రానున్న రెండు క్వార్టర్లూ బలహీనంగా ఉంటాయని బ్యాంక్ అంటోంది. లాభదాయకత తక్కువ స్థాయిలో ఉండొచ్చు. భవిష్యత్తులో మొత్తం రుణాల్లో చిన్న స్థాయి రిటైల్ రుణాలు 70-80% మేర పెంచుకోవాలనేది బ్యాంక్ లక్ష్యం. ఫలితంగా రుణ డిఫాల్ట్‌లు తగ్గుతాయని, మొండి బకాయిల పరిస్థితి మెరుగుపడుతుందని బ్యాంక్ భావన. రెండేళ్లలో వ్యాపారం 18% చొప్పున చక్రగతి వృద్ధితో రూ.1,48,338 కోట్లకు పెరుగుతాయని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

ఫండ్స్ చార్జీల తగ్గింపుపై సెబీ దృష్టి



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మ్యూచువల్ ఫండ్స్ చార్జీల తగ్గింపుపై దృష్టి సారించింది. అడిషనల్ ఎక్స్‌పెన్సెస్ పేరుతో వసూలు చేస్తున్న చార్జీలను 15 బేసిస్ పాయింట్ల (0.15 శాతం) మేర తగ్గించే ఆలోచనతో ఉంది. దీని ద్వారా మ్యూచువల్ ఫండ్ పథకాలు మరింత మంది ఇన్వెస్టర్లకు చేరువ అవుతాయని భావిస్తోంది. మ్యూచువల్ ఫండ్స్ చార్జీలపై సెబీ అంతర్గతంగా ఓ అధ్యయనం నిర్వహించింది. దీని ప్రకారం 15 బేసిస్ పాయింట్లు తగ్గించాలన్న ప్రతిపాదన వచ్చింది. దీనిపై ఈ వారంలో జరగనున్న సెబీ బోర్డు సమావేశంలో చర్చించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రతిపాదన ప్రకారం అన్ని రకాల మ్యూచువల్ ఫండ్ పథకాలపై అడిషనల్ ఎక్స్‌పెన్సెస్‌ను 20 బేసిస్ పాయింట్ల నుంచి 5 బేసిస్ పాయింట్లకు తగ్గించనున్నట్టు, ప్రతీ రెండేళ్లకోసారి దీన్ని సమీక్షించనున్నట్టు ఆ వర్గాలు అందించిన సమాచారం. ఎగ్జిట్‌లోడ్స్‌కు బదులుగా మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు తమ నిర్వహణలోని ఆస్తులపై 20 బేసిస్ పాయింట్ల మేర అడిషనల్ ఎక్స్‌పెన్స్‌ను వసూలు చేసుకునేందుకు సెబీ 2012లో అనుమతించింది. నిజానికి ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ, బ్యాలన్స్‌డ్ ఫండ్ పథకాల ఇన్వెస్టర్లకు దీని వల్ల అదనపు భారం పడింది. పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు ఎగ్జిట్ లోడ్ 5 బేసిస్ పాయింట్లుగానే ఉండేది. దీనికి బదులు 20 బేసిస్ పాయింట్లు వసూలు చేసుకునేందుకు అనుమతించడంతో అదనపు భారం పడింది. మరోవైపు ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ సమాచార వెల్లడికి సంబంధించి నియంత్రణ పరమైన కార్యాచరణను సవరించడంపైనా సెబీ దృష్టి సారించింది. తద్వారా రోజువారీగా టోటల్ ఎక్స్‌పెన్స్ చార్జీలను వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా వెల్లడించాల్సి ఉంటుంది.



బొమ్మ-బొరుసు

> ఖర్చు చేయగా మిగిలింది పొదుపు చేయడం కాదు.
> పొదుపు చేయగా మిగిలింది ఖర్చు చేయడం ముఖ్యం.
> *- వారెన్ బఫెట్*





శ్లోకా మెహతాకు స్వీట్ తినిపిస్తున్న ముకేశ్ అంబానీ

ఆకాశ్ అంబానీ పెళ్లి డిసెంబర్‌లో!!

- గోవాలో కలుసుకున్న ఇరు కుటుంబాలు
- నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు..!

న్యూఢిల్లీ: దేశీ కార్పొరేట్ దిగ్గజం ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ త్వరలోనే పెళ్లిపీటలు ఎక్కనున్నారు. స్కూల్లో తనతో కలిసి చదువుకున్న వజ్రాల వ్యాపారి రసెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతాతో ఆకాశ్ వివాహం ఈ ఏడాది డిసెంబర్ నెల మొదట్లో జరగనుందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పెళ్లి గురించి మాట్లాడుకోవడం కోసం ఇరు కుటుంబాలు, సన్నిహితులు తాజాగా(ఈ నెల 24న) గోవాలోని ఒక ఫైవ్‌స్టార్ రిసార్ట్‌లో కలుసుకున్నట్లు సమాచారం. అయితే, నిశ్చితార్థం కూడా జరిగినట్లు వార్తలొస్తున్నాయి. గోవా కార్యక్రమానికి సంబంధించి ముకేశ్, రసెల్ మెహతా కుటుంబ సభ్యుల ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో ఆకాశ్, శ్లోకా చేతిలో చేయివేసి నిలుచున్న ఫొటో, శ్లోకాకు ముకేశ్ అంబానీ స్వీట్ తినిపిస్తున్న ఫొటో కూడా ఉంది. కార్యక్రమానికి ముకేశ్, నీతా అంబానీలతో పాటు ఆకాశ్ నాన్నమ్మ కోకిలాబెన్ కూడా హాజరయ్యారు.కాగా, వివాహ ఉత్సవాలు 4–5 రోజుల పాటు ఉంటాయని, డిసెంబర్ 8–12 మధ్య ముంబైలోని ఒబెరాయ్ హోటల్ ఇందుకు వేదికయ్యే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, అధికారికంగా ఇరు కుటుంబాల నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

రోజీ బ్లూ డైమండ్స్ అధిపతి రసెల్ మెహతా కుమార్తె శ్లోకా మెహతా, ఆకాశ్‌లు ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో కలిసి చదువుకున్నారు. ఇరు కుటుంబాలకు చాలా ఏళ్లుగా మంచి సాన్నిహిత్యం ఉంది. ముకేశ్ అంబానీకి ముగ్గురు సంతానం. వీరిలో కుమార్తె ఈషా, ఆకాశ్‌లు కవలలు. ఇక చిన్న కుమారుడు అనంత్ అంబానీ. ఆకాశ్ ఇప్పటికే రిలయన్స్ టెలికం వెంచర్ జియో డైరెక్టర్ల బోర్డులో ఉన్నారు. రసెల్, మోనా మెహతాలకు ముగ్గురు సంతానం కాగా, శ్లోకా చిన్న కుమార్తె. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో ఆంత్రపాలజీ డిగ్రీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో న్యాయ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేశారు. స్వచ్ఛంద సంస్థలకు వాలంటీర్లను అందించే కనెక్ట్‌ఫర్ అనే సంస్థకు ఆమె సహ-వ్యవస్థాపకురాలు. కాగా శ్లోకా తల్లి మోనా మెహతాతో పీఎన్‌బీ రుణ కుంభకోణం ప్రధాన నిందితుడు నీరవ్ మోదీకి బంధుత్వం ఉన్నట్లు సమాచారం.



గోవా రిసార్ట్‌లో ఆకాశ్ అంబానీతో శ్లోకా మెహతా

ఎస్‌టీసీ, ఎంఎంటీసీ విలీనానికి అవకాశం

కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎస్‌టీసీ, ఎంఎంటీసీ కంపెనీలను విలీనం చేసే అవకాశం ఉందని, ప్రస్తుతం ఈ అంశం పరిశీలనలో ఉన్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు తెలిపారు. ఎస్‌టీసీ నష్టాల్లో కూరుకుపోవడం దురదృష్టకరమన్న ఆయన, ఇప్పటికే కొన్ని చర్యలు చేపట్టామని, విలీన అంశం పరిశీలినలో ఉందని చెప్పారు. కేంద్ర వాణిజ్య శాఖ పరిధిలో ఎస్‌టీసీ, ఎంఎంటీసీతో పాటు ప్రాజెక్ట్ అండ్ ఎక్విప్‌మెంట్ కార్పొరేషన్ (పీఈసీ) పనిచేస్తున్నాయి. స్వేచ్ఛాయుత వాణిజ్య విధానాల ప్రవేశంతో ఇవి తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో వీటిని ఒక్కటి చేద్దామన్న ప్రతిపాదన ఉంది.

వాటా విక్రయ నిధులతో పీఎస్‌యూల పునరుద్ధరణ

పార్లమెంటరీ ప్యానల్ సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగం కంపెనీల్లో వాటాల విక్రయం ద్వారా వచ్చే నిధుల్లో కొంత భాగాన్ని, లాభాల బాట పట్టడానికి అవకాశం ఉండి నష్టాల్లో ఉన్న పీఎస్‌యూల పునరుద్ధరణకు కేటాయించాలని పార్లమెంటరీ ప్యానల్ సిఫారసు చేసింది. ఎంపిక చేసిన పీఎస్‌యూలు భవిష్యత్తులో నిలదొక్కుకునేందుకు వీలుగా ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అభిప్రాయపడింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థల్లో (పీఎస్‌యూ) వాటాల విక్రయం ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ కూడా ఇందులో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 26-3-2018

విజయవాడ	305-00
గోదావరి	305-00
విశాఖ	305-00
వరంగల్	302-00
చిత్తూరు	348-00
చెన్నై	355-00
ముంబై	340-00
నమక్కల్	345-00
25-3-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	300-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.60
బెంగళూరు	335-00
కోల్‌కతా	352-00
ఢిల్లీ	310-00

ప్రపంచ ట్రెండ్.. దిక్సూచి!

వాణిజ్య యుద్ధ భయాలతో ఒడిదుడుకులు
- ఈ వారం మార్కెట్‌పై విశ్లేషకుల అంచనా
- మార్కెట్ మూడురోజులే.. గురు, శుక్రవారాలు సెలవు

న్యూఢిల్లీ: సెలవుల కారణంగా మూడురోజులు మాత్రమే ట్రేడింగ్ జరిగే ఈ వారంలో మార్కెట్...ప్రపంచ సంకేతాలకు అనుగుణంగా కదులుతుందని విశ్లేషకులు చెపుతున్నారు. అమెరికా–చైనాల మధ్య తాజాగా తలెత్తిన వాణిజ్య యుద్ధం విస్తృతమవుతుందన్న భయాలు, మార్చి డెరివేటివ్ కాంట్రాక్టులు ముగియనుండటం వంటి అంశాల కారణంగా ఈక్విటీల్లో ఒడిదుడుకులు చోటుచేసుకుంటాయని వారు హెచ్చరిస్తున్నారు. మహవీర్ జయంతి, గుడ్‌ఫ్రైడే పండుగలతో వచ్చే గురు, శుక్రవారాల్లో (మార్చి 28, 29 తేదీలు)మార్కెట్‌కు సెలవుకాగా, డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు బుధవారమే (మార్చి 28) జరుగుతుంది. సాధారణంగా ప్రతీ నెలా చివరి గురువారం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ విభాగపు కాంట్రాక్టులు క్లోజ్‌చేయాల్సివుంటుంది.



వాణిజ్య యుద్ధంతో దెబ్బ...

చైనా దిగుమతులపై 60 బిలియన్ డాలర్ల విలువైన సుంకాలు విధించే ప్రతిపాదనకు సంబంధించిన ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత గురువారం సంతకాలు చేయగా, ఆ మర్నాడే అమెరికా దిగుమతులపై 3 బిలియన్ డాలర్ల మేర సుంకాల్ని విధిస్తున్నట్లు చైనా ప్రకటించడంతో అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు పెరిగాయని, దీంతో ఈక్విటీ మార్కెట్లు దెబ్బతింటున్నాయని మార్కెట్ నిపుణులు చెప్పారు. సమీప భవిష్యత్తులో ఈ తరహా రక్షణాత్మక విధానాలు మరిన్ని వుండవచ్చన్న ఆందోళన మార్కెట్లో నెలకొందని, ఈ విధానాలు ప్రపంచ ఆర్థికాభివృద్ధికి ఆటంకం కల్గిస్తాయని వారు వివరించారు. అమెరికా–చైనాల మధ్య తలెత్తిన ఈ వాణిజ్య యుద్ధ ప్రభావంతో గత వారం భారత్‌తో సహా ప్రపంచ ప్రధాన మార్కెట్లన్నీ పతనమయ్యాయి. గత గురు, శుక్రవారాల్లో అమెరికా సూచీలు 4 శాతం వరకూ క్షీణించాయి. ఇక్కడ సెన్సెక్స్ వారం మొత్తం మీద 579 పాయింట్లు కోల్పోయింది.

దేశీయ సమస్యలు కూడా...

అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశీయ సమస్యలు కూడా మన మార్కెట్‌ను పట్టిపీడిస్తున్నాయని విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఇక్కడి ఈక్విటీలు అధిక విలువల్ని కలిగివుండటం, ఎన్నికల ముందస్తు రాజకీయ అనిశ్చితి వంటి అంశాలతో ప్రపంచ మార్కెట్లతో పోలిస్తే భారత్ సూచీలు భారీగా తగ్గాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. అయితే ఇక్కడ ఫండ్స్‌లో రిడంప్షన్ల ఒత్తిడి తగ్గిందని, ఈ మార్చి నెలాఖరునాటికి పరిస్థితులు కుదుటపడతాయని అంచనావేస్తున్నామన్నారు. కానీ అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం తీవ్రతరమయ్యే అవకాశాలున్నందున, మార్కెట్లో కొద్దిరోజులపాటు హెచ్చుతగ్గులు చోటుచేసుకోవొచ్చని, ఈ వారం మార్కెట్‌కు రెండు రోజుల సెలవు దినాలుకావడం, డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు దగ్గరపడటం వంటి అంశాలతో ఒడిదుడుకులు పెరగవచ్చని ఆయన అన్నారు. వాణిజ్య యుద్ధ భయాలు, రాజకీయ వాతావరణం కారణంగా మధ్యకాలికంగా బుల్స్‌పై ఒత్తిడి వుండవచ్చని సామ్‌కో సెక్యూరిటీస్ సీఈఓ జిమిత్ మోది అంచనావేశారు.

క్యూఐపీ ద్వారా రూ.58,000 కోట్లు

ఏప్రిల్–జనవరి మధ్య కంపెనీల సమీకరణ

న్యూఢిల్లీ: దేశీయ కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల కాలంలో ఏప్రిల్ నుంచి జనవరి మధ్య రూ.58,520 కోట్లను సమీకరించాయి. అర్హత కలిగిన సంస్థాగత మదుపుదారులకు షేర్ల జారీ (క్యూఐపీ) ద్వారా ఈ స్థాయిలో నిధులను రాబట్టాయి. నిజానికి గతేడాది ఇదే కాలంలో క్యూఐపీ విధానంలో సమీకరించిన రూ.4,664 కోట్లతో పోలిస్తే 12 రెట్లు పెరిగినట్టు తెలుస్తోంది. 2016–17 పూర్తి ఏడాదిలో క్యూఐపీ నిధుల సమీకరణ రూ.8,464కోట్లను మించలేదు. దీంతో పోల్చి చూసినా గానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల్లో సమీకరణ ఏడు రెట్లు అధికంగా ఉంది. సెబీ తాజా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయాలు తెలుస్తాయి. వ్యాపార విస్తరణ, రుణాలు తీర్చివేయడం, మూలధన అవసరాలు, ఇతర కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీలు క్యూఐపీ బాటపట్టాయి. ఏప్రిల్–జనవరి మధ్య 41 కంపెనీలు క్యూఐపీ మార్గంలో వెళ్లగా, గతడేది ఇదే కాలంలో కేవలం 16 కంపెనీలే దీన్ని ఆశ్రయించాయి.



ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలి

ఎస్‌బీఐ ఒక్క దాన్ని మినహాయిస్తే చాలు
- ఈ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి
- నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా



న్యూఢిల్లీ: నీతిఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగరియా ప్రభుత్వరంగంలో ఎస్‌బీఐ మినహా మిగిలిన అన్ని బ్యాంకులను ప్రైవేటీకరించాలని గట్టిగా సూచించారు. 2019లో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉన్న అన్ని పార్టీలు ఈ అంశాన్ని ముందుగానే తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. కొలంబియా యూనివర్సిటీలో ప్రస్తుతం పనగరియా ఆర్థిక శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ప్రైవేటీకరణకు కుంభకోణాలు, మొండి బకాయిలు (ఎన్‌పీఏ) పెరిగిపోవడం అన్న ఒక్క కారణం చాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి పీఎన్‌బీ రూ.13,000 కోట్ల కుంభకోణం నేపథ్యంలో పనగరియా ఇలా స్పందించారు. భారీ స్థాయిలో డిపాజిట్లు ఉండి కూడా సమర్థతలేమితో మార్కెట్ విలువను కోల్పోతున్నందున ప్రభుత్వరంగ బ్యాంకుల్లో కేంద్రం తన కున్న వాటాను వదిలిపెట్టుకోవాలని పనగరియా సూచించారు. రుణ అవసరాలను తీర్చే సామాజిక లక్ష్యాల కోసం ప్రభుత్వరంగంలో రెండు డజన్ల బ్యాంకులు ఉండాలని వాదించడం అసమంజసంగా ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు రంగ బ్యాంకులు ప్రాధాన్య రంగాలకు రుణాలందిస్తూనే మెరుగ్గా పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

వాణిజ్య విధానాన్ని సరళించడమే మార్గం

ఇటీవలి వాణిజ్య ఘర్షణలు, భారత్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యంగా చేసుకుని మాట్లాడడంపై పనగరియా స్పందిస్తూ... భారత సరుకులకు అమెరికా ద్వారాలు మూయకముందే భారత్ తన వాణిజ్య విధానాన్ని మరింత స్వేచ్ఛాయుతంగా మార్చేందుకు వెనుకాడరాదని సూచించారు.

వాణిజ్య యుద్ధంతో భారత్‌కు దెబ్బ!



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమైతే భారత్‌పై ప్రతికూల ప్రభావం ఉంటుందని, ముఖ్యంగా ఎగుమతులు దెబ్బతింటాయని పారిశ్రామిక మండలి అసోచామ్ పేర్కొంది. 'ఇప్పుడు మొదలైన వాణిజ్య యుద్ధం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తే, భారత్ ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లుతుంది. ఎగుమతులు పడిపోవడంతోపాటు కరెంట్ అకౌంట్ లోటు(క్యాడ్) ఎగబాకేందుకు దారితీయొచ్చు. దీంతో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటు దిగజారే ప్రమాదం ఉంటుంది' అని అసోచామ్ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా మొదలుపెట్టిన ఈ రక్షణాత్మక చర్యలతో భారత్‌లో కూడా ఆర్థికపరమైన సెటిమెంట్ తీవ్రంగా దెబ్బతింటుందని అభిప్రాయపడింది. ఒకవేళ భారత్ కూడా దిగుమతులపై ఇలాంటి ప్రతిచర్యలకు దిగితే... ఎగుమతులపై ప్రభావం పడుతుందని, విదేశీ మారకం రేట్లలో తీవ్ర కుదుపులను చవిచూడాల్సి వస్తుందని పేర్కొంది. ఈ ముప్పునుంచి తప్పించుకోవడం కోసం ఒక నిర్దిష్ట ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ రక్షణాత్మక చర్యల ప్రభావం నుంచి తప్పించుకోవడం కోసం కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని అభిప్రాయపడింది. మన క్యాపిటల్ మార్కెట్లో ఇన్వెస్టర్ల విశ్వాసం దెబ్బతింటే.. పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తిరోగమన బాటపడతాయని.. దీనివల్ల డాలరుతో రూపాయి మారకం విలువపై తీవ్ర ప్రతికూలత తప్పదని అసోచామ్ పేర్కొంది.

ఐదేళ్లలో టెలికం రంగంలో కోటి ఉద్యోగాలు

టెలికం రంగ నైపుణ్య మండలి అంచనా

న్యూఢిల్లీ: టెలికం పరిశ్రమలో ఇటీవలి కాలంలో జియో రాక తర్వాత భారీ స్థిరీకరణతో ఉద్యోగాలకు నష్టం ఏర్పడగా, వచ్చే ఐదేళ్లలో మాత్రం ఏకంగా కోటి ఉద్యోగాల కల్పన జరుగుతుందని టెలికం రంగ నైపుణ్య మండలి అంటోంది. ''టెలికం రంగంలో 40 లక్షల మందికి ఉపాధి పొందుతున్నారు. ఐదేళ్ల తర్వాత టెలికంలో, టెలికం రంగ తయారీలోనూ కలిపి ఉపాధి పొందే వారి సంఖ్య 1.43 కోట్లు ఉంటుంది'' అని టెలికం రంగ నైపుణ్య మండలి (టీఎస్ఎస్‌సీ) సీఈవో ఎస్‌పి కొచర్ తెలిపారు. జాతీయ నైపుణ్య శిక్షణ కార్పొరేషన్ పరిధిలో టీఎస్ఎస్‌సీ పనిచేస్తోంది. మెషిన్ నుంచి మెషిన్ మధ్య సమాచారం, టెలికం తయారీ, మౌలిక సదుపాయలు, సేవల విభాగాల్లో ఉద్యోగాలకు డిమాండ్ ఏర్పడుతుందని తాము అంచనా వేస్తున్నట్టు కొచర్ చెప్పారు. తయారీ రంగ అవకాశాలు భారత్‌కు వస్తున్నాయని, దీంతో టెలికం రంగంలో ఉపాధి అవకాశాలపై ఎక్కువ ఆశాభావంతో ఉన్నట్టు పేర్కొన్నారు.

ఎల్‌టీసీజీ ఉన్నా ఈక్విటీ ఫండ్స్ ఓకే!!

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ–లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్) మళ్లీ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచిదేనా?

- పరిమళ, సికింద్రాబాద్

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ–లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్) మళ్లీ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం మంచిదే. ఈ ఫండ్స్ తమ మొత్తం నిధుల్లో ఈక్విటీల్లో మూడో వంతు, ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లో మరో మూడో వంతు, ఫిక్స్‌డ్–ఇన్‌కమ్ సాధనాల్లో మరో మూడో వంతు చొప్పున ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ ఫండ్స్‌లో ఏడాదికి మించి మీ ఇన్వెస్ట్‌మెంట్స్ కొనసాగితే మీరు పొందే రాబడులపై 10 శాతం మేర పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫండ్స్ నుంచి సిస్టమేటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ద్వారా మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకుంటే అది మరింత అర్థవంతంగా ఉంటుంది. ఈక్విటీలో పెట్టిన మూడో వంతు పెట్టుబడిని రీ–బ్యాలెన్సింగ్‌కు వినియోగిస్తారు. దీనిపై ఎలాంటి పన్ను భారాలూ ఉండవు. అందుకని ఈక్విటీ సేవింగ్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడం కొనసాగించవచ్చు. దీంట్లో గ్రోత్ ప్లాన్‌ను ఎంచుకోవాలి. సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) ద్వారా మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకోవాలి. రోజులు గడిచే కొద్దీ, ద్రవ్యోల్బణం కారణంగా ఈ ఈక్విటీ సేవింగ్స్ స్కీమ్స్ ఆకర్షణ కోల్పోవచ్చు. పెట్టుబడి సంబంధిత కేటాయింపులు కారణంగా వీటికి మాత్రం ప్రాధాన్యత తగ్గదనే చెప్పవచ్చు.

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు ఇచ్చే డివిడెండ్లపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) విధించారు కదా! ఈ సందర్భంలో డివిడెండ్ ప్లాన్‌ను ఎంచుకోవాలా ? లేకుంటే గ్రోత్ ఆప్షన్‌లో ఇన్వెస్ట్ చేయాలా?

- సుధాకర్, విజయవాడ

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అందించే డివిడెండ్లపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) విధించిన నేపథ్యంలో గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకోవడమే ఉత్తమం. డీడీటీ విధింపుకు ముందు కూడా గ్రోత్ ప్లాన్‌లే ఆకర్షణీయంగా ఉండేవి. చాలా ఈక్విటీ ఫండ్స్ ఇచ్చే డివిడెండ్‌లను పరిశీలిస్తే, ఆయా ఫండ్ల డివిడెండ్ ఈల్డ్ ఆరు నుంచి ఏడు శాతానికి మించి ఉండేది కాదు. ఈక్విటీ ఫండ్స్ గ్రోత్ ఆప్షన్‌లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే ఇంతకు మించి మంచి రాబడులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పీరియాడిక్ ఆదాయం(డివిడెండ్ల ద్వారా కొంత మొత్తంలో) పొందాలనుకోకూడదు. ఉదాహరణకు రూ.10 ముఖ విలువ గల ఒక ఈక్విటీ ఫండ్‌ను తీసుకుందాం. దీని ఎన్ఏవీ రూ.15 ఉంది. ఇది 10 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. మీరు డివిడెండ్ ఆప్షన్‌లో ఇన్వెస్ట్ చేస్తే మీకు రూ.1 డివిడెండ్ లభిస్తుంది. ఈ మేరకు ఎన్ఏవీ రూ.14కు తగ్గుతుంది. 10 శాతం డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే మీకు 90 పైసలే డివిడెండ్ వస్తుంది. అదే గ్రోత్ ఆప్షన్‌ను ఎంచుకుంటే, ఎన్ఏవీ రూ.15 అలాగే కొనసాగుతుంది. పైగా ఎలాంటి పన్ను భారం కూడా ఉండదు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను సీనియర్ సిటిజన్‌ను. నేను గతంలో ఇన్వెస్ట్ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ ఒకటి ఇటీవలే మెచ్యూర్ అయింది. ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసి నెలవారీ కొంత ఆదాయాన్ని పొందాలనేది నా ఆలోచన. దీనికి తగ్గట్టుగా మంచి పెట్టుబడి వ్యూహాన్ని సూచించండి?

- ఆంజనేయులు, విశాఖపట్టణం


ముందుగా మీ జీవన వ్యయాలకు అవసరమయ్యే నెలవారీ ఖర్చులను పూర్తిగా రాసుకోండి. మీ నెలవారీ అవసరాలకు ఎంత మొత్తం అవసరమవుతుందో లెక్కించండి. ఈ అవసరాలను తీర్చే ఇతర ఆదాయాలు.. (ఉదాహరణకు మీకు ఇంటద్దెలు రావడం కానీ, పెన్షన్ రావడం కానీ) ఏమీ లేని పక్షంలో సీనియర్ సిటిజన్స్ స్కీమ్‌లో రూ.15 లక్షల వరకూ ఇన్వెస్ట్ చేయండి. ఈ స్కీమ్‌లో మీకు 8.3 శాతం వడ్డీ లభిస్తుంది. ఇది పూర్తిగా సురక్షితం. మీకు మూడు నెలలకొకసారి వడ్డీ వస్తుంది. ఎల్ఐసీకి చెందిన ప్రధాన మంత్రి వ్యయ వందన యోజనలో కూడా గరిష్ట పెట్టుబడి రూ.15 లక్షలు. దీనిపై కూడా 8.3 శాతం వడ్డీ వస్తుంది. ఈ రెండు స్కీమ్‌లూ సురక్షితమైనవే. ఒకటి పూర్తిగా ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న స్కీమ్ కాగా, మరొకటి ప్రభుత్వం స్పాన్సర్‌చేస్తున్న స్కీమ్. ఇక మిగిలిన మొత్తాన్ని జాగ్రత్తగా ఇన్వెస్ట్ చేయాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సురక్షితమైనవే కానీ, మీ పెట్టుబడి వ్యూహానికి అవి తగవు. రిటైర్మెంట్ వ్యక్తులకు ద్రవ్యోల్బణంతో తట్టుకునే క్రమబద్ధమైన ఆదాయం అవసరం. స్థిరాదాయం అందించే ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు ప్రస్తుత అవసరాలకు తగ్గ ఆదాయాన్ని మాత్రమే ఇవ్వగలవు. మూడేళ్ల తర్వాత ద్రవ్యోల్బణంతో పాటు ధరలు కూడా పెరుగుతాయి. కాబట్టి దానికి తగ్గట్టుగా మీ ఆదాయం కూడా పెరగాలి. కానీ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో మీ పెట్టుబడి కూడా స్థిరంగానే ఉంటుంది. కానీ వృద్ధి ఉండదు. ఐదు లేదా పదేళ్ల కాలానికి ద్రవ్యోల్బణంతో పాటే పెరిగేలా మీ రాబడులు ఉండాలి. దీనికి ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడమే సరైన మార్గం. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు కొన్ని ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోవాలి. మీ పెట్టుబడికి రక్షణ ఉండాలి. అలాగే ద్రవ్యోల్బణానికి తగ్గట్టుగానే రాబడులు ఉండాలి. ఈక్విటీల్లో ఎప్పుడూ ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయకూడదు. వయస్సు పెరుగుతున్న కొద్దీ రిస్క్‌ను తగ్గించుకోవాలి. అందుకని మీ మొత్తం పెట్టుబడుల్లో 30 నుంచి 40 శాతం కంటే ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయొద్దు.

32,380 పాయింట్లస్థాయికి అటూ.. ఇటూ

మార్కెట్ పంచాంగం


దీర్ఘకాలిక ఈక్విటీ రాబడులపై బడ్జెట్లో ప్రతిపాదించిన పన్ను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం, రాజకీయ అనిశ్చితి వాతావరణం వంటి అంశాలతో భారత్ ఈక్విటీలు సతమతమవుతూ కొద్ది వారాలుగా ప్రపంచమార్కెట్లతో వేరుపడి...డౌన్‌ట్రెండ్ సాగిస్తుండగా, తాజాగా అమెరికా–చైనాలు పరస్పరం...సుంకాల విధింపుతో వాణిజ్యయుద్ధానికి తెరతీయడంతో అంతర్జాతీయ సూచీలు కూడా తిరోగమన బాట పట్టాయి. అయితే సాంకేతికంగా మన మార్కెట్...ఓవర్‌సోల్డ్ కండీషన్‌లో వున్నందున..చిన్నపాటి రిలీఫ్ ర్యాలీకి అవకాశాలున్నాయి. కానీ ఆ ర్యాలీ జరగాలంటే ఈ మూడు రోజుల ట్రేడింగ్ వారంలో ప్రపంచ మార్కెట్లు కుదుటపడాల్సివుంటుంది. లేకపోతే స్పాట్ మార్కెట్లో డెలివరీ అమ్మకాలు పెరిగి, ఓవర్‌సోల్డ్ కండీషన్ తొలగిపోతుంది. తద్వారా రిలీఫ్‌ర్యాలీకి అవకాశం ఉండదు.

సెన్సెక్స్ సాంకేతికాలు..



మార్చి 23తో ముగిసిన వారంలో తొలిరోజున జరిగిన పతనంలో గత మార్కెట్ పంచాంగంలో అంచనాలకు అనుగుణంగా బీఎస్ఈ సెన్సెక్స్ 32,820 సమీపంలో మద్దతు సాధించినప్పటికీ, చివరిరోజున ఆ మద్దతుస్థాయిని కూడా కోల్పోయి 32,483 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 579 పాయింట్ల నష్టంతో 32,597వద్ద ముగిసింది. పలు కీలకమైన మద్దతుస్థాయిల్ని వదులుకున్నందున, రానున్న రోజుల్లో 31,081 పాయింట్ల వరకూ పతనం కొనసాగే ప్రమాదం వుంటుంది. అయితే గత శుక్రవారం అమెరికా సూచీల భారీ పతనం ప్రభావంతో ఈ సోమవారం గ్యాప్‌డౌన్‌తో ప్రారంభమైతే... 32,380 స్థాయి (2016 డిసెంబర్‌లో 25,807 వద్ద నుంచి 2018 జనవరిలో 36,443 వరకూ జరిగిన ర్యాలీలో ఇది 38.2% రిట్రేస్‌మెంట్ స్థాయి)ని పరిరక్షించుకుంటే చిన్నపాటి రిలీఫ్ ర్యాలీ జరిగే ఛాన్సు వుంటుంది. అలా జరిగితే వేగంగా 33, 070 పాయింట్ల వరకూ పెరగవచ్చు. అటుపై ముగిస్తే 33,280 స్థాయిని అందుకోవొచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం వుంటుంది. ఇక 32,380 స్థాయి దిగువన 32,310 పాయింట్ల స్థాయివరకూ తగ్గవచ్చు. ఆ లోపున 31,800 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు.

9,918 స్థాయి ఈ వారం కీలకం



గతవారం మార్కెట్ పంచాంగంలో సూచించిన 10,075–10,030 పాయింట్ల శ్రేణి వద్ద నిఫ్టీ తొలి మద్దతును పొందినప్పటికీ, వారంలో చివరిరోజైన శుక్రవారం గ్యాప్‌డౌన్‌లో ఆ మద్దతును కోల్పోయి 9,951 కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 197 పాయింట్ల నష్టంతో 9,998 వద్ద ముగిసింది. ఈ సోమవారం గ్యాప్‌డౌన్‌తో నిఫ్టీ మొదలైతే 9,918 పాయింట్ల వద్ద కీలకమైన మద్దతు లభిస్తున్నది. ఇది 2016 డిసెంబర్‌లో 7,893 వద్ద నుంచి 2018 జనవరిలో 11,170 వరకూ జరిగిన ర్యాలీలో 38.2% రిట్రేస్‌మెంట్ స్థాయి. ఈ మద్దతును కాపాడుకోగలిగితే చిన్న రిలీఫ్‌ర్యాలీకి అవకాశం ఉంటుంది. ఆ సందర్భంలో నిఫ్టీ తిరిగి 10,075–10,030 శ్రేణి వద్దకు బౌన్స్ కావొచ్చు. ఈ శ్రేణిపైన స్థిరపడలిగితే 10,225 వరకూ పెరగవచ్చు. అటుపై ముగిస్తేనే తదుపరి ర్యాలీకి అవకాశం వుంటుంది. కానీ ఈ సోమవారం 9,918 స్థాయిని ముగింపులో కోల్పోతే 9,800 స్థాయికి పతనం కావొచ్చు. ఆ లోపున కొద్ది రోజుల్లో 9,687 వరకూ పతనం కొనసాగవచ్చు. మార్చి డెరివేటివ్స్ ముగింపు సందర్భంగా నిఫ్టీ ఆప్షన్లకు సంబంధించి ఏ స్ట్రయిక్ వద్ద అధిక బిల్డప్ లేదు. కాస్త ఎక్కువగా 50 లక్షల వరకూ 10,000 స్ట్రయిక్ వద్ద పుట్ బిల్డప్ మాత్రం వుంది. ఈ స్థాయి దిగువన నిఫ్టీ మరింత క్షీణించవచ్చని, ఈ స్థాయిపై స్థిరపడితే పెరగవచ్చని ఈ పుట్ బిల్డప్ సూచిస్తున్నది.

- పి. సత్యప్రసాద్

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 26-3-2018



వారెవ్వా ఐసీసీ. బాల్ ట్యాంపరింగ్ వివాదంలో గొప్ప శిక్షే వేశారు! అన్ని ఆధారాలున్నా... బాన్‌క్రాఫ్ట్‌పై మ్యాచ్ నిషేధం లేదు. ఎలాంటి ఆధారాలు లేకున్నా మితిమీరి అప్పీల్ చేశారని పేర్కొంటూ 2001 దక్షిణాఫ్రికాతో టెస్టులో మా జట్టుకు చెందిన ఆరుగురిపై ఒక్కో మ్యాచ్ నిషేధం విధించారు. 2008 సిడ్నీలోనూ జాతి వివక్ష వ్యాఖ్యలంటూ నాపై 3 టెస్టుల నిషేధం విధించారు. ఒక్కో వ్యక్తికి ఒక్కో శిక్షనా? వ్యక్తిని బట్టి ఐసీసీ అధికారులు శిక్షను ఖరారు చేస్తున్నారు.

-ఐసీసీ తీరుపై భారత క్రికెటర్ హర్భజన్ సింగ్

పరువు పాతాళంలోకి!

అనూహ్యంగా బయటపడిన బాల్ ట్యాంపరింగ్ పెద్ద కుదుపులకే దారి తీస్తోంది. ఆస్ట్రేలియా క్రికెట్‌లో పెను సంక్షోభంగా నిలుస్తోంది. స్వదేశీ, విదేశీ మాజీ ఆటగాళ్ల విమర్శల తుఫానులో చిక్కుకుంది. ఏకంగా ఆ దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ రంగంలోకి దిగేంతగా తీవ్ర స్థాయి దాల్చింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లను తక్షణమే పదవుల నుంచి తప్పించాలని ఆయన ఆదేశించగా... ఇటువైపు స్మిత్, బాన్‌క్రాఫ్ట్‌లపై ఐసీసీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. స్మిత్, వార్నర్‌లపై జీవితకాల నిషేధం వంటి మరిన్ని సంచలన నిర్ణయాలకూ ఆస్కారం కనిపిస్తుండగా... పులి మీద పుట్రలా దక్షిణాఫ్రికా చేతిలో మూడో టెస్టులో దారుణ పరాజయం ఆసీస్‌ను మరింత కుంగదీసింది.

ఆస్ట్రేలియా క్రికెట్‌లో తీవ్ర దుమారం

- 'బాల్ ట్యాంపరింగ్'పై ఆ దేశ ప్రధాని జోక్యం
- కెప్టెన్‌గా స్మిత్, వైస్ కెప్టెన్‌గా వార్నర్‌కు తక్షణ ఉద్వాసన
- ఇద్దరిపై జీవితకాల నిషేధం విధించే యోచన
- స్మిత్‌పై ఐసీసీ ఓ టెస్టు వేటు, 100 శాతం జరిమానా
- 75 శాతం కోతతో బయటపడ్డ బాన్‌క్రాఫ్ట్



వార్నర్ స్మిత్

ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ ట్యాంపరింగ్ చేశారనే వార్త విని షాక్‌కు గురయ్యా. ఆదర్శంగా నిలవాల్సిన వారు మోసపూరిత చర్యలకు పాల్పడ్డారంటే నమ్మశక్యంగా లేదు. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) చైర్మన్ డేవిడ్ పీవెర్‌తో ఈ విషయంపై మాట్లాడాను. స్మిత్, వార్నర్‌లను వారి బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించాను.

-టర్న్‌బుల్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి

నిజాయతీగా చెప్పాలంటే గత 24 గంటలు మాకెంతో భారంగా గడిచాయి. మా అభిమానులందరినీ ఈ సందర్భంగా నేను క్షమాపణలు కోరుతున్నాను. మా నుంచి వారు ఇలాంటి ప్రదర్శనను ఆశించలేదు.

-టిమ్ పైన్, ఆసీస్ తాత్కాలిక సారథి

స్మిత్ చేసింది చాలా చాలా పెద్ద తప్పే. సరైన వ్యక్తులు పిలిస్తే ఆస్ట్రేలియా జట్టులోకి మళ్లీ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను.

-మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్

సిడ్నీ/దుబాయ్: బాల్ ట్యాంపరింగ్ ఉదంతం ఆస్ట్రేలియా క్రికెట్‌లో తీవ్ర సంక్షోభానికి దారితీసింది. అన్ని వైపుల నుంచి విమర్శలు రావడం, ఏకంగా దేశ ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ జోక్యం చేసుకోవడంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లను కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవుల నుంచి తప్పించింది. వికెట్ కీపర్ టిమ్ పైన్‌కు తాత్కాలికంగా సారథ్య బాధ్యతలు అప్పగించింది. 'ఈ టెస్టు పూర్తిగా సాగాల్సిన అవసరం ఉంది. స్మిత్, వార్నర్‌లతో చర్చించాం. వైదొలగేందుకు వారు అంగీకరించారు' అని సీఏ చీఫ్ జేమ్స్ సదర్లాండ్ తెలిపాడు. దీంతోపాటు ట్యాంపరింగ్ ఘటనపై అత్యవసర విచారణ జరిపేందుకు సీఏ హెడ్ ఆఫ్ ఇంటెగ్రిటీ లైన్ రాయ్, టీమ్ ఫెర్ఫార్మెన్స్ హెడ్ ప్యాట్ హోవార్డ్‌లు దక్షిణాఫ్రికా బయల్దేరారు. 'మాతో సహా ఆస్ట్రేలియన్లంతా సమాధానం కోరుకుంటున్నారు. మా దర్యాప్తులో తేలిన అంశాలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యంగా తెలియపరుస్తాం' అని సదర్లాండ్ పేర్కొన్నాడు.

మరోవైపు బాల్ ట్యాంపరింగ్‌కు గాను ఆసీస్ సారథిపై ఒక టెస్టు నిషేధంతో పాటు వంద శాతం మ్యాచ్ ఫీజు కోత విధిస్తూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిర్ణయం తీసుకుంది. నేరుగా ట్యాంపరింగ్‌కు పాల్పడిన ఓపెనర్ బాన్‌క్రాఫ్ట్ మ్యాచ్ ఫీజులో 75 శాతం కోతతో పాటు, మూడు డి మెరిట్ పాయింట్లు ఇచ్చింది. 'క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసే తీవ్ర చర్యలకు పాల్పడిన ఆటగాళ్లకు మద్దతుగా నిలిచినందుకు స్మిత్‌పై కోడ్ ఆఫ్ కండక్ట్ 2.2.1 ఆర్టికల్ కింద, బంతి ఆకారం మార్చేందుకు ప్రయత్నించి లెవల్ 2 నిబంధనలు ఉల్లంఘించినందుకు ఆర్టికల్ 2.2.9, నిబంధన 41.3 కింద బాన్‌క్రాఫ్ట్‌పై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ ఈ చర్యలు చేపట్టారు.



బాన్‌క్రాఫ్ట్

దీంతో పాటు రెండు సస్పెన్షన్ పాయింట్లను ఎదుర్కొన్న స్మిత్ తదుపరి టెస్టుకు దూరం కానున్నాడు. అతడి ఖాతాలో నాలుగు డి మెరిట్ పాయింట్లు కూడా జమ కానున్నాయి. 'ట్యాంపరింగ్ చేసేలా స్వయంగా ఆస్ట్రేలియా జట్టు నాయకత్వమే ప్రోత్సహించడం క్రీడా స్ఫూర్తికి విరుద్ధం. ఇది తీవ్రమైన అంశం. కెప్టెన్‌గా స్మిత్ దీనికి పూర్తిగా బాధ్యుడు. సస్పెన్షనే సరైనది' అని రిచర్డ్‌సన్ స్పష్టం చేశారు. ఈ సిరీస్‌లో చోటుచేసుకున్న దూషణలు, అంపైర్ల నిర్ణయాలపై నిరసన, ప్రేక్షకుల అతి వంటి వాటిని ఇకపై నివారించే దిశగా ఐసీసీ చర్యలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నాడు. సభ్య దేశాలు కూడా క్రికెట్ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రయత్నించాలని కోరాడు.

ఆలోచించాకే నిర్ణయం...

న్యూఢిల్లీ: బాల్ ట్యాంపరింగ్ ఉదంతం నేపథ్యంలో స్మిత్, వార్నర్‌ల ఐపీఎల్ భవితవ్యంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా తెలిపారు. ఆస్ట్రేలియా బోర్డు, ఐసీసీ చర్యలు చేపట్టినప్పటికీ... బీసీసీఐ ఈ విషయమై ఎటువంటి ఆలోచన చేయడం లేదని శుక్లా వివరించారు. బీసీసీఐతో సమాలోచన చేశాకే స్మిత్‌పై తమ నిర్ణయం వెలువరిస్తామని రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ తెలిపింది. వార్నర్‌పై మాత్రం సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పందించలేదు. స్మిత్, వార్నర్ వంటి కీలక ఆటగాళ్లను ఒక్క ఘటనతో దూరం పెట్టలేమని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు.

ఎంతవాడుగానీ...

నైతికత లేకుంటే పతనమే!

స్టీవ్ స్మిత్ ఉదంతం చెబుతున్నదిదే

అతడు ఎనిమిదేళ్ల క్రితం టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసింది ఒక స్పిన్నర్‌గా. బ్యాటింగ్‌కు దిగింది 8వ స్థానంలో. కానీ, తర్వాత ఎంతో మెరుగయ్యాడు. ఓపెనింగ్‌తో పాటు 3, 4, 5 ఇలా పలు స్థానాల్లో బ్యాటింగ్ చేశాడు. కీలక ఆటగాడిగా ఎదగడమే కాదు... కెప్టెన్ కూడా అయ్యాడు. సంధి దశలో ఉన్న జట్టును ముందుండి నడిపించాడు. టెస్టుల్లో నంబర్‌వన్‌గానూ నిలిచాడు. 64 టెస్టులు ముగిసే సరికి ఇప్పుడతడి సగటు 61.37. అయినా... ఏం లాభం? నైతికత అనే ఒక్క లక్షణం లేకపోవడంతో నాయకుడు కాస్తా ప్రతినాయకుడిలా కనిపిస్తున్నాడు. అతడే ఆస్ట్రేలియా సారథి స్టీవ్ స్మిత్.

ఒక్కో మెట్టు ఎక్కి...

క్రీజులో చిత్రవిచిత్ర స్టాన్స్, మెరుపు ఫీల్డింగ్‌తో పాటు అచ్చం బొమ్మలాంటి ముఖంతో తొలినాళ్లలో స్మిత్ కొంత ప్రత్యేకంగా కనిపించేవాడు. స్పిన్నర్‌గా అడుగుపెట్టినా పేరుగాంచింది మాత్రం బ్యాట్స్‌మన్‌గానే. అడ్డదిడ్డమైన షాట్లతో బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారి, ప్రపంచ వ్యాప్తంగా పరుగులు రాబడుతూ ఆసీస్ దిగ్గజ బ్యాట్స్‌మన్ డాన్ బ్రాడ్‌మన్ తర్వాత అత్యధిక సగటు ఉన్న ఆటగాడిగా ఎదిగాడు. ఇలా కెరీర్‌లో ఒక్కో మెట్టు ఎదుగుతూ ఎంతటి పేరు సంపాదించాడో, దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో బాల్ ట్యాంపరింగ్‌తో అంతటి చెడ్డ పేరు మూటగట్టుకున్నాడు. తన ప్రతిష్ఠకు తానే మచ్చ తెచ్చుకున్నాడు.

గతేడాది బెంగళూరులో భారత్‌తో టెస్టు సందర్భంగా డీఆర్‌ఎస్ కోరేందుకు జట్టు సభ్యులున్న బాల్కనీ వైపు చూసి స్మిత్ అప్పట్లోనే వివాదాస్పదమయ్యాడు. మతి చెడి అలా చేశానని తర్వాత ఒప్పుకున్నాడు. రెండేళ్ల క్రితం న్యూజిలాండ్‌తో టెస్టులోనూ అనుచిత ప్రవర్తనతో జరిమానాకు గురయ్యాడు. ఆ సందర్భంలో 'నాయకుడిగా నేనింకా ఎదగాలి. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి' అని చెప్పాడు. తర్వాత కూడా అండర్సన్, రబడ వంటి బౌలర్లతో వాగ్యుద్ధానికి దిగాడు. ఇప్పుడు ఏకంగా ట్యాంపరింగ్‌తో పెద్ద తప్పే చేశాడు.

అంత అవసరం ఏమొచ్చింది...

దక్షిణాఫ్రికాతో నాలుగు టెస్టుల సిరీస్ 1-1తో ఉంది. జరుగుతున్నది మూడో టెస్టు. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్ పోరాడి ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించింది. సఫారీల నుంచి రెండో ఇన్నింగ్స్‌లో ప్రతిఘటన ఎదురవుతోంది. మరీ బెదిరిపోవాల్సిన పనిలేదు. తమ రెండో ఇన్నింగ్స్‌లో దానికి బదులివ్వొచ్చు. అప్పటికీ విఫలమైతే టెస్టు చేజారుతుంది అంతే! లోపాలు సరిచేసుకుని చివరి టెస్టులో గెలిచి సిరీస్‌ను సమం చేయొచ్చు. ఆసీస్‌లాంటి జట్టుకు ఇదేమంత కష్టమూ కాదు. కానీ తప్పు దారిలో ఆలోచించి దోషిగా నిలబడ్డాడు. పైగా జట్టంతా తీసుకున్న నిర్ణయమంటూ అందరికీ ఆపాదించాడు. కొత్త కుర్రాడు బాన్‌క్రాఫ్ట్ సహా, నేరుగా ప్రమేయం లేని వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ భవిష్యత్తునూ బలి చేశాడు.

జీవితకాలం వెంటాడే తప్పు...

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో స్మిత్ ఆల్‌టైమ్ రెండో అత్యధిక రేటింగ్ పాయింట్లు (945) సాధించి ఉండవచ్చుగాక, చరిత్రలో రెండో అత్యధిక సగటుతో కెరీర్ ముగించొచ్చుగాక... ఇలాంటి ఘనతలు ఇంకెన్ని తన ఖాతాలో ఉన్నా బాల్ ట్యాంపరింగ్ అతడిని జీవితకాలం వెంటాడుతూనే ఉంటుంది. ఒక మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణంలా, ఒక అండర్ ఆర్మ్ బౌలింగ్‌లా ఇది చరిత్రలో నిలిచిపోతుంది.

-సాక్షి క్రీడా విభాగం

ఆసీస్ కుదేల్... సఫారీలు జిగేల్

- ఆసీస్‌పై 322 పరుగులతో దక్షిణాఫ్రికా ఘన విజయం
- సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలోకి
- మోర్నీ మోర్కెల్‌కు ఐదు వికెట్లు

కేప్‌టౌన్: వివాదంతో ఏకాగ్రత చెదిరింది... ఆటగాళ్లపై నిషేధంతో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది... ప్రదర్శన అట్టడుగుకు పడిపోయింది... ఫలితం ఆస్ట్రేలియా దారుణ పరాజయం. బాల్ ట్యాంపరింగ్ ఘటనతో తీవ్ర ఒత్తిడిలో పడిపోయిన ఆ జట్టును... మరింత కుదేలు చేస్తూ మూడో టెస్టులో దక్షిణాఫ్రికా 322 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-1తో ముందంజ వేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన మోర్నీ మోర్కెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఇక్కడి న్యూలాండ్స్ మైదానంలో నాలుగో రోజు 430 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆసీస్ పేలవ ఆటతీరుతో 107 పరుగులకే కుప్పకూలింది. మ్యాచ్ ఏ దశలోనూ ఆశావహంగా కనిపించని కంగారూలు కనీస ప్రతిఘటన కూడా ఇవ్వలేకపోయారు. వార్నర్ (32), బాన్‌క్రాఫ్ట్ (26) తొలి వికెట్‌కు 57 పరుగులు జత చేసినా... ఆ తర్వాత 50 పరుగుల వ్యవధిలోనే 10 వికెట్లూ కోల్పోయి ఘోర పరాభవం ఎదుర్కొన్నారు. మోర్నీ మోర్కెల్ (5/23) పదునైన పేస్‌తో, కేశవ్ మహరాజ్ (2/32) స్పిన్‌తో ప్రత్యర్థి పనిపట్టారు. ఓపెనర్లు మినహా మిచెల్ మార్ష్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. స్మిత్ (7) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ఓవర్‌నైట్ స్కోరు 238/5తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా డికాక్ (65; 8 ఫోర్లు, 1 సిక్స్), ఫిలాండర్ (52 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో 373 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 56తో కలుపుకొని ఆసీస్ ముందు 430 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఇరు జట్ల మధ్య చివరిదైన నాలుగో టెస్టు జొహన్నెస్‌బర్గ్‌లో ఈ నెల 30న మొదలవుతుంది.



మోర్కెల్‌ను అభినందిస్తున్న సహచరులు

అఫ్గానిస్తాన్ అద్భుతం

ఫైనల్లో విండీస్‌పై 7 వికెట్లతో విజయం ◆ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ

హరారే: సూపర్ సిక్స్ దశ మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై సాధించిన విజయం గాలివాటమేమీ కాదని అఫ్గానిస్తాన్ జట్టు నిరూపించింది. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఫైనల్లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేస్తూ... తొలిసారి క్వాలిఫయింగ్ టోర్నీ చాంపియన్‌గా అవతరించింది. వెస్టిండీస్‌తో ఆదివారం ఇక్కడ జరిగిన తుదిపోరులో అఫ్గాన్ జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట విండీస్ 46.5 ఓవర్లలో 204 పరుగులకే ఆలౌటైంది. గేల్ (10) మళ్లీ విఫలంకాగా... పావెల్ (44; ఫోర్, 2 సిక్స్‌లు), హెట్‌మైర్ (38; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. ప్రత్యర్థి బౌలర్లలో ముజీబ్ 4, నైబ్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బరిలో దిగిన అఫ్గాన్ 40.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసి గెలుపొందింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ షహజాద్ (84; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), రెహ్మత్ షా (51; 4 ఫోర్లు) రాణించారు.



రషీద్ ఖాన్ రికార్డు

ఈ మ్యాచ్‌లో హోప్ వికెట్ తీయడం ద్వారా వన్డేల్లో అతి తక్కువ మ్యాచ్‌ల్లో, అతి పిన్న వయసులో 100 వికెట్లు తీసిన బౌలర్‌గా అఫ్గాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ రికార్డు సృష్టించాడు. 19 ఏళ్ల 186 రోజుల రషీద్ 44వ వన్డేలో ఈ ఘనత సాధించాడు. అంతకుముందు ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ (52 వన్డేలు) పేరిట ఈ రికార్డు ఉంది.

198 సరిపోలేదు

- భారీ స్కోరు చేసినా భారత్‌కు తప్పని ఓటమి
- సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించిన వ్యాట్



వ్యాట్

ముంబై: బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపించినా... బౌలింగ్ వైఫల్యం కారణంగా ముక్కోణపు టి20 టోర్నీలో భారత మహిళల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ బృందం 7 వికెట్ల తేడాతో ఓడింది. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. టి20ల్లో భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు మిథాలీ రాజ్ (43 బంతుల్లో 53; 7 ఫోర్లు), స్మృతి మంధాన (40 బంతుల్లో 76; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) 12.5 ఓవర్లలో తొలి వికెట్‌కు 129 పరుగులు జతచేశారు. ఈ క్రమంలో స్మృతి 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుంది. భారత్ తరఫున ఇదే వేగవంతమైన అర్ధ సెంచరీ. భారీ లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో డానియెలా వ్యాట్ (64 బంతుల్లో 124; 15 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఆటే హైలైట్‌గా నిలిచింది. విజయానికి మరో 16 పరుగుల దూరంలో దీప్తి శర్మ (2/36) బౌలింగ్‌లో ఆమె వెనుదిరిగినా... స్కివర్ (12 నాటౌట్), కెప్టెన్ హెథర్ (8 నాటౌట్) మరో ఎనిమిది బంతులు మిగిలుండగానే 199/3తో జట్టును గెలిపించారు. మహిళల అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో ఇదే అత్యధిక పరుగుల ఛేదన కావడం విశేషం.

ఇంగ్లండ్ ఎదురీత

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరుగుతోన్న తొలి టెస్టులో ఇంగ్లండ్ ఎదురీదుతోంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. చేతిలో ఏడు వికెట్లు ఉన్న ఆ జట్టు కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు మరో 237 పరుగులు వెనుకబడి ఉంది. ఈ డే-నైట్ టెస్టులో ఇంగ్లండ్ ఓటమిని తప్పించుకోవాలంటే ఐదో రోజు మొత్తం బ్యాటింగ్ చేయాల్సి ఉంది. అంతకుముందు న్యూజిలాండ్ 427/8 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ఆ జట్టుకు 369 పరుగుల ఆధిక్యం లభించింది. నికోల్స్ (145 నాటౌట్; 18 ఫోర్లు) భారీ శతకంతో ఆకట్టుకున్నాడు.

ఫెడరర్‌కు షాక్

- మయామి మాస్టర్స్ టోర్నీ రెండో రౌండ్‌లో నిష్క్రమణ
- చేజారనున్న టాప్ ర్యాంక్
- ఫ్రెంచ్ ఓపెన్‌కూ దూరం

ఫ్లోరిడా (అమెరికా): వారం వ్యవధిలో స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌కు రెండో పరాజయం ఎదురైంది. గత ఆదివారం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లో ఓడిన ఫెడరర్... మయామి మాస్టర్స్ టోర్నీలో మాత్రం రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రపంచ 175వ ర్యాంకర్ థనాసి కొకినాకిస్ (ఆస్ట్రేలియా)తో జరిగిన మ్యాచ్‌లో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ ఫెడరర్ 6-3, 3-6, 6-7 (4/7)తో పరాజయం పాలయ్యాడు. గతేడాది ఇండియన్ వెల్స్, మయామి మాస్టర్స్ సిరీస్ టైటిల్స్ నెగ్గిన ఫెడరర్ ఈసారి వాటిని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాడు. మయామి టోర్నీలో రెండో రౌండ్‌లోనే ఓడినందుకు ఫెడరర్ భారీ మూల్యమే చెల్లించుకోనున్నాడు. ఏప్రిల్ 2న విడుదలయ్యే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అతను తన టాప్ ర్యాంక్‌ను కోల్పోనున్నాడు. ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న రాఫెల్ నాదల్ (స్పెయిన్) మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ అందుకుంటాడు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తాను క్లే కోర్టు సీజన్‌లో బరిలోకి దిగడంలేదని ఫెడరర్ ప్రకటించాడు. ఫలితంగా ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి ఫెడరర్ వరుసగా రెండో ఏడాది దూరం కానున్నాడు. తగినంత విశ్రాంతి తీసుకొని జూన్‌లో జరిగే వింబుల్డన్ టోర్నమెంట్‌కు సిద్ధమవుతానని తెలిపాడు.

యూకీ బాంబ్రీ ఓటమి: మరోవైపు మయామి మాస్టర్స్ టోర్నీలో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో యూకీ 3-6, 6-7 (3/7)తో ఎనిమిదో సీడ్ జాక్ సోక్ (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. రెండో రౌండ్‌లో ఓడిన యూకీకి 25,465 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 16 లక్షల 55 వేలు)తోపాటు 25 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



వెటెల్‌దే విజయం

ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి టైటిల్ కైవసం

మెల్‌బోర్న్: ఫార్ములావన్ సీజన్‌లో తొలి విజయం ఫెరారీ జట్టు ఖాతాలోకి వెళ్లింది. ప్రపంచ మాజీ చాంపియన్ సెబాస్టియన్ వెటెల్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సీజన్‌లోని మొదటి రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచాడు. రెండో స్థానం నుంచి రేసును మొదలుపెట్టిన వెటెల్ నిర్ణీత 58 ల్యాప్‌లను గంటా 29 నిమిషాల 33.283 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 25 ల్యాప్‌ల వరకు అగ్రస్థానంలోనే ఉన్న హామిల్టన్ ఆ తర్వాత ఆధిక్యాన్ని వెటెల్‌కు కోల్పోయాడు. 25వ ల్యాప్‌లో ఆధిక్యంలోకి వచ్చిన వెటెల్ చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్నాడు. కెరీర్‌లో 200వ రేసులో పాల్గొన్న అతను 48వ టైటిల్‌ను గెలిచాడు. కిమీ రైకోనెన్ (ఫెరారీ) మూడో స్థానంలో, రికియార్డో (రెడ్‌బుల్) నాలుగో స్థానంలో, అలోన్సో (మెక్‌లారెన్) ఐదో స్థానంలో నిలిచారు. భారత్‌కు చెందిన ఫోర్స్ ఇండియా జట్టుకు ఈ రేసు నిరాశ మిగిల్చింది. ఫోర్స్ ఇండియా డ్రైవర్లు సెర్గియో పెరెజ్ 11వ స్థానంలో, ఒకాన్ 12వ స్థానంలో నిలిచారు. మొత్తం 20 మంది డ్రైవర్లు రేసులో పోటీపడగా ఐదుగురు మధ్యలోనే వైదొలిగారు. సీజన్‌లోని తదుపరి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 9న జరుగుతుంది.



రోడ్డు ప్రమాదంలో షమీకి గాయాలు

డెహ్రాడూన్: భారత ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ షమీ రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి డెహ్రాడూన్ నుంచి న్యూఢిల్లీకి కారులో తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో అతని తలకు గాయాలయ్యాయి. దీంతో స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. 'తలకు దెబ్బ తగలడంతో కుట్లు పడ్డాయి. గాయం చిన్నదే. కంగారు పడాల్సిన పనిలేదు. ఓ రోజు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది' అని వైద్యులు తెలిపారు. భార్య హసీన్ జహాన్ ఆరోపణల నేపథ్యంలో గత రెండు వారాలుగా వార్తల్లో నిలిచిన షమీ ప్రస్తుతం ఐపీఎల్ కోసం సిద్ధమవుతున్నాడు. వచ్చే నెల 7 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ సీజన్-11లో షమీ ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున బరిలో దిగనున్నాడు.





హోటల్‌లోనికి ప్రవేశిస్తున్న మోహన్‌రెడ్డి, పర్సు నుంచి డబ్బులు తీసి బెంచి మీద పెడుతున్న ఆయన సోదరుడు మహేందర్ రెడ్డి, మోహన్‌రెడ్డి లేవగానే డబ్బులు బెంచీ మీద నుంచి తీసుకొని జేబులో పెట్టుకుంటున్న కానిస్టేబుల్

విచ్చలవిడిగా 'ములాఖత్'లు !

పోలీసులకు నజరానాలు.. సీసీ పుటేజీలో బట్టబయలు

- మరో వివాదంలో మాజీ ఏఎస్‌ఐ మోహన్ రెడ్డి
- స్పందించిన సీపీ కమలాసన్ రెడ్డి.. విచారణకు ఆదేశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అక్రమ ఫైనాన్స్ వ్యవహారంలో అరెస్టు అయి ఏసీబీ కేసులలో 11 నెలలుగా జైలులో ఉన్న మాజీ ఏఎస్‌ఐ మోహన్‌రెడ్డి వ్యవహారంలో మరో సంచలన వీడియో బయటపడింది. గతంలో కరీంనగర్ జైలు అధికారి కార్యాలయంలోనే సెటిల్‌మెంట్లు చేసిన వీడియో బహిర్గతం కావడంతో సూపరింటెండెంట్ బదిలీ కావడం సంచలనం కలిగించింది. ప్రస్తుతం ఎస్కార్ట్ పోలీసుల సమక్షంలో మోహన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు, అనుయాయులతో కలసి చర్చించడమే కాకుండా పోలీసులకు నజరానా ముట్టజెప్పిన దృశ్యాలు వీడియోలో ఉన్నాయి. ఈనెల 21న కరీంనగర్ కోర్టుకు వచ్చిన మోహన్‌రెడ్డి, దానికి ఎదురుగా ఉన్న ఉడిపి హోటల్‌లో సాయంత్రం 6.02 గంటలకు ప్రవేశించి ఏకంగా 23 నిమిషాలు హోటల్‌లో గడిపాడు. ఈ క్రమంలో ఆయన తన కుమారుడు అక్షయ్‌రెడ్డి, తమ్ముడు మహేందర్‌రెడ్డిలతో పాటు బంధువులు, మణింధర్‌సింగ్‌లతో చర్చలు జరిపారు. 6.24 నిమిషాలకు మోహన్‌రెడ్డి సూచనల మేరకు చర్చల అనంతరం మహేందర్‌రెడ్డి హోటల్ బెంచీపై డబ్బులు పెట్టాడు. మోహన్‌రెడ్డి లేవగానే అక్కడున్న కానిస్టేబుల్ ఆ మొత్తాన్ని తన జేబులో పెట్టుకొని నడుస్తున్న దృశ్యం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది. కంచె చేను మేసినట్లు పోలీసులే అక్రమాలకు పాల్పడితే అవినీతి రహిత తెలంగాణ ఎలా సాధ్యమని మోహన్‌రెడ్డి బాధితుల సంఘం, లోక్‌సత్తాలు ప్రశ్నించాయి. ఆ రోజు డ్యూటీలో ఉన్న ఎస్కార్ట్ పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని బాధితుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు మహేందర్‌రెడ్డి, బండమీది సాయన్నలు , లోక్‌సత్తా నాయకులు ఎన్.శ్రీనివాస్, ప్రకాశ్ హోల్లాలు డిమాండ్ చేశారు. ఇదిలా వుండగా ఈ ఘటనపై స్పందించిన కరీంనగర్ సీపీ వీబీ కమలాసన్ రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

రామయ్యకు పెళ్లి కళ

శ్రీరామనవమికి భద్రాద్రి సిద్ధం

నేడు శ్రీ సీతారాముల కల్యాణం



ఆదివారం భద్రాద్రిలో ఎదుర్కోలు తంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి రామయ్యకు పెళ్లి కళ వచ్చింది. ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియంలో సోమవారం జరిగే శ్రీ సీతారాముల కల్యాణ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. స్వామి వారి కల్యాణానికి సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేశారు. రామాలయానికి విద్యుత్ దీపాలను అమర్చటంతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. భక్తులందరికీ స్వామి వారి ప్రసాదాలను అందజేసేందుకు మూడు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇతర వీవీఐపీలు కూర్చునే సెక్టార్‌లో ఏసీని అమర్చారు. కాగా, స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం రాత్రి వైభవోపేతంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల కల్యాణం సందర్భంగా వారి వంశాల గొప్ప దనాన్ని గురించి చెప్పుకునే ఈ వేడుక ఆద్యంతం కనువిందు చేసింది.

పెద్దపల్లి దేవాదాయ భూముల వివాదం

వివాద పరిష్కారానికి ముఖ్యమంత్రి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి జిల్లాలో నెలకొన్న దేవాదాయ భూముల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం కాసులపల్లి, గోపయ్యపల్లి, పాలితం గ్రామాలకు చెందిన 462 ఎకరాల భూమి విషయంలో నెలకొన్న వివాదాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన కేసీఆర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని, కాస్తులో ఉన్న రైతులకు హక్కులు కల్పించాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

కోదాడ రూరల్/గరిడేపల్లి: సూర్యాపేట జిల్లాలో ఆదివారం విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. కోదాడ మండలం దోరకుంటకు చెందిన చింతకాల చిన్నకోదండు(68), అలాగే గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన శ్రీనివాస్(27) పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.

రైతు ఆత్మహత్య

త్రిపురారం(నాగార్జునసాగర్): నల్లగొండ జిల్లా అనుముల మండలం కొట్టాల గ్రామానికి చెందిన రైతు పిట్టల ఉపేందర్ (34) తన ఎకరం పొలంతోపాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తిపంట సాగు చేస్తున్నాడు. సాగు పెట్టుబడులు, కుటుంబ అవసరాల కోసం రూ.6 లక్షల అప్పు చేశాడు. దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. వాటి ని తీర్చే మార్గం కానరాక శనివారం రాత్రి ఫ్యాన్ కు ఉరేసుకుని బలవర్మణానికి పాల్పడ్డాడు.



ముస్తాబైన ఇల్లందకుంట రామాలయం

అపర భద్రాద్రి 'ఇల్లందకుంట'

నేడు సీతారాముల కల్యాణం

పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

సమర్పించనున్న మంత్రి ఈటల దంపతులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అపర భద్రాద్రి.. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట రాములోరి పెళ్లికి సర్వం సిద్ధమైంది. భద్రాచలం తర్వాత అతిపెద్ద రామాలయం ఇది. సోమవారం నుంచి జరిగే శ్రీరామనవమి వేడుకల కోసం భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కల్యాణం సందర్భంగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు పాటు ఎల్‌ఈడీలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా కూలర్లు, ఫ్యాన్‌లు, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయంలో విద్యుద్దీకరణ, సుందరీకరణ పనులు పూర్తి చేశారు. భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు. కొత్తపల్లి నుంచి జాతర స్థలి వరకు గల రహదారిపై భారీ ముగ్గులు వేయించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కల్యాణ మండపాన్ని వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. కాగా, సీతారాముల కల్యాణానికి ప్రభుత్వం తరపున మంత్రి ఈటల రాజేందర్, జమున దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఈ మహోత్సవానికి కరీంనగర్ జిల్లా సీపీ కమలాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 300 మంది సిబ్బందితో భారీ బందోస్తును ఏర్పాటు చేస్తున్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792